
సీఎం జగన్మోహన్‌రెడ్డి రావడం, జిల్లా అంశాలపై దృష్టిపెట్టడం అత్యాశగానే మిగులుతోంది. ముఖ్యమంత్రి హోదాలో ఆయన గతంలో పది సార్లు జిల్లాకు వచ్చారు. అందులో ఐదుసార్లు తమ పార్టీ వారికి చెందిన ప్రైవేటు కార్యక్రమాలకే హాజరు కాగా, నాలుగు సార్లు రాష్ట్రస్థాయి ప్రభుత్వ పథకాల సభలకు వచ్చారు. కేవలం జిల్లాకు సంబంధించిన అంశాల పరంగా చూస్తే 2020 ఫిబ్రవరి 20న వెలిగొండను సందర్శించారు. ఇక 11వ సారి శుక్రవారం ఒంగోలుకు రానున్నారు. నగర పరిధిలోని పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి సీఎం వస్తున్నారు. కాగా జిల్లా అభివృద్ధి, ఉపాధి రంగాలు, మౌలిక వసతుల మెరుగుకు సీఎం హోదాలో ఇచ్చిన హామీల అమలు ఉత్తదే. అలాగే అంతకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీలనూ మర్చిపోయారు. అలాగే గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన కీలక అంశాలపై ప్రస్తుత ప్రభుత్వం పెద్దగా దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. మొత్తంగా జిల్లాకు సీఎం చేసిన అభివృద్ధి, మౌలిక సదుపాయాలు శూన్యమే అని చెప్పవచ్చు.



వెలిగొండపై దాటవేత ధోరణి

జిల్లాకు ప్రధానమైన వెలిగొండ విషయం చూస్తే ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పూర్తిచేసి నీరిస్తామని ప్రతిపక్ష నేతగా, ఎన్నిక ప్రచారంలో పలుమార్లు జగన్ చెప్పారు. సీఎం అయ్యాక 2020 ఫిబ్రవరిన వెలిగొండను సందర్శించి అదే ఏడాది ఆగస్టుకు తొలి టన్నెల్ ద్వారా నీరిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ కాలం ముగుస్తున్నా ఇంతవరకు ఇవ్వలేదు. నాలుగున్నరేళ్లలో వెయ్యి కోట్లు కూడా ఖర్చు పెట్టలేదు. నిర్వాసితులకు రూ.1,300 కోట్లకు 2021 ఫిబ్రవరిలో జీవో ఇచ్చినా ఇంతవరకు నిధులు ఇవ్వక వారి తరలింపు ఆగిపోయింది. రెండు టన్నెళ్ల పనులు పూర్తయినా ప్రస్తుతం నదిలో నీరు లేక తీసుకునే వీలులేకపోగా నిర్వాసితుల తరలింపు, ఫీడర్ కాలువ ఇతర పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా రూ.3,600కోట్లకుపైగా అవసరం.

- మరో కీలకమైన గుండ్లకమ్మ నిర్వహణను గాలికొదిలేశారు ఏళ్లతరబడి గేట్ల మరమ్మతులను పట్టించుకోకపోవడంతో రెండుసార్లు గేట్లు కొట్టుకుపోయాయి. రూ.10కోట్ల ఖర్చుతో జరిగే పనులు పట్టించుకోక వరుసగా రెండేళ్ల కీలక సమయంలో గేట్లు కొట్టుకుపోయి నీరంతా సముద్రం పాలై రైతులు అల్లాడుతున్నారు. దీంతో ఆయకట్టులో సుమారు రూ.500 కోట్ల మేర పంట ఉత్పత్తులను రైతులు కోల్పోయారు. ఇతర సాగునీటి వనరులపైనా ఇదే నిర్లక్ష్యం జరిగింది.


వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగం

కొత్త పరిశ్రమల ఊసే లేదు

కొత్తగా పరిశ్రమల ఏర్పాటు, సహజవనరుల సద్వినియోగం వంటివి పట్టించుకోకపోయినా కనీసం గతంలో మంజూరైన, ప్రభుత్వాలు చేపట్టిన ప్రాజెక్టులను కూడా తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కేంద్రం మంజూరు చేసిన నిమ్జ్‌కు స్థలం మార్పు చేశారు తప్ప ఒక్క అడుగు ముందుకు పడలేదు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో పెద్దఎత్తున పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన దొనకొండ కారిడార్ వద్ద పరిశ్రమల ఏర్పాటుకు ఏమాత్రం చొరవ చూపలేదు. సోలార్ ప్లాంట్ అంటూ హడావుడి చేసి వదిలేశారు. ఎంఎస్ఎంఈ పార్కులది అదే పరిస్థితి కాగా అంతోఇంతో ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ రంగం కూడా ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో పడింది.

ప్రచారార్భాటమే!

వైసీపీ పాలనలో జిల్లాపై శీతకన్ను ▪ నేడు 11వ సారి జిల్లాకు సీఎం

అభివృద్ధి, ఉపాధిపై కొరవడిన దృష్టి

ఒంగోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వైసీ పీ పాలనలో జిల్లాపై దృష్టి కొరవడింది. శాశ్వత అభివృద్ధి, ఉపాధి కల్పన రంగాలు, ఇతర మౌలిక అంశాలపై ప్రభుత్వ పరంగా పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. కొత్తగా జిల్లాకు ఉపకరించే పథకాలు, కీలక అభివృద్ధి ప్రాజెక్టులు లేకపోయినా కనీసం గతంలో చేపట్టిన వాటి పూర్తి విషయంలోనూ నిర్లక్ష్యమే కొనసాగింది. జిల్లా అభివృద్ధి, ఉపాధి మార్గాల పెంపునకు ఉపకరించే ఏ ఒక్కటి ఈ ప్రభుత్వ కాలంలో పూర్తికాకపోవడం అందుకు నిదర్శనం. పాలనా పరంగా చూసినా ముందుచూపు లేకుండానే సాగిపోయింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక జిల్లా అభివృద్ధిలో కీలకమైన డీఆర్సీ నిర్వీర్యమైంది. నలుగురు ఇన్‌చార్జి మంత్రులు మారగా ఆ సమావేశాలు జరగడమే గగనంగా మారింది. చివరి సమావేశం 2023 ఏప్రిల్ 25న జరగ్గా మళ్లీ దాని ఊసేలేదు.

నిధులివ్వకుండా నిర్లక్ష్యం


కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పూర్తిచేసి నీరిస్తామని పదేపదే చెప్పిన జగన్.. ప్రభుత్వం పదవీ కాలం ముగుస్తున్నా పట్టించుకోలేదు. పైగా టన్నెళ్ల పూర్తయ్యాయి.. నీళ్లిస్తామని ముంపువాసులను భయపెడుతున్నారు.

మరో ప్రధానమైన గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. కనీసం గేట్లు మరమ్మతులు కూడా చేయక అవి కొట్టుకుపోయి ఆయకట్టు రైతులు నీరందక తీవ్రంగా నష్టపోయారు. ట్రిపుల్‌ఐటీ, యూనివర్సిటీ నిర్మాణాలకు ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క ఇటుక పెట్టిన దాఖలాలు లేకపోగా ఈ ప్రభుత్వం మంజూరుచేసిన మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణంలో పదిశాతం మించి వ్యయం జరగలేదు. దోర్నాలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అసంపూర్తిగానే ఉంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంపొందించే కనిగిరి నిమ్జ్, దొనకొండ కారిడార్‌ల ఊసే కొరవడింది. నేటికి వందలాది గ్రామాల్లో ప్రజలు దాహార్తితో తల్లడిల్లిపోతున్నారు. కీలకమైన రోడ్లు, ఇతర రంగాల అభివృద్ధి నిర్లక్ష్యం చేయడమే కాక కేంద్రం నుంచి భారీగా నిధులు సమకూరే రైల్వే, జాతీయ రహదారులు, ఇతర ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేయడంలోనూ రాష్ట్రప్రభుత్వం నుంచి చొరవ లేక ముందుకు సాగడం లేదు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన భవన నిర్మాణాలు, చివరకు తాగునీటి సరఫరా బిల్లులు కూడా సకాలంలో రాక పనులు చేసిన వారు గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఒంగోలులో పేదలకు పట్టాలు పంపిణీ పేరుతో సీఎం వస్తుండగా ఎన్నికల్లో లబ్ధిప్రయత్నం తప్ప జిల్లా అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వానికి ధ్యాస లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- కీలకమైన తాగునీటి పథకాల పరిస్థితి దారుణంగా ఉంది. వెలిగొండ ఆధారంగా రూ.1,210 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పథకం మూడేళ్లు అవుతున్నా టెండర్ల దశకు చేరకపోగా కేంద్ర భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ పనులు ముందుకు సాగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని 3.62లక్షల ఇళ్లకు ఇంటింటికీ కొళాయి ద్వారా జలజీవన్ నుంచి నీరివ్వాలన్నది లక్ష్యం. నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఇంకా లక్షన్నర కుటుంబాలకు కూడా పూర్తికాలేదు. కొత్తపట్నం మండలంలో రూ.55 కోట్లతో సూపర్ ఆర్వో ప్లాంట్‌కు రెండున్నరేళ్ల క్రితం సీఎం హామీ ఇచ్చినా ఇంతవరకు అతీగతి లేదు. వర్షాకాలం, వేసవికాలం తేడా లేకుండా పశ్చిమప్రాంతంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ట్యాంకర్లతో సరఫరా తప్ప మరో మార్గం లేని గ్రామాల్లో ఇతర వనరులు కల్పన చేయకపోగా ట్యాంకర్ల సరఫరాను నిలిపేశారు. ప్రస్తుతం వంద గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజానీకం అల్లాడుతున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో పరిశీలిస్తే ఒంగోలు నగరంలో ప్రతిరోజు నీటిసరఫరా పేరుతో రూ.409 కోట్లతో తాగునీటి పథకం ఇస్తున్నట్లు 2021 అక్టోబరు 7న ఒంగోలు సభలో సీఎం ప్రకటించారు. అనంతరం దానిని రూ.339 కోట్లకు తగ్గించి మంజూరు చేయగా టెండర్లు పిలిచారు. టెండర్ల ఆమోదం కోసం సంబంధిత అధికారులు ప్రభుత్వానికి పంపినా పెండింగ్‌లో ఉండడంతో పనులు ప్రారంభం కాలేదు వివిధ అర్బన్ స్థానిక సంస్థల్లో మంజూరైన పనులదీ అదే పరిస్థితి.
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక పలుశాఖల పరిధిలో బిల్లులు పేరుకుపోయి పనులు చేసిన కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. కొన్ని పనులను ఆపేస్తున్నారు. భవనాలు, ఇతర పనులేకాక చివరకు తాగునీటి బిల్లులు సైతం ప్రభుత్వం ఇవ్వడం లేదు. వంద కోట్లకు పైగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న వివిధ భవనాల బిల్లులు పెండింగ్‌లో ఉండగా రూ.50 కోట్ల వరకు ఆర్‌డబ్ల్యూఎస్, మరో రూ.29 కోట్లు పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.
- సీఎం హోదాలో జగన్ 11వసారి శుక్రవారం జిల్లాకు వస్తున్నారు. ఒంగోలు నగరపరిధిలోని పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ పేరుతో వస్తున్నారు. ముఖ్యమంత్రిగా తొలిసారి 2019 నవంబరు 14న ఒంగోలులో మన బడి, నాడు-నేడు పథకాన్ని ప్రారంభించారు. 2020 ఫిబ్రవరి 20న వెలిగొండకు రాగా 2021 అక్టోబరు 7న ఆసరా పథకం ప్రారంభోత్సవానికి ఒంగోలు, 2022 ఏప్రిల్ 22న సున్నా వడ్డీ విడుదలకు ఒంగోలు వచ్చారు. 2023 ఏప్రిల్ 12న మార్కాపురంలో ఈబీసీ నేస్తం ప్రారంభానికి రాగా, మిగిలిన ఐదుసార్లు అధికారపార్టీకి చెందిన నేతల వ్యక్తిగత లేదా కుటుంబకార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చారు.

నాడు-నేడు పేరుతో భారీగా నిధులు వెచ్చించి విద్య, వైద్య సంస్థల్లో సౌకర్యాలు మెరుగుపర్చామని గొప్పలు చెప్పుకుంటున్నా జిల్లాలో సగం చోట్ల కూడా ఆపనులు కొలిక్కి రాలేదు. మరోవైపు గత ప్రభుత్వంలో మంజూరుచేసి శంకుస్థాపనలు జరిగిన ట్రిపుల్‌ఐటీ, ఏకే యూనివర్సిటీల నిర్మాణానికి ఒక్క రూపాయి ఖర్చుపెట్టలేదు. దీంతో సౌకర్యాలు సరిలేక విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఇక ఈ ప్రభుత్వం వచ్చాక మార్కాపురంలో మెడికల్ కాలేజీ మంజూరుచేసింది. షెడ్యూల్ ప్రకారం 2024-25లో తరగతులు ప్రారంభించాలి. అయితే రూ.475 కోట్లతో మంజూరైన ఆ కళాశాల నిర్మాణాలు అధికభాగం పునాదులు దాటలేదు. కేవలం రూ.50కోట్లు లోపుగానే ఖర్చుచేయగా శరవేగంగా చేసినా మరో రెండేళ్లకుపైగా పట్టే పరిస్థితి. దోర్నాలలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌ది అదే పరిస్థితి.

ఏడాదిలోనన్న వెలిగొండ నేటికీ పూర్తికాలేదు
గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకూ దిక్కులేదు
ఊసేలేని పారిశ్రామిక, ఉపాధి రంగాల అభివృద్ధి
ఒక్క ఇటుక పడని ట్రిపుల్‌ఐటీ, యూనివర్సిటీ
తాగునీటి పథకాలు మందగమనం
వేసవి రాకముందే పశ్చిమాన దాహం కేకలు
ఇతర మౌలికరంగాలు అంతంతమాత్రమే
డీఆర్సీ నిర్వీర్యం


లీకవుతున్న గుండ్లకమ్మ గేటు(ఫైల్)

ఉమ్మడి జిల్లాలోని కొత్తపట్నం, వాడరేవుల వద్ద ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటుకు మూడేళ్ల క్రితం ప్రకటించారు రూ.400 కోట్లతో కొత్తపట్నం, రూ.420 కోట్లతో వాడరేవుల వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన ఈ ప్రాజెక్టులకు అధికభాగం కేంద్రం, నాబార్డు నుంచి నిధులు వస్తాయి. రాష్ట్రప్రభుత్వం తగు చొరవ చూపక వాటి నిర్మాణాలు ప్రారంభమే కాలేదు.

లేదర్ పార్కుల ఏర్పాటు, దర్శిలో డ్రైవింగ్ స్కూలు, మొగలిగుండాల రిజర్వాయర్, సంగమేశ్వర ప్రాజెక్టులు వంటి వాటి ఊసేలేకపోగా మార్కాపురం పర్యటన సందర్భంగా అక్కడ పలు పలు భవనాల నిర్మాణాలకు హామీ ఇచ్చినా ఆ పనులు ప్రారంభం కాలేదు. జడ్పీ నూతన భవన నిర్మాణానికి హామీ ఇచ్చినా దానిది అదే పరిస్థితి.



వైసీపీ దిగజారుడు రాజకీయం

చంద్రబాబు మాటలతో ఫేక్ ఐవీఆర్ఎస్

వారి నిర్వాకంపై తమ్ముళ్లు ఆగ్రహం

పొదిలి, ఫిబ్రవరి 22: రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఎదురుదెబ్బలు తప్పవని ఆ పార్టీ నిర్ధయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే మరింత దిగజారుడు రాజకీయానికి తెరతీసింది. చంద్రబాబునాయుడు మాట్లాడినట్లు ఫేక్ వాయిస్‌తో ఐవీఆర్ఎస్ సర్వే అంటూ టీడీపీ నాయకులకు వాయిస్ మెసేజ్‌లు పంపింది. మార్కాపురం టీడీపీ అభ్యర్థిపై వ్యక్తిగత అభిప్రాయం సేకరిస్తున్నట్లు గురువారం బాబు వాయిస్‌తో టీడీపీ నాయకులకు ఫోన్‌కాల్స్ వచ్చాయి. దీంతో నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు కొంతసేపు ఆందోళనకు గురయ్యారు. టీడీపీ అభ్యర్థిగా చింతలచెరువు సత్యనారాయణపై మీ అభిప్రాయం తెలియజేయండంటూ వచ్చాయి. ఆ అభిప్రాయాన్ని ఒకటి నొక్కడం ద్వారా బలపరచాల్సిందిగా ఫోన్ సందేశం వచ్చింది. నోటా అయితే రెండు నొక్కండి అనే వాయిస్ వచ్చింది. దీంతో ఒక్కసారిగా టీడీపీ శ్రేణులు ఉలిక్కిపడ్డాయి. ఆ తరువాత కొంతసేపటికి అవి ఫేక్‌కాల్స్ అని తేలింది. వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని జిల్లా ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్, జిల్లా టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి గౌస్ తదితర టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనాన్ని తట్టుకోలేక ఇలాంటి చిల్లర పనులకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు.

తాయిలాలు.. బెదిరింపులు!

సభకు వస్తే చీరలు.. లేకుంటే పథకాల్లో కోత

పొదుపు మహిళలు, లబ్ధిదారులకు కాల్స్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 22 : సీఎం సభను విజయవంతం చేసేందుకు వైసీపీ నేతలు ఒకవైపు తాయిలాలు ఆశ చూపుతూనే మరోవైపు వలంటీర్లతో బెదిరింపులకు దిగుతున్నారు. సభకు వచ్చే భార్యాభర్తలకు చీర, ప్యాంట్ షర్ట్‌లు ఎరగా వేస్తున్నారు. పొదుపు మహిళల తరలింపులో మెప్మా ఆర్పీలు, సీఓలు, ఇతర సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.5వేలను బహుమతిగా గురువారమే కీలక నేత పంపిణీ చేసినట్లు సమాచారం. దీంతో ఆర్పీలు పొదుపు మహిళలపై ఒత్తిడి పెంచారు. హాజరు కాని వారికి అమ్మఒడి, చేయూత, ఆసరా పథకాలను తొలగిస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. దాంతోపాటు వలంటీర్లకు తాయిలాలు ఆశగా చూపారు. ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున సీఎం సభ ముగిసిన తర్వాత ఇంటికి చేరుస్తామని వెల్లడించినట్లు తెలిసింది. వచ్చే ప్రతి మహిళకు చీర అందించే వీలు లేకపోవడంతో వలంటీర్ల ద్వారా ఇంటికే పంపాలని నిర్ణయంచినట్లు తెలిసింది.

జన సమీకరణకు గందరగోళం

నేడు ఎస్.అగ్రహారంలో జరిగే పేదల పట్టాల పంపిణీకి భారీగా జన సమీకరణ చేయాలని వైసీపీ నేతలు భావిస్తుండగా, ప్రతి డివిజన్‌కు ప్రత్యేకంగా ప్రైవేటు స్కూలు బస్సులు, ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. ఆర్పీలకు వేరుగా, స్థానిక వైసీపీ కార్పొరేటర్లకు వేరుగా బస్సులు కేటాయించడంతో ఆయా డివిజన్లలో మహిళల తరలింపు కోసం అటు ఆర్పీలు, వార్డు వలంటీర్లు, ఇటు వైసీపీ నేతలు ఎవరి పరిధిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వెళ్లే సభ ఒకటే కాగా, ఎవరి బస్సు ఎక్కాలో అర్థం కాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.



నేడు ముఖ్యమంత్రి ఒంగోలు రాక

పేదలకు పట్టాల పంపిణీ, మంచినీటి పథకం పైలాన్ ఆవిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఒంగోలు రానున్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని ఎస్.అగ్రహారంలో పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఉదయం 10.15 గంటలకు హెలికాప్టర్‌లో అగ్రహారం చేరుకునే ఆయన మధ్యాహ్నం 1.50కు బయలుదేరి తాడేపల్లి వెళ్తారు. మూడున్నర గంటలకుపైగా ఒంగోలులో ఉండనున్నారు. 10.45కు బహిరంగ సభ వద్దకు వచ్చే జగన్ అక్కడ ఏర్పాటుచేసిన ఇళ్ల పాట్లకు శంకుస్థాపన, ఒంగోలుకు మంచినీటి పథకం ప్రాజెక్ట్‌కు పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. 10.50 నుంచి 11 గంటల వరకు సభావేదిక వద్ద ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. అనంతరం బహిరంగసభలో పాల్గొంటారు. ఉదయం 11.35 నుంచి మధ్యాహ్నం 12.35 వరకు లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సభ అనంతరం అక్కడ ప్రజాప్రతినిధులతో గంటపాటు చర్చించనున్నారు.


ఒంగోలు మినీ స్టేడియంలో ఏర్పాట్లు చేసిన బస్‌లు

పొదుపు సంఘాలపై గురి

పొదుపు మహిళల తరలింపునకు వెయ్యికిపైగా వాహనాలు

ఒంగోలుతోపాటు చుట్టుపక్కల మండలాలే లక్ష్యం

రాత్రికే గ్రామాలకు చేరుకున్న బస్సులు

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 22 : సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సభకు పొదుపు సంఘాల మహిళలను వేలాదిగా తరలించేందుకు సెర్ప్ అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం పేదలకు పట్టాలు పంపిణీ చేసే ఒంగోలు అర్బన్ ప్రాంతంలోని మహిళలతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పొదుపు మహిళల్ని ఎక్కువ సంఖ్యలో సభకు తరలించేందుకు 1000కిపైగా బస్సులను ఇప్పటికే గ్రామాలకు పంపించారు. ఇందులో ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ పాఠశాలల బస్సులను కూడా అధికారయంత్రాంగం బలవంతంగా తెప్పించి ఆయా ప్రాంతాలకు గురువారం రాత్రికే పంపింది. గురువారం ఉదయాన్నే బస్సులు మహిళలతో బయలుదేరి సీఎం సభాప్రాంగణానికి చేరుకోవాలి. ఒంగోలు నగరంలో 50వేల మంది పొదుపు సంఘాల మహిళలను సభాప్రాంగణానికి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది మహిళలు నివేశన స్థలాల్లో లబ్ధిదారులుగా ఉన్నారనేది అధికార యంత్రాంగం వాదన. అందుకే అర్బన్ ప్రాంతం నుంచి ఎక్కువమంది మహిళల్ని తరలిస్తున్నాం అంటున్నారు. దాదాపు 250 బస్సులను కొండపి, ఎస్ఎన్‌పాడు, ఒంగోలురూరల్ మండలం, కొత్తపట్నం, టంగుటూరు మండలాలకు పంపించారు. సీఎం సభను విజయవంతం చేసే దిశగా రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఇంతియాజ్ గురువారం ఉదయమే జిల్లాకు చేరుకున్నారు. ఆయన వైకేపీ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఒక్కో బస్సుకు ఆయా ప్రాంతాల్లోని సీసీలను ఇన్‌చార్జిలుగా నియమించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి 15వేల మంది మహిళల్ని తరలించేందుకు బస్సులను సిద్ధం చేసినట్లు వైకేపీ వర్గాలు చెబుతున్నాయి.

మహిళా టీచర్ల ఆకలి కేకలు

» ఆరు నెలలుగా జీతాలు లేని వైనం » ట్రెజరీలో పీటముడి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 22: జిల్లాలో కొందరు మహిళా ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారి ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. ఆరు నెలల నుంచి వీరి జీతాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణ గగనమై ఇబ్బందిపడుతున్నారు. అందిన సమాచారం మేరకు 12 మంది టీచర్ల జీతాలు నిలిచిపోయాయి. వీరితోపాటు బదిలీ ఉత్తర్వులు పొందిన కొందరు టీచర్లకు జీతాలు చెల్లిస్తున్న ట్రెజరీ అధికారులు వీరి జీతాల చెల్లింపులో కొర్రీల మీద కొర్రీలు వేస్తూ జీతాల చెల్లింపు విషయాన్ని మరింత జఠిలం చేశారు. జీతాల చెల్లింపులో పడ్డ పీటముడి వీడటం లేదు. జీతాల చెల్లింపు కోసం జిల్లా విద్యాశాఖాధికారి, కలెక్టర్ ఇక్కడి ఖజానా అధికారులకు లేఖ రాసినా స్పందించడం లేదు. దూరప్రాంతాలకు బదిలీ అయిన ఈ టీచర్లు అనారోగ్యం, కుటుంబసభ్యులకు సమస్యల నేపథ్యంలో ప్రభుత్వం ద్వారా ఉత్తర్వులు పొంది నగర చుట్టుపక్కల మండలాలకు వచ్చారు. ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. జీతాల చెల్లింపులో ఎదురైన సమస్యలతో వారి కష్టాలు మొదలయ్యాయి. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వీరి జీతాల కోసం ఖజానా శాఖ అధికారులతో సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది.

మిగతా ఓకే.. ఆ 12మందికే కొర్రీ

జిల్లాలో గతేడాది జూన్‌లో ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో దూర ప్రాంతాలకు బదిలీ అయిన కొందరు టీచర్లు ఖాళీగా ఉన్న దగ్గరి స్థానాలకు బదిలీ కోసం ప్రభుత్వంతో సంప్రదించారు. ప్రజాప్రతినిధుల సిఫార్సులతో వీరికి దగ్గరి స్థానాలకు బదిలీ అయింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టెలిఫోనిక్ ఉత్తర్వులతో వాట్సప్‌కు ఫార్వార్డ్ అయిన టీచర్లు ఖాళీలకు అనుగుణంగా డీఈవో బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుని పేరుతో ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం, బదిలీ కోరుకున్న స్థానం పేరుతో డీఈవోకు వచ్చిన ఎక్సెల్ షీట్ ప్రకారం బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. మొదటి జాబితాలో సుమారు 30పేర్లు రాగా వీరికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. వారికి ఎటువంటి సమస్య లేదు. వారందరికీ యథావిధిగానే జీతాలు చెల్లిస్తున్నారు. రెండో జాబితాలో 83 మంది టీచర్ల పేర్లు వచ్చాయి. వీరిలో నలుగురి పేర్లు రిపీట్ కాగా ముగ్గురు ఇతర జిల్లాల వారు ఉన్నారు. ఈ జాబితాలో జిల్లాకు చెందిన వారు నికరంగా 76 మంది ఉన్నారు. వీరిలో 45 మందికి వారు కోరుకున్న స్థానాలకు డీఈవో బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు మిగిలిన 31 మంది టీచర్లకు వారు కోరుకున్న స్థానాలు ఖాళీ లేకపోవడంతో బదిలీ ఉత్తర్వులు ఇవ్వలేదు. బదిలీ ఉత్తర్వులు పొందిన 45 మందిలో 12 మందికి అసలు జీతాలు చెల్లించకపోగా ఇద్దరికి మాత్రం రెండు నెలల జీతాలు ఇచ్చిన వారికి కూడా నిలిపివేశారు. మిగిలిన వారికి మాత్రం జీతాలు చెల్లిస్తున్నారు.

డైరెక్టర్ కార్యాలయం చెప్పినా..

ఆయా టీచర్లకు జీతాలు చెల్లించే విషయంలో ఖజానాధికారులు కొర్రీలు వేస్తూ సమస్యను మరింత జఠిలం చేస్తున్నారు. మొదట డీఈవో ఒక లేఖ ఇస్తే జీతాలు చెల్లిస్తామని చెప్పారు. ఆ మేరకు డీఈవో బదిలీ ఉత్తర్వులు జారీచేసిన 45 మంది టీచర్ల పేరుతో ఖజానాధికారికి లేఖ రాశారు. వీరికి జీతాలు చెల్లించాలని ఆ లేఖలో కోరారు. కలెక్టర్ కూడా ఈ 12మందికి జీతాలు చెల్లించాల్సిందే అంటూ నోట్ ఆర్డర్ జారీచేశారు. కలెక్టర్ చెబితే జీతాలు ఇస్తామన్న ఖజానాధికారులు ఆయన మాటను కూడా పట్టించుకోలేదు. జీతాలు చెల్లించాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా జిల్లా ఖజానాధికారికి లేఖ రాసినా పట్టించుకోలేదు. ఖజానా శాఖ డైరెక్టర్ కార్యాలయంలో కూడా ఈ జీతాల చెల్లింపుపై వివరణ ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగు నిర్ణయం తీసుకోవాలని ఇక్కడి అధికారులను ఖజానా డైరెక్టర్ కార్యాలయం ఆదేశించింది. తీరా చివరకు డైరెక్టర్ కార్యాలయం నుంచి తమకు స్పష్టమైన ఉత్తర్వులు ఇస్తేనే జీతాలు చెల్లిస్తామని మెలిక పెడుతుండటం గమనార్హం.



అప్పులతో పోషణ

ఆరు నెలల నుంచి జీతాలు రాని టీచర్లు లబోదిబోమంటున్నారు. అప్పులు చేసి కుటుంబ పోషణ చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. గత ఐదు నెలలుగా బ్యాంకు రుణాలకు నెలసరి వాయిదాలు నిలిచిపోయాయి. చివరకు మళ్లీ బ్యాంకు రుణాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని జీతాలు వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయులు వేడుకుంటున్నారు

టీడీపీకి ఓటుతో బంగారు భవిష్యత్

- బాబు అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగాలు
- రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల పిలుపు
- ఒంగోలులో యువతా మేలుకో కార్యక్రమం





సదస్సులో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్, భారీగా తరలివచ్చిన విద్యార్థులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 22: రాష్ట్రంలో నేడు యువత ఉద్యోగాలు లేక ఉపాధి అవకాశాలు రాక నిస్సహాయ స్థితిలో ఉన్నారని, చంద్రబాబు అధికారంలోకి రాగానే యువతకు బంగారు భవిష్యత్ వస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. 'యువతా మేలుకో-ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమాన్ని గురువారం ఒంగోలులోని విష్ణుప్రియఫంక్షన్ హాలులో నిర్వహించారు. గోరంట్ల రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దామచర్ల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్ళిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హైదరాబాద్ మహానగరాన్ని ఐటీ నగరంగా మార్చారన్నారు. నేడు వేలాది మంది యువత సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడటానికి హైదరాబాద్ వెళుతున్నారని, అలాంటి బంగారు భవిష్యత్ ఇచ్చిన ఘనత టీడీపీదే అని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో యువత సరైన నాయకుడును ఎన్నుకోవాలన్నారు. విలువైన ఓటుతో రాష్ట్రాన్ని కాపాడాలని, అలాగే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసి యువత తమ భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలని కోరారు. యువత తలచుకుంటే రాష్ట్ర తలరాతను మార్చే శక్తి ఉందన్నారు. అప్పుల ఊబిలో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలంటే తెలుగుదేశం పార్టీకే సాధ్యమని పేర్కొన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ళ దుర్మార్గపు పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలను అందరూ చూశారన్నారు. మరోసారి అలాంటి దుర్మార్గపు వైసీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలే కాకుండా ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా నష్టపోయేది యువతే అని హెచ్చరించారు. రాష్ట్రం బాగుండాలన్నా, యువత భవిష్యత్ ఉన్నతంగా ఉండాలంటే టీడీపీకి ఓటు వేయాలని దామచర్ల పిలుపునిచ్చారు. ఎంతో విలువైన ఓటును కేవలం డబ్బులతో కొనాలనుకునే వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్‌తో పాటు, ఐటీరంగాన్ని ఏర్పాటు చేసి, హైదరాబాద్ మహానగరం కంటే మరింత ఉన్నతంగా రాష్ట్రంలో ఐటీ హబ్ తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. ఎంతో మేధోశక్తి కలిగిన యువత తమ ఓటుతోపాటు తల్లిదండ్రులకు రాష్ట్ర పరిస్థితిలు వివరించి, రాష్ట్ర భవిష్యత్ బాగుపడేలా టీడీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీహర్షిణి కాలేజి అధినేత గోరంట్ల రవికుమార్, దామచర్ల కుమార్తె అనీషా, పార్టీ నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, మహిళ నాయకులు ఆర్ల వెంకటరత్నం, నాళం నరసమ్మ, ఆర్.పద్మజ, బీరం అరుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 22: ఒంగోలు నగరం మామిడిపాలెంకు చెందిన పలువురు వైసీపీ యువత గురువారం తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈ మేరకు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ నాయకుడు కళ్ళతోటి ఉదయ్ నేతృత్వంలో పార్టీలో చేరిన వారితో దామచర్ల మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం కృషి చేయాలని సూచించారు. అన్ని వేళలా తాను అండగా ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం : బీఎన్



ఇంటింటి ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తి, ఫిబ్రవరి 22 : అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం తెలుగు దేశం పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని చీమకుర్తి పట్టణం గాంధీనగర్‌లో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ ఇంటింటా తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేయబోయే సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. వాటివలన కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించారు. గాంధీనగర్‌లో మహిళలు విజయ్‌కుమార్‌కు పెద్దఎత్తున స్వాగతం పలకటం విశేషం. కార్యక్రమంలో నాయకులు మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, సూరంపల్లి హనుమంతరావు, భువనగిరి వెంకాయమ్మ, పరాల శ్రీను, యడపల్లి రామబ్రహ్మం, ఉన్నం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి క్షమాపణ చెప్పాలి



నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : అగ్నికుల క్షత్రియ కులంపై కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని అగ్నికుల క్షత్రియ మత్స్యకార సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొండబాబుపై ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అత్యంత దారుణంగా కులం పేరుతో తిట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్రంలో 40 లక్షలకు పైగా అగ్నికుల క్షత్రియ మత్స్యకార ఓటర్లు ఉన్నారని, ద్వారంపూడి క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసి అన్ని నియోజకవర్గంలో మత్స్యకార ఓటర్లను చీలుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వీనర్ నాయుడు గోపాల్, దమ్ము శ్రీను, రాసాని కృష్ణ, అవనిగడ్డ బాలకృష్ణ, సింగోతు గోవిందు, తంబు ఏడుకొండలు, కొక్కిలిగడ్డ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలో అద్దంకిని జయప్రదం చేయండి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

చీమకుర్తి, ఫిబ్రవరి 22 : ఎస్సీ వర్గీకరణ సాధనకై మార్చి నెల 2వ తేదీన అద్దంకిలో నిర్వహించనున్న మందా కృష్ణమాదిగ హాజరుకానున్న సభను జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగ సంఘ నాయకులు కోరారు. గురువారం చీమకుర్తి పట్టణంలోని క్రిస్టియన్‌పాలెం కమ్యూనిటీహాల్ వద్ద చలో అద్దంకి సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బొంతా ఏసుదాసు, జె.యాకోబు, పి.బాబురావు, ఆలూరి చిరంజీవి, కోటేశ్వరరావు, విజయ్, జక్రయ్య, సాల్మన్, కర్ణా ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వేపాడకు బీఎన్ శుభాకాంక్షలు



చిరంజీవిని సత్కరిస్తున్న బీఎన్

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 22: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యులు వేపాడ చిరంజీవిని టీడీపీ ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చారిజ బీఎన్.విజయ్‌కుమార్ కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో వేపాడ చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రత

- విధుల్లో1700మంది పోలీసు సిబ్బంది
- తాడేపల్లి నుంచి హెలికాప్టర్ ట్రయిల్ రన్



బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్ తనిఖీలు



వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి22: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒంగోలు పర్యటన కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. భద్రతా విధుల్లో 1700 మంది పోలీసులు పాల్గొననున్నట్లు చెప్పారు. ఒంగోలు నగరంలోని మల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లలో ఇళ్ళ స్థలాల పట్టాలు పంపిణీ చేసేందుకు శుక్రవారం ఎన్.అగ్రహారం రానున్న ముఖ్యమంత్రి పర్యటనకు భారీగా భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. బందోబస్తు నిమిత్తం ముగ్గురు ఏఎస్పీలు, 16మంది డీఎస్పీలు, 50మంది సీఐలు, 113 మంది ఎస్సైలు, 292 మంది హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్సైలు, 745 మంది కానిస్టేబుళ్ళు, 119మంది మహిళ కానిస్టేబుళ్ళతో పాటుగా 275 మంది హోంగార్డులు వినియోగిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా 20మంది స్పెషల్ పార్టీని కూడా విధుల్లో ఉంచినట్లు వివరించారు. కాన్వాయ్ వెళ్లే మార్గాలను జాగీలాలు, బాంబ్‌డిస్పోజబుల్ స్క్వాడ్‌లు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. కాగా ముఖ్యమంత్రి పర్యటించనున్న హెలికాప్టర్ గురువారం మధ్యాహ్నం ట్రయిల్ రన్ నిర్వహించింది. తాడేపల్లి నుంచి నేరుగా ఒంగోలు సమీపంలోని ఎన్.అగ్రహారం పొలాల్లో ఏర్పాటు చేసిన సభా స్థలి వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంది. అక్కడి లేఅవుట్ ప్రాంతం, సభా స్థలిని పరిశీలించి తిరిగి తాడేపల్లికి వెళ్ళారు. అదేవిధంగా సీఎం కాన్వాయ్ ట్రయిల్‌రన్‌ను పోలీసు అధికారులు నిర్వహించారు.

ఏర్పాట్లు పరిశీలన

ఒంగోలు(కలెక్టరేట్): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లను కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిలు పరిశీలించారు. గురువారం సాయంత్రం ఒంగోలు సమీపంలోని ఎన్.అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదికను సందర్శించారు. ప్రజలు కూర్చొనేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ప్రాంగణంతో పాటు పార్కింగ్ స్థలాలు, హెలిప్యాడ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తుది దశ ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తలశిల రఘురాం, సీసీఎల్ఏ చీఫ్ సెక్రటరీ ఇంతియాజ్, జేసీ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, మేయర్ గంగాడ సుజాత, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయా పరీక్షల నిర్వహణపై తాడేపల్లి నుంచి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరబ్ గౌర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌లు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం స్థానిక అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆయా అంశాలపై సమీక్షించారు. మార్చి 1నుంచి 20వతేదీ వరకు ఇంటర్, మార్చి 18నుంచి 30తేదీ వరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో డీఎస్సీ, టెట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిటింగ్‌తో పాటు లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తుతో పాటు పరీక్షలు జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌తో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధమని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. అంతేగాకుండా ఈ విషయంపై తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుభద్ర, ఆర్ఐవో సైమన్‌విక్టర్, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలి

- సీఐటీయు జిల్లా ప్రధానకార్యదర్శి రమేష్

ఒంగోలునగరం, ఫిబ్రవరి 22: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల్లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఎల్బీజీభవన్‌లో ఏపీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ఐసీడీఎస్‌కు బడ్జెట్ నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. బడ్జెట్‌లో నామమాత్రంగా నిధులు కేటాయిస్తూ అంగన్వాడీ, ఆశ, మిడ్‌డే మీల్స్ పథకాల్లో ఎక్కువగా పనిచేస్తున్న మహిళలకు గౌరవ వేతనం పేరుతో కనీస వేతనాలను అమలు చేయటం లేదన్నారు. మహిళలతో వెట్టిచాకిరి చేయించు కుంటున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని కోరుతూ పోరాటాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీలు తమ డిమాండ్ల కోసం 42 రోజుల పాటు చేసిన సమ్మె కారణంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలకు సంబంధించిన మినిట్స్ కాపీలను జీవోరూపంలో ఇవ్వాలని కోరారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటి అమలు కోసం మరో పోరాటానికి సిద్ధంగా కావాలని పిలుపునిచ్చారు. సీహెచ్.జ్యోతి, కేవీ.సుబ్బమ్మ, పద్మ, సంధ్యారాణి, ప్రశాంతికుమారి, పి.కల్పన, సీహెచ్.రాంబాబు, టి.మహేష్, దావూ శ్రీనివాసులు, స్వామిరెడ్డి, యూనియన్ నాయకులు శ్రీదేవి, శోభారాణి, మహాలక్ష్మి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చెంచయ్య ఆశయ సాధన కోసం పాటుపడాలి

- సీపీఎం రాష్ట్ర నేత ఆంజనేయులు



ఒంగోలులో నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య ఆశయాల సాధనకు పాటుపడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో చెంచయ్య వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ తదితరులతో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ చెంచయ్య ఉద్యమ జీవితాన్ని ఆయన స్వగ్రామమైన ప్రాసంగులపాడులో ప్రారంభించారన్నారు. వ్యవసాయ కూలీలకు కూలి పెంచాలని, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. సయ్యద్‌హనీఫ్ మాట్లాడుతూ చెంచయ్య ఎమ్మెల్యేగా ఉంటూ నిరాడంబరంగా గడిపిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జాలా అంజయ్య, జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, తోట తిరుపతిరావు, కె.రమాదేవి, పి.కల్పన, వి.బాలకోటయ్య, కాలం సుబ్బారావు, జి.శ్రీనివాసులు, జి.రమేష్, ప్రసాద్, సువర్ణరాజు, నరసయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: నీతి, నిజాయితీలకు మారుపేరు తవనం చెంచయ్య అని సీపీఎం నాయకులు కోదాటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే తవనం చెంచయ్య 11వ వర్ధంతి సందర్భంగా సంతనూతలపాడులోని సుందరయ్యభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. చెంచయ్య సేవలను కొనియాడారు.

రామతీర్థం రిజర్వాయర్‌ను సందర్శించిన మంత్రి నాగార్జున

చీమకుర్తి, ఫిబ్రవరి 22 : రామతీర్థం జలాశయాన్ని గురువారం మంత్రి మేరుగ నాగార్జున సందర్శించారు. జలాశయంలో నీటి పరిమాణాన్ని పరిశీలించారు. జలాశయం గురించి అధికారులు మంత్రికి వివరించారు. తాగునీటి సమస్య వేసవిలో తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైసీపి నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

చీమకుర్తి మున్సిపల్ పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం చీమకుర్తిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున ముఖ్యఅతిథిగా పాల్గొని వలంటీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



క్వారీ రబ్బీష్‌తో వేసిన రోడ్డు



కొప్పోలురోడ్డులో మరమ్మతులు



కరెంటు లైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు

సీఎం సభ కోసం.. పరుగుల్..!

ఒంగోలు నగరం ఎన్.అగ్రహారంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు శుక్రవారం సీఎం జగన్ రాకను పురస్కరించుకుని అధికారులు హడావుడిగా ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం సీఎం పర్యటించే మార్గంలో అప్పటికప్పుడు విద్యుత్ లైన్లు ఏర్పాట్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, క్వారీ రబ్బిష్‌రోడ్లు వేయడంలో అధికారుల అత్యుత్సాహం కనిపిస్తున్నది. అయితే సీఎం సభను సక్సెస్ చేసేందుకే పనులు చేస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - ఒంగోలు

అవీ..ఇవీ..

గ్యాస్ సిలిండర్‌పై అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు : జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : జిల్లాలో గ్యాస్ వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ రవాణా చార్జీల పేరుతో డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ షోరూం నుంచి వినియోగదారుని ఇంటి వరకు 15 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే ఎటువంటి రుసుం డెలివరీ బాయ్స్‌కు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ నిబంధనలు గ్రామీణ, పట్టణ, సెమీఅర్బన్ అన్ని ప్రాంతాలకు, అన్ని గ్యాస్ ఏజెన్సీలకు వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన ఏజెన్సీలపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. వినియోగదారులు కూడా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలపై అవగాహన పెంచుకొని సేవలు పొందాలన్నారు. ఎవరైనా డెలివరీ బాయ్స్ అసలు ధర కన్నా అధికంగా వసూలు చేస్తూ 8008301512 సెల్ నెంబరులో ఫిర్యాదు చేయాలని ఆయన వినియోగదారులను కోరారు.

25న 'ప్రబంధ యుగకర్త ఎర్రా ప్రగడ' గ్రంథావిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు, మహాకవి ఎర్రన వంశీయులు చదలవాడ లక్ష్మీనరసింహారావు పరిశోధానత్మక దృష్టితో శ్రమించి రచించిన ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ గ్రంథావిష్కరణ ఈనెల 25వతేదీన ఒంగోలులోని బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటి హాలులో నిర్వహిస్తున్నట్లు పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాగంటి శ్రీరామమూర్తి, పింగళి పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిటానియా కంపెనీ రిటైర్డ్ అధికారి చదలవాడ బాబా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎండీ జీవీ.సుబ్బారెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని, డాక్టర్ కడిమళ్ల వరప్రసాద్ సమీక్షకులుగా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టాలి



డీఈవో సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 22: జిల్లాలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఒంగోలులో డీఈవో సుభద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్‌కు ప్రత్యేకంగా మేళాలు నిర్వహించాలని, తెలుగు, హిందీ ఉద్యోగోన్నతులు పొంది స్థానాలు కేటాయించకుండా హైస్కూళ్లలో పనిచేస్తున్న వారికి నోషనల్ పీరియడ్‌గా పరిగణించి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నందున వారికి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.ఎర్రయ్య, జి.నరసింహారెడ్డి, కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

పేస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 22: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా కారుమంచిలో నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఏపీ కల్చర్, సెరికల్చర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.జానకిరామ పట్టు పురుగుల పెంపకం గురించి వివరించారు. డాక్టర్ ఎం.మల్లికార్జునరావు ఏపీకల్చర్‌పై మాట్లాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ వీరాంజనేయులు, ఏవో రమణబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.మల్లికార్జునరావు, వి.సురేష్‌బాబు, పృథ్వీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి



మొక్కను నాటిన రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని రిజిస్ట్రార్ హరిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మానవాళి మనుగడను కాపాడేందుకు తప్పకుండా మొక్కలు నాటాలని కోరారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త హర్షప్రీతం దేవ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరగడం వల్ల అనేక అనార్థాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు దారుణం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: కేంద్రప్రభుత్వం రైతులపై కాల్పులు జరపడాన్ని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.జాన్సీ, రాష్ట్ర కోశాధికారి డీవీఎస్.స్వామి, జిల్లా కార్యదర్శి ఎస్.లలితకుమారి గురువారం ఒక ప్రటకనలో ఖండించారు. గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కోసం, రైతు రుణమాఫీ, విద్యుత్ చట్టాల సవరణ రద్దు కోసం ఉద్యమిస్తున్న రైతులపై ఇటువంటి దాడులకు పాల్పడటం దుర్మార్గంగా ఉందని, ఇటువంటి విధానాలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగుడు కనకయ్యకు ట్రైసైకిల్‌ను గురువారం ఒంగోలులోని ట్రస్టు కార్యాలయంలో అందజేశారు. కోరాడ శ్రీలత ఆధ్వర్యంలో సతీష్ బండారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ట్రైసైకిల్‌ను నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు కొనకనమిట్ల మండలం నాయుడుపేటకు చెందిన పాలకేటి కనకయ్యకు అదించారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి షేక్ సర్దార్‌బాషా, సుబ్బారెడ్డి, జంధ్రాజుపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాంఅజాద్‌కు నివాళులు



నివాళులుర్పిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా గురువారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య ఆజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సంపూర్ణమ్మ, ఎస్.అనిల్, స్మైలి తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి పొగాకు వేలం ప్రారంభం

సంతనూతలపాడు, ఫిబ్రవరి 22: పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు-1వ వేలం కేంద్రంలో ఈనెల 29వ తేదీ నుంచి పొగాకు వేలం ప్రారంభం అవుతున్నట్లు బోర్డు సూపరింటెండెంట్ రవికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు షెడ్యూలు ప్రకారం బేళ్లను అమ్మకానికి ఉంచాలని ఆయన సూచించారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడు మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి 22: నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పిన్నక నాగేశ్వరరావు (72) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి విజయ్‌కుమార్ గురువారం నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నాగేశ్వరరావుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకర్ల లక్ష్మీవరప్రసాద్, కొమ్మాలపాటు సురేష్, పిన్నక సుబ్బారావు, మేడా వేణు, వెంకటేశ్వర్లు, నరసయ్య, కోట బాబు, కోట శ్రీను, సర్పంచ్ పాలపర్తి బాలకోటి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా లింగేష్‌అబ్రహం

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి22: నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కుండా లింగేష్‌అబ్రహం సంతనూతలపాడు నియోజకవర్గ పాస్టర్ల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఆయన రాష్ట్ర సంఘం నుంచి నియామకపత్రాన్ని అందుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు. పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే పాస్టర్ల ఐక్యతకు కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు. తనకు పదవి వచ్చిందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

వైసీపీకి గుణపాఠం తప్పదు!

మార్టూరు, ఫిబ్రవరి 22: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం మార్టూరు క్లస్టర్ వన్ నాయకులు, కార్యకర్తలు, పేజీ నేస్తంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ గెలుపు పర్చూరు చరిత్రలో నిలిచిపోయే విదంగా ఉండాలని, కార్యకర్తలందరూ పోరాట పటిమతో పని చేయాలని పిలుపు నిచ్చారు. అధికార పార్టీ నాయకులు గెలుపు కోసం టీడీపీ నాయకుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేవిధంగా కుట్రలు చేస్తున్నారని చెప్పారు. వాటికి భయపడకుండా వారి కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. వైసీపీకి ఓట్లు వేయరని భావించిన టీడీపీ ఓట్లను తొలగించాలని ప్రయత్నిస్తున్నారని, వారి వ్యూహానికి అడ్డుకట్ట వేయాలని ఏలూరి పిలుపునిచ్చారు. దుర్మార్గుడైన ఒక వ్యక్తి స్వార్థానికి రాష్ట్రం సర్వనాశనమవుతున్న విషయాన్ని ప్రజలకు చెప్పేందుకు ప్రతి కార్యకర్త ముందుండాలన్నారు. ప్రతి ఓటును పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్న అధికార పార్టీ నాయకులకు గుణపాఠం చెప్పే సమయం వచ్చిందన్నారు. పర్చూరు నియోజకవర్గంలో మూడు తరాలు వారికి టీడీపీ గెలుపు గుర్తుండాలన్నారు. మన గెలుపు ద్వారా రాష్ట్ర చరిత్రలో తెలుగు దేశం పార్టీ నూతన అధ్యాయానికి నాంది పలకాలన్నారు. ఓట్లను తొలగించాలనుకున్న వారికి సహాయ సహకారాలు అందించిన అధికారులు బలయ్యారన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్ర చరిత్రను మార్చగలవన్నారు. భావితరాలు వారు అభివృద్ధిలో పయనిస్తున్న ఆంధ్రప్రదేశ్‌ను చూడాలంటే చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. ప్రజల ఆకాంక్ష, ఆశ, భవిష్యత్తు, బతుకు దెరువు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే నెరవేరుతాయని అందరూ భావిస్తున్నారని ఎమ్మెల్యే సాంబశివ రావు పేర్కొన్నారు.

మెరిసిన గ్రామీణ విద్యార్థిని

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 22: కారంచేడు మండల పరిధిలోని రంగప్ప నాయుడువారిపాలెం గ్రామానికి చెందిన రావెళ్ల వీరరాఘవయ్య, శ్రీదేవి దంపతుల కుమార్తె రావెళ్ల రాజరాజేశ్వరికి సెంట్రల్ గవర్నమెంట్ నేషనల్ అవార్డు(అలెగ్జాండర్ గ్రహంబెల్ అవార్డు)ను సొంతం చేసుకుంది. చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌ను పూర్తిచేసిన రాజరాజేశ్వరి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో అత్యధిక ప్రతిభను కనపరిచి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈనెల 21న న్యూఢిల్లీలో రోడ్డు అండ్ హైవేస్ మినిస్టర్ నితిన్ గడ్కరీ చేతుల మీదుగా రాజరాజేశ్వరి అందుకున్నారు. బెంగుళూరులో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్‌లో పూర్తిస్థాయి శిక్షణ పొందినట్టు చెప్పారు. అవార్డు తనకు దక్కటం అదృష్టంగా భావిస్తున్నానని రాజరాజేశ్వరి తెలిపారు. గ్రామీణ విద్యార్థినికి దేశస్థాయిలో అవార్డు రావటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



న్యూఢిల్లీలో అవార్డును అందుకుంటున్న రాజరాజేశ్వరి

యువతను చైతన్యవంతం చేయాలి

చీరాల, ఫిబ్రవరి 22: తొలిసారి ఓటు అర్హత పొందిన యువతను చైతన్యవంతం చేసి మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అనే నినాదంతో శ్రేణులు ముందుకు సాగాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరీఅమర్‌నాథ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ లీడర్స్, వారియర్స్ సమావేశం జరిగింది. నియోజకవర్గం నుంచి గౌరీఅమర్‌నాథ్, లావేటి శ్రీనివాసతేజ, వెంగళ భరత్‌లను యువత నాయకులుగా నియమించారు. వారియర్స్‌గా కర్పూరపు సుబ్బలక్ష్మి, పర్వీణ షేక్, నిన్నకోట జగదీష్, అవ్వారు తారక్, వెలిది అమర్, నాసిక ఆనంద్‌లను నియమించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ యువత ప్రతినిధి మువ్వ శరత్‌చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కావూరివారిపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 22: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రాత్రి కావూరివారిపాలెం గ్రామస్థులకు నేర నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రైవేట్ వ్యాపారుల సేవలో వాటర్ ప్లాంట్

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు

20 లీటర్ల నీరు కేవలం రూ.2కే అమ్మకం

ప్రస్తుతం నీటిని బయటవారికి విక్రయిస్తున్న వ్యాపారులు

టంగుటూరు ప్రజలకు అందని శుద్ధి జలం

అవస్థలు పడుతున్న జనం

టంగుటూరు, ఫిబ్రవరి 22 : పట్టణ ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నేడు వ్యాపారుల సేవలో తలమునకలవుతోంది. ప్రజా సేవ అనే అర్థానికి తూట్లుపొడుస్తోంది. దీంతో టంగుటూరు గ్రామస్థులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు.

టంగుటూరు పంచాయతీ కార్యాలయ ఆవరణలో గత టీడీపీ ప్రభుత్వం పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసమని మక్కెన వెంకటకృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పింది. దీనిని అప్పటి ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల కింద నిర్మాణం చేసింది. 10 లీటర్ల నీటిని కేవలం రూ.2కే అందిస్తోంది. అప్పటి నుంచి గ్రామస్థులు ఈ వాటర్ ప్లాంట్ నుంచే తాగునీటిని తీసుకెళ్లేవారు.

రూట్ మార్చిన ప్లాంట్ నిర్వాహకులు

ప్రస్తుతం వాటర్ ప్లాంట్ ప్రజల కంటే కూడా వ్యాపారుల సేవలో బిజీబిజీగా ఉంది. వేకు నుంచే ప్లాంట్ నిర్వహణను ప్రారంభిస్తారు. ప్రారంభమైన వెంటనే బయట నీటిని అమ్ముకునే వ్యాపారుల ట్యాంకులు నింపే పనిలో సిబ్బంది ఉంటారు. ఉదయం ప్రజలు వచ్చే సమయానికి ప్లాంట్‌లో నీరు అడుగంటి ఉంటుంది. చిన్న ధార మాత్రమే వస్తుంటుంది. మళ్లీ నీటిని ప్లాంట్‌కు పట్టి ఫిల్టర్ చేసి నీరు అందించడానికి సమయం పడుతుంది. ప్లాంట్‌లో నీరు సక్రమంగా రాకపోవడంతో జనం బయట వ్యాపారుల వద్దకు వెళుతున్నారు. అక్కడ 20 లీటర్ల క్యాన్‌ను 12 రూపాయిలకు కొనుగోలు చేస్తున్నారు. సేవాబాధ్యతలను గాలికి వదలేసిన ప్లాంట్ నిర్వాహకులు వ్యాపారులు సేవలో ఉంటూ నాలుగు రాళ్లు వెనుకేసుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.



వాటర్ ప్లాంట్ నుంచి బయట వ్యాపారుల ట్యాంకర్‌కు నీరు నింపుతున్న ప్లాంట్ నిర్వాహకులు

వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందో?

ఈ ఏడాది అప్పుడే ఎండలు మండుతున్నాయి. రానున్న నెలల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉండనున్నాయి. ఈ పరిస్థితుల్లో స్థానికంగా లభ్యమయ్యే నీటి వనరులు అడుగంటిపోతాయి. అప్పుడు అందరూ టంగుటూరు ప్లాంట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి. వేసవిలో బయట వ్యాపారుల దోపిడీ పెరుగుతుంది. భారమైనప్పటికీ ప్రజలు తాగునీటిని కొనక తప్పదు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే పంచాయతీ కార్యాలయంలో ఉన్న ఎన్టీఆర్ సుజల ప్లాంట్ నీటిని బయట వ్యాపారులకు అమ్మకుండా కట్టడి చేయాలని, ఈ విషయంలో మండల పరిషత్ అధికారులు, పంచాయతీ పాలకవర్గం కల్పించుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమయం లేదు.. సైనికుల్లా పనిచేయండి

టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర దిశానిర్దేశం

కనిగిరి, ఫిబ్రవరి 22 : ఎన్నికలు సమీపిస్తున్నాయి.. సమయం లేదు.. సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం టీడీపీ పట్టణ అధ్యక్షులు, నాయకులు, బూత్ కన్వీనర్‌లు, బూత్ ఇన్ చార్జిలతో డాక్టర్ ఉగ్ర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ ఎన్నికలకు ఇంకా 50 రోజుల గడువు మాత్రమే ఉందని అందరూ సమాయత్తం కావాలన్నారు. కీలకమైన ఈ సమయంలో కనిగిరి పట్టణంలోని ప్రతి వార్డులోనూ వార్డు నాయకులు పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు వేసే ఎత్తుగడలను ముందుగానే పసిగట్టి వాటిని తిప్పికొట్టాలన్నారు. ప్రతి రోజూ ఒక్కో వీధిని ఎంచుకుని ఓటర్లను నేరుగా కలసి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఎంత ముఖ్యమో తెలియచేయాలన్నారు. అదే సమయంలో కనిగిరి అభివృద్ధి కోసం పార్టీ తీసుకున్న లక్ష్యాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. కనిగిరి ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, భావితరాల బంగారు భవిష్యత్ కోసం.. తాను ఉపాధి కల్పన కోసం తీసుకుంటున్న చర్యలను తెలియజేయాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం, రవాణా సౌకర్యం వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మం చి నీటి సరఫరా, నీటి ఎద్దడి నివారణ కోసం తీసుకోనున్న చర్యలను ప్రజలకు జాగ్రత్తగా తెలియజేయాలన్నారు. ప్రతి వార్డు అధ్యక్షుడు పార్టీ శ్రేణులను వెంట పెట్టుకుని ఓటరుతో మమేకమవ్వాలన్నారు. కార్యక్రమాలను శుక్రవారం నుంచి ప్రారంభించాలని ఉగ్ర సూచిం చారు. సమావేశంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్‌తో పాటు 20 వార్డుల అధ్యక్షులు, బూత్ కన్వీనర్‌లు, శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సూపర్‌సిక్స్ పథకాలతో భవిష్యత్‌కు గ్యారెంటీ

దొనకొండ, ఫిబ్రవరి 22 : అన్ని వర్గాల ప్రజల బంగారు భవిష్యత్ కోసమే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను రూపొందించారని టీడీపీ మండల నాయకులు వీ వెంకన్నచౌదరి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్ పేర్కొన్నారు. దొనకొండలో వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దొనకొండ ప్రధాన రహదారి, గుట్టమీదపల్లి, వీరవెంకటాపురం, ముస్లిం బజారు, బ్రహ్మారావు పేటలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికీ వరమన్నారు. జగన్‌రెడ్డి నియంత పాలన సాగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, వేసవి ప్రారంభంలోనే గ్రామాల్లో ప్రజలు గుక్కెడు మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నా వైసీపీ పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. గ్రామాల్లో అభివృద్ధి, అన్నీ వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావాలన్నారు. ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా ప్రజలంతా నిలవాలన్నారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టి, అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులు పెట్టిన జగన్‌రెడ్డిని గద్దె దింపాలని కోరారు. కార్యక్రమంలో వెంకన్నచౌదరితో పాటు జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, మాజీ ఎంపీపీ నూనె విజయకుమారి, మాజీ మండల కోఆప్షన్‌షేక్ ముసామియా, సీనియర్ నాయకులు కామేపల్లి చెంచయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, తోటా కోటేశ్వరరావు, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వేగినాటి అల్లూరయ్య, వైకే చౌదరి, వల్లపునేని ఆదినారాయణ, ఫణిదపు అనంతరాములు, షేక్ సుభానీ, పురుషోత్తం సత్యానందం, నూనె యోహాన్ నూనె డేవిడ్‌స న్ ఫణిదపు వీరాంజనేయులు, పులిమి శ్రీరాములు, జనసేన మండల, పట్టణ పార్టీల అధ్యక్షులు గుండాల నాగేంద్ర ప్రసాద్, ఎం షఫిఉల్లాఖాన్ (బాజీ), బండారు వెంకట్, హనుమంతరావు మరికొందరు నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

జేవీవీ జాతీయ కార్యదర్శి గయాజ్

కనిగిరి, ఫిబ్రవరి 22: విద్యార్థినీవిద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి తే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జేవీవీ జాతీయ కార్యదర్శి గయాజ్ బాషా అన్నారు. స్థానిక మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్‌లో పదవతరగతి విద్యార్థులకు అవగాహ న సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు సమయస్ఫూర్తితో రోజుకు 18 గంటలు మనసుపెట్టి చదివి తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అదేవిధంగా పరీక్షలు ముగిసేవరకు మితాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అప్పుడే జ్ఞాపకశక్తి పెరిగి చురుగ్గా పరీక్షలు రాయగలరన్నారు. పరీక్ష హాలులో ఆందోళన విడిచి పెట్టి ప్రశాంతంగా రాయాలన్నారు. దస్తూరీతో వేగంగా జవాబులు రాస్తే సమయం వృథా కాదని బాషా సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెంచయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

కనిగిరి, ఫిబ్రవరి 22 : నేటి కమ్యూనిస్టులు తవనం చెంచయ్య లాంటి మహోన్నత వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు అన్నారు. సుందరయ్య భవనంలో గురువారం చెంచయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బలహీన వర్గాల కోసం చెంచయ్య తుది వరకూ పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌వలి, నరేంద్ర, వెంకటరెడ్డి, లక్ష్మయ్య, ప్రసాద్, ప్రస న్న, వెంకటమ్మ, రాధా, సీతామహాలక్ష్మి, నారాయణమ్మ, ఎలీసమ్మ, శాంత కుమారి పాల్గొన్నారు. తొలుత చెంచయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్బీకేలలో కందుల కొనుగోలు

పీసీపల్లి, ఫిబ్రవరి 22 : 2023-24 కరీఫ్‌లో పంటలు సాగు చేసిన కంది పంటను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు ఏడీఏ వెంకటరమణ చెప్పారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం కంది రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పును సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గోనె సంచులు, హమాలీ ఖర్చులు, రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే భరాయిస్తుందని చెప్పారు. ఇందుకుగాను టన్నుకు రూ.756 రైతు ఖాతాలో జమచేయనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పోలు జయరామిరెడ్డి, ఏవో వెంకటస్వామి, రైతులు ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కారు - ఇద్దరికి గాయాలు

పీసీపల్లి, ఫిబ్రవరి 22 : కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన సంఘటన మండలంలోని పెదఇర్లపాడు గ్రామ సమీంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కారులో నెల్లూరుకు చెందిన కొంతమంది కందుకూరు వైపు నుంచి కనిగిరి వెళ్తున్నారు. అలవలపాడు సమీపంలోని అంకమ్మగుడి సమీపంలో ఉన్న స్పీడు బ్రేకర్ వద్ద కారు అదుపుతప్పి ప్రక్కనే ఉన్న తాడిచెట్టును ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఈప్రమాదం జరిగిన వెంటనే కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రాణాప్రాయం తప్పినట్లు వారు తెలిపారు. 108 వచ్చే లోపే అందులోని క్షతగాత్రులు కనిగిరికి వెళ్లినట్లు తెలిసింది. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు రాలేదు.

లక్ష్యంతో చదివితేనే భవిష్యత్

ఆంధ్రకేసరి వర్సిటీ వీసీ అంజిరెడ్డి

పామూరు, ఫిబ్రవరి 22 : విద్యార్థులు బాల్యం నుంచే లక్ష్యం, ప్రణాళికతో చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రుల కల నెరవేరుతుందని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎం.అంజిరెడ్డి సూచించారు. అ క్షర కళాశాల 15వ వార్షికోత్సవం పువ్వాడి రాధాకృష్ణ కన్వెన్షన్ హాలులో గురువారం అక్షర కళాశాల డైరెక్టర్ కదిరి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ అంజిరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ర్యాంకులు సాధించి ఊరికి, కళాశాలకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. వెనుకబడిన పామూరు లాంటి గ్రామంలో జూనియర్ కళాశాల స్థాయి నుంచి డిగ్రీ, బీఈడీ క ళాశాల స్థాయికి అక్షర కాలేజీ చేరుకోవడం అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ కదిరి బాబు రంగారావు కృషిని ప్రశంసించారు. కరస్పాండెంట్ బాబు రంగారావు మాట్లాడుతూ తమ కళాశాలలో మంచి బోధనతోపాటు విలువలను నింపుతున్నామన్నారు. గతేడాది రాష్ట్ర, డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వీసీ జ్ఞాపికలను అందజేశారు.

అధ్వానంగా వావిలేటిపాడు ఎస్సీ కాలనీ

- పర్యటించిన జనసేన నాయకులు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

జరుగుమల్లి (కొండపి), ఫిబ్రవరి 22 : వావిలేటిపాడులోని ఎస్సీ కాలనీలో సమస్యలు తిష్టవేశాయని, అధికారులు పరిష్కరించకపోవడం దారుణమని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కనపర్తి మనోజ్‌కుమార్ విమర్శించారు. గురువారం ఆయన జరుగుమల్లి మండల జనసేన అధ్యక్షుడు గూడా శశిభూషణ్ ఆధ్వర్యంలో వావిలేటిపాడు గ్రామంతోపాటు ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఐనాబత్తిన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న జనసేన నాయకులు

సముద్రంలో పడవ బోల్తా - మత్స్యకారుడు మృతి

సింగరాయకొండ, ఫిబ్రవరి 22 : సముద్రంలోకి చేపల వేటకు వెళ్లి అలల ఉధృతికి పడవ బోల్తాపడడంతో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ పరిధిలోని సముద్రతీరాన గురువారం చోటుచేసుకుంది. దేవళం పల్లెపాలేనికి చెందిన కన్నా వెంకటేశ్వర్లు (48) తెల్లవారుజామున మరో ముగ్గురితో కలిసి చేపల వేటకు వెళ్లారు. ఒక్కసారిగా అలల తీవ్రత అధికమవ్వడంతో పడవలో నుంచి జారిపడి సముద్రంలో గల్లంతయ్యాడు. సహచర మత్స్యకారులు వలల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి వెంకటేశ్వర్లు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. కుటుంబ పెద్దదిక్కు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వెంకటేశ్వర్లు మృతదేహానికి పలువురు టీడీపీ, వైసీపీ నేతలు నివాళులర్పించారు.

కాంగ్రెస్ నాయకుడికి పోలీసుల నోటీసు

కొండపి, ఫిబ్రవరి 22 : కాంగ్రెస్ పార్టీ ఏపీ సచివాలయ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుంటపల్లి శ్రీనివాసరావుకు పోలీసులు బుధవారం రాత్రి చోడవరం గ్రామం ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ, పోలీసు అనుమతి లేనందున కార్యక్రమంలో పాల్గొనడం చట్టరీత్యా నేరమని నోటీసులో పోలీసులు పేర్కొన్నారు. శాంతియుతంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల చేపట్టిన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం, కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నాయకులకు నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి మంచిదికాదని ఆయన ఈసందర్భంగా అన్నారు.

నేడు కాకుటూరివారిపాలెంలో ఉచిత గుండె వైద్య శిబిరం

కాకుటూరివారిపాలెం(టంగుటూరు) ఫిబ్రవరి 22 : మండలంలోని కాకుటూరివారిపాలెంలో ఈనెల 23న ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక టీడీపీ నాయకుడు కొమ్మినేని వెంకట్రావు గురువారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, శిబిరం సర్పంచ్ కొమ్మినేని రమణమ్మ నేతృత్వంలోనే కొనసాగుతుందని వివరించారు. విజయవాడ హెల్ప్ హాస్పటల్ సౌజన్యంతో ఈసీజీ, 2డీ ఎకో, వైద్య పరీక్షలు ఉచితంగానే నిర్వహిస్తారని తెలిపారు.

విద్యార్థులు రచనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

పొందూరు(టంగుటూరు) ఫిబ్రవరి 22 :విద్యార్థులు రచనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు టీ అరుణ చెప్పారు. మండలంలోని పొందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మ అనే అంశంపై విద్యార్థులకు కవితా పోటీలు జరిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన అరుణ నడత, నడక గురించి విద్యార్థులకు వివరించారు. పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల సిబ్బంది అరుణను ఘనంగా సత్కరించారు. సభకు ప్రధానోపాధ్యాయుడు వాకా జగన్మోహనరెడ్డి అధ్యక్షత వహించగా విద్యాకమిటీ మాజీ ఛైర్మన్ కప్పగంతుల జయరామయ్య, రచయిత్రులు సింహాద్రి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడుకుందాం

రాష్ట్రంలో పత్రికా కార్యాలయాలపై, జర్నలిస్టులపై దాడులు నిత్యకృత్యమయ్యాయని, వీటిని అరికట్టి పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవలసిన సమయం వచ్చిందని టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌కు ఎన్నికల భయం పట్టుకుందని, అందుకే ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. వైసీపీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు జనం సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ అరుణమ్మకు పితృ వియోగం

టంగుటూరు, ఫిబ్రవరి 22 : కమ్మ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణకు పితృ వియోగం జరిగింది. తీవ్ర అనారోగ్యంతో కొంతకాలంగా ఇంటి వద్దనే చికిత్స తీసుకుంటున్న అరుణ తండ్రి రావూరి వెంకటశేషయ్య(80) గురువారం మధ్యాహ్నం టంగుటూరులోని స్వగృహంలో కన్నుమూశారు. ఈ వార్త విన్న నియోజకవర్గ మాజీ ఇన్చార్జి డాక్టర్ మాదాసి వెంకయ్య, నేతలు సూదలగుంట శ్రీహరిబాబు, రమణారెడ్డి, వరుణ్‌లు టంగుటూరులోని శేషయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎన్నికల అధికారి

ఇంకొల్లు, ఫిబ్రవరి 22: మండలం పరిధిలోని 54 పోలింగ్ బూత్‌లను గురువారం పర్చూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి కావేటి వెంకటేశ్వర్లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, భద్రత, తదితర అంశా లను పరిశీలించారు. కొన్నిచోట్ల విద్యుత్‌దీపాలు, ర్యాంపులు తదితర సౌకర్యాలు లేనివి గుర్తించి తక్షణమే ఏర్పాట్లుచేయా లని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీఎల్వోల నుంచి పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, డీటీ గీత, ఏఎస్ వో పుష్పలత, సుధీర్, వీఆర్వోలు సురేష్, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అద్దంకి, ఫిబ్రవరి 22: అద్దంకి పట్టణం సమీపంలోని నల్లవాగులో గుర్తుతెలియని మృతదేహం కుళ్లిపోయి ఉంది. అద్దంకి-మేదరమెట్ల రోడ్డుకు తూర్పువైపున నల్లవాగులో గురువారం సాయంత్రం పురుషుడు మృతదేహం ఉన్నట్లు సమాచారం అందటంతో పోలీసులు పరిశీలించారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఐదారు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అరాచక పాలనకు అంతం తథ్యం

- టీడీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి
- వైసీపీని వీడి పలువురు ఆ పార్టీలో చేరిక



భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న కందుల విఘ్నేష్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 22 : రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన అంతం తథ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో వైసీపీని వీడి 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బేస్తవారపేట మండలం జగ్గంబొట్ల కృష్ణాపురం మాజీ సర్పంచ్ శెట్టెం రామకోటయ్య, అర్ధవీడు మండలం మాగు టూరు తాండాకు చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలవర్ధినాయక్ అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. బడుగు, బలహీన వర్గాలను ఈ ప్రభుత్వం అనేక ఇబ్బం దులకు గురిచేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని రాష్ట్ర ప్రజలు తమ ఓటు హక్కుతో భూ స్థాపితం చేస్తారని పేర్కొన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో మాగుటూరు తాండాకు చెందిన దూమావత్ పూలె నాయక్, దేశావత్ శ్రీనునాయక్, మేఘావత్ రాము నాయక్, భీమ్‌నాయక్, ఎం.బాలూనాయక్, షేక్ మహబూబ్‌భాషా, చింతల శ్రీను, పాలితి శ్రీనునాయక్, క్రిష్టాపురానికి చెందిన పెద్దిశెట్టి పుల్లయ్య, జలపాటి శ్రీరంగం, మూడుగుల నారాయణరెడ్డి, నాలి పెద్దరాజయ్య, భూపని తిరుపతయ్య తదితరులున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పూనూరి భూపాల్, అర్ధవీడు మండల పరిశీలకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులుయాదవ్, ప్రధాన కార్యదర్శి కొనతం రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీ కుటుంబాల చేరిక

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం అర్ధవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన 20 బీసీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన వల్లెపు ఆంజనేయులు, కృష్ణ, రాజు, వాసు, శివకుమార్, చిన్నవెంకటస్వామి, పెద్దవెంకటేశ్వర్లు, చల్లా తిరుపతయ్య, చిన్నబాలయ్య, దినేష్, శివరాం, పెద్దవెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, తమ్మిశెట్టి సుబ్బరాయుడు పార్టీలో చేరారు. కార్యక్రమంలో అర్ధవీడు మండల పరిశీలకులు అబ్బవరపు శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులుయాదవ్, కొనతం రంగారెడ్డి, బండి నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ముత్తుముల సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

మార్కాపురం రూరల్ : మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో గురువారం రాత్రి 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల విఘ్నేష్ రెడ్డికి హరతులు, పూలదండలు, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ అయ్యవారిపల్లి, బడేఖాన్‌పేట గ్రామాల్లో డ్రైనేజీలు లేవని, గ్రామంలో సిమెంట్ రోడ్లు అవసరమని, గ్రామానికి వాటర్ ట్యాంకు అవసరమని, ఈ సమస్యలను వైసీపీ పరిష్కరించలేకపోయిందని వాపోయారు. అనంతరం విఘ్నేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న టీడీపీ ప్రభుత్వంలో తప్పక డ్రైనేజీ సమస్యను, రోడ్ల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జవ్వాజి రామాను జులరెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న కందుల వసంతలక్ష్మి

టీడీపీకి మద్దతుగా నిలవాలి

మార్కాపురం వన్‌టౌన్ : రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి మద్దతుగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మీ అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో గురువారం రాత్రి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతలక్ష్మీ మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కందుల వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఇంటర్ పరీక్షల కోసం 11 కేంద్రాలు

కంభం, ఫిబ్రవరి 22 : గిద్దలూరు జోన్ పరిధిలో మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం 11 కేంద్రాలను కేటాయించినట్లు ఇంటర్మీడియట్ రీజనల్ కోఆర్డినేటర్ మరియు కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సైమన్‌విక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్లలో మొదటి, రెండవ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తం 6199 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. కంభం మండలంలోని కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల, తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిఎల్ఆర్ జూనియర్ కళాశాల, వాసవి జూనియర్ కళాశాల, గౌతమి జూనియర్ కళాశాలల కూడల్లో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఈ కేంద్రాల్లో ఇంటర్ మీడియం మొదటి సంవత్సరం విద్యార్థులు 1581 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 1782 మంది హాజరవుతారన్నారు. అర్ధవీడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 146 మంది, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 162 మంది పరీక్షలు రాయనున్నారు. గిద్దలూరు మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలైన ఎస్.వి.జూనియర్ కళాశాల, జీవనజ్యోతి జూనియర్ కళాశాల, సాయివిక్రమ్ జూనియర్ కళాశాల, సాహితి జూనియర్ కళాశాల కేంద్రాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 828 మంది, ద్వితీయ సంవత్సరం 1172 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. కొమరోలు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 211మంది, ద్వితీయ సంవత్సరం 316 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కావున పరీక్ష కేంద్రాల దగ్గర ఉండే జిరాక్స్ కంప్యూటర్ సెంటర్లను మూసివేయాలని సూచించారు.

మట్టి, సాగునీటిపై అవగాహన కలిగి ఉండాలి

- కేవీకే శాస్త్రవేత్త రాజేష్ చౌదరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చౌదరి

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 22: మట్టి, సాగునీటిపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్త రాజేష్ చౌదరి అన్నారు. స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో ఆత్మ ప్రకాశం పైలట్ ప్రాజెక్టులో భాగంగా మట్టి, నీటి సంరక్షణపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఉప సంయుక్త వ్యవసాయ సంచాలకులు సుధాకర్ రాజు మాట్లాడుతూ మట్టి, సాగునీటి పరీక్షల వల్ల ఏయే లాభసాటి పంటలు సాగుచేయవచ్చో వివరించారు. ఎంతశాతం ఏ మందులు వినియోగించాలనే అంశం తెలుసుకొనే అవకాశముంటుందన్నారు. భూమిలో, నీటిలో ఉన్న పోషకాలు, లవణాలు గురించి క్షుణ్ణంగా తెలుసుకుని సరి చేసుకోవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీ.శ్యామూల్ జోబ్, జిల్లా వనరుల కేంద్రం అధికారులు శైలజారాణి, వెంకటశేషమ్మ, ఏవో జవహర్ లాల్ నాయక్ పాల్గొన్నారు.

వెలిగొండపై చిత్తశుద్ధి ఏదీ..?

- ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు సుదర్శన్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 22: వెలిగొండ ప్రాజెక్టుపై అధికార వైసీపీ నేతల్లో చిత్తశుద్ధి కరువైందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు వి.సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ రానుందన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయని, జిల్లా అభివృద్ధి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి మాటలు నీటి మూటలయ్యాయన్నారు. శుక్రవారం ఒంగోలు రానున్న ముఖ్యమంత్రి జగన్ మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తూ, ప్రకటన చేయాలన్నారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలన్నారు. కరువుతో అలమటిస్తున్న రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కళాశాలకు విద్యాసామగ్రి అందజేత



విద్యార్థినులకు పరీక్ష అట్టలు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

గిద్దలూరు, ఫిబ్రవరి 22 : పట్టణంలోని బాలికల ఇంటర్మీడియట్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న 50 మంది విద్యార్థులకు యువప్రగతి పథం స్వచ్ఛంధ సంస్థ విద్యాసామాగ్రిని అందజేసింది. పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిల్లు తదితర విద్యాసామగ్రిని అందజేశారరు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, యువప్రగతి పథం స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షులు వేణుగోపాల్, సభ్యులు రత్నం, శ్రీనివాసులు, నాయబ్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పిచ్చిరెడ్డి విగ్రహానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

పొదిలి, ఫిబ్రవరి 22 : దర్శి మాజీ శాసన సభ్యులు సానికొమ్ము పిచ్చిరెడ్డి విగ్రహ ప్రతిష్ఠకు గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు గురు వారం పెద్ద బస్టాండ్ కూడలిలో కొబ్బరి కాయలు కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దర్శి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పొదిలి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఏపీఐఐసీ అధ్యక్షులు జెంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతానికి ఆయన చేసిన అభివృద్ధిని మరువలేమన్నారు. ఆయన సేవలకు కృతజ్ఞతకు ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన కుమారుడు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

బేస్తవారపేట, ఫిబ్రవరి 22 : బేస్తవారపేట మండలంలోని పిటికాయగుళ్ల సబ్ స్టేషన్ పరిధిలోని పిటికాయగుళ్ల జే.సీ.అగ్రహారం, కొత్తపల్లి, వంగపాడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ ఎస్ఎస్.రావు తెలిపారు. సబ్‌స్టేషన్ బ్రేకర్ మరమ్మతుల కారణంగా నిలిపివేసినట్లు తెలిపారు.

రైలు గేటును ఢీకొట్టిన ట్రాక్టర్

- స్తంభించిన ట్రాఫిక్



ట్రాక్టర్ ఢీకొనడంతో ఒరిగిన రైల్వే గేటు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 22 : రైల్వే గేటును వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొన్న ఘటన పట్టణంలోని రాచర్ల రైల్వే గేటు వద్ద చోటుచేసుకొంది. దీంతో అక్కడ ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించింది. పట్టణంలోని రాచర్ల రైల్వేగేటు గురువారం సాయంత్రం రైలు వస్తుండడంతో గేటు సిబ్బంది గేటు వేశారు. ఇదే సమయంలో రాచర్ల వైపు నుంచచి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఆ గేటును ఢీ కొట్టింది. దీంతో గేటు పూర్తిగా ఒరిగిపోయింది. రైల్వే అధికారులు గేటు తీయడానికి ప్రయత్నించినా అది పనిచేయలేదు. ఇరువైపులా ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. దీంతో నల్లబండ గేటువైపుకు వేసిన మెటల్‌రోడ్డు నుండి పాములపల్లె గేటు వైపుగా వాహనదారులు వెళ్లారు. రెండు గేట్ల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. రాత్రి 8గంటల వరకు కూడా రైల్వే అధికారులు గేటు మరమ్మతు చేయలేకపోయారు. దీంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

మార్కాపురం ఎంపీపీ పోరెడ్డి అరుణ రాజీనామా



మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 22: మార్కాపురం మండల ఎంపీపీ పోరెడ్డి అరుణ ఆ పదవికి గురువారం రాజీనామా చేశారు. ఆ మేరకు లేఖను ఒంగోలు జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం అందజేసినట్లు తెలిపారు. తన ఆరోగ్య కారణాలతో రాజీనామా చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దీంతో ఎంపీపీగా తిప్పాయపాలెం ఎంపీటీసీగా ఎన్నికై ప్రస్తుతం వైస్ ఎంపీపీగా కొనసాగుతున్న బండి లక్ష్మీదేవి బాధ్యతలు స్వీకరించనున్నారు. పోరెడ్డి అరుణ ఎంపీపీ ఎన్నిక సమయంలోనే ఇద్దరికీ చెరో రెండున్నర సంవత్సరకాలం పదవిలో ఉండాలని పార్టీ ముఖ్య నాయకుల దగ్గర ఒప్పందం చేసుకున్నట్లుగా సమాచారం. ఆ ఒప్పందం మేరకు ఎంపీపీ పోరెడ్డి అరుణ రాజీనామా చేసినట్లుగా తెలస్తోంది.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ

రాచర్ల, ఫిబ్రవరి 22 : ప్రతి విద్యార్థి పరసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని, ఎంపీపీ షేక్ ఖాశింబీ అన్నారు. మండలంలోని గుడిమెట్ట ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, పొగాకు వినియోగం వలన వచ్చే అనర్థాల గురించి కళాజాత రూపంలో విద్యార్థులకు ఏఎస్ ఎస్ఐఎస్‌టీ సంస్థ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చల్లా శ్రీనివాసులు, బొర్రా తిరుపాల్‌రెడ్డి, కె.సుజాత, బి.రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి

రాచర్ల, ఫిబ్రవరి 22 : గ్రంథాలయాలు విద్యార్థులతో పాటు గ్రామస్థులు కూడా వినియోగించుకోవాలని, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ఆదిలక్ష్మీ అన్నారు. రాచర్లలోని గ్రంథాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను, ఫర్నీచర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాల యంలోని పుస్తకాలను పఠించినట్లయితే కొత్త అంశాలను తెలుసు కోవచ్చన్నారు. గ్రంథా లయాలకు పంచాయతీ నుంచి వచ్చే సెస్ బకాయి లను వెంటనే వచ్చేలా కృషి చేయాలన్నారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు : జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : జిల్లాలో గ్యాస్ వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ రవాణా చార్జీల పేరుతో డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించా రు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ షోరూం నుంచి వినియోగదారుని ఇంటి వరకు 15 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే ఎటువంటి రుసుం డెలివరీ బాయ్స్‌కు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ నిబంధనలు గ్రామీణ, పట్టణ, సెమీఅర్బ న్ అన్ని ప్రాంతాలకు, అన్ని గ్యాస్ ఏజెన్సీలకు వర్తిస్తుందని ఆయన స్పష్టం చే శారు. నిబంధనలు అతిక్రమించిన ఏజెన్సీలపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. వినియోగదారులు కూడా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలపై అవగాహన పెంచుకొని సేవలు పొందాలన్నారు. ఎవరైనా డెలివరీ బాయ్స్ అసలు ధర కన్నా అధికంగా వసూలు చేస్తూ 8008301512 సెల్ నెంబరులో ఫి ర్యాదు చేయాలని ఆయన వినియోగదారులను కోరారు.

చలో అసెంబ్లీకి వెళ్లిన కాంగ్రెస్ నేతల అరెస్టులు



షర్మిలతోసహా అరెస్టు అయిన రంగస్వామి

గిద్దలూరు, ఫిబ్రవరి 22 : నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం కాంగ్రెస్ పార్టీ సెక్రటరియేట్ ముట్టడి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు నారు తిరుమలనాయుడు 20 మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయవాడ వెళుతుండగా, గురువారం తెల్లవారుజామున మంగళగిరి పోలీసులు వారిని అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి పగడాల రంగస్వామి తన అనుచరులతో కలిసి వేర్వేరు మార్గాల్లో విజయవాడ చేరుకున్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో కలిసి సెక్రటరియేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే అక్కడి పోలీసులు షర్మిలను, గిడుగు రుద్రరాజుతోపాటు పగడాల రంగస్వామిని బలవంతంగా అరెస్టు చేసి ఒకే వ్యాన్‌లో మంగళగిరి పోలీసు స్టేషన్‌కు తరలించి గురువారం సాయంత్రం వదిలిపెట్టారు. ఐదేళ్ల పాటు జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కించిందన్నారు. తాము శాంతియుతంగా నిరసన తెలిపేందుకు రాగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం శోచనీయమన్నారు. త్వరలో జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళాఖాతంలో కలుపడం ఖాయమని పగడాల రంగస్వామి పేర్కొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరునికి ఊంజల్ సేవ



అంజనేయస్వామి అలంకరణ



లక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వరుడు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 22: పట్టణంలోని గుండ్లకమ్మ నదీతీరాన వెలసిన లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో 17వ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం సుప్రభాత సేవ, బ్రహ్మ ఘోష, ద్వాదశ ప్రదక్షిణాలు, ఊంజల్ సేవ నిర్వహించారు. దీంతో వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు చెక్కా మాలకొండ నరసింహరావు, కార్యదర్శ ఊటుకూరి రామ కృష్ణారావు, కోశాధికారి పీవీ శ్రీనివాసులు తదిత రుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

వీరాంజనేయస్వామి తిరునాళ్ల

త్రిపురాంతకం : మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో వెలసిన వీరాంజనేయ స్వామి తిరునాళ్ల గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.

మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలి

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటరెడ్డి తదితరరులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 22: దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను త్యజించిన మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలని ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి అన్నారు. రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు ఎదుట స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెంకే వెంకటరెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ వారిపై దండ యాత్ర చేసి వీరమరణం పొందిన ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు నరసింహారెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జంక్షన్ బోర్డును కూడా జంకె ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీశైల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు డా. చెప్పల్లి కనకదుర్గ, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు గుంటక సుబ్బారెడ్డి, డీవీ కృష్ణారెడ్డి, జి.శ్రీని వాసరెడ్డి, రెడ్డి సంక్షేమ సేవా సంఘం నియోజ కవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, రమణా రెడ్డి, వెంకటరెడ్డి, శివారెడ్డి, కందుల బలరాం రెడ్డి పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీ లింగారెడ్డికాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ మాలాలి ఎస్‌కే షెక్షావలి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు : తొలి స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నరసిహారెడ్డి తిరుగాడిన కొండపై ఆయన ఫొటోతో కూడిన జెండాను ఎగురవేశారు. అనంతరం గిద్దలూరులో వర్ధంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేవారు. టూరిజంశాఖ రాష్ట్ర డైరెక్టర్ పి.రామక్రిష్ణారెడ్డి, యోగా గురువు డి.ఎస్.నారాయణరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, నరసింహులు, వెంకటరామిరెడ్డి, కాశీశ్వరరావు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయనగర రాజుల శాసనం లభ్యం

1482లో చెక్కినట్లు గుర్తింపు



సంగంతాండ వెళ్లేదారిలో లభ్యమైన శాసనం

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 22 : మండలంలోని సంగంతాండ వెళ్లే దారిలో విజయనగర రాజుల కాలం నాటి శాసనాన్ని అధికారులు గుర్తించారు. ఈ శాసనం తెలుగు బాషలో ఉంది. సామాన్యశకం 1482లో చెక్కారు. మహామండలేశ్వర అనివారణసింహారావు, రామ రాయదేవ మహారాజు తన తల్లిదండ్రులు సింగరయ్యల పుణ్యం కోసం కంచుకుంట్ల తిప్పాబట్టుండుకు యేరువ సీమలో ఉన్న శింగవరం గ్రామాన్ని కానుకగా అందించినట్లు నమోదు చేశారు. ఈ గ్రామంలోని కట్టనం, కణికె, వెట్టి పన్నులు కూడా వారికే చెందేటట్లు నమోదు చేశారు. ఈ శాసనాన్ని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ తురిమెళ్ల శ్రీనివాసప్రసాద్ గుర్తించి భారత ఆర్కియాలజీ డైరెక్టరు కె.మునిరత్నంరెడ్డికి పంపించారు. ఆయన శాసనంలోని అంశాలను పరిశీలించి వివరాలను వెల్లడించారు. అనివారణసింహారావు అనే బిరుదు ఉన్న శ్రీనాథరాజు వంశీయులు, విజయనగర, గజపతులు రాజుల ఏలుబడిలో యేరువ సీమ, (మార్కాపురం కంభం ప్రాంతాలు) నాగార్జున కొండసీమ (పల్నాడు), కొలుకుల సీమ (ఎర్రగొండపాలెం పరిసరాలు-ప్రకాశం జిల్లా) పెన్నాంబడి సీమ (గుత్తి పరిసరాలు-అనంతపురం జిల్లా) కేతవరం సీమ(బెల్లంకొండ, ముప్పాళ్ల పరిసరాలు, పల్నాడు జిల్లా)లను పాలించిననట్లు 15, 16 శతాబ్ది శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ శాసనం పరిశీలనలో పిల్లగాలి నాగార్జున, జి.ఆదినారాయణ పాల్గొన్నారు.

వామ్మో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



పాఠశాల ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్
మురుగుగుంతలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 22 : విద్యార్థుల కోసం ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసి వి ద్యకు అవసరమయ్యే సౌకర్యాలు కల్పించింది. కానీ ప్రభుత్వ పాఠశాలలో కొన్ని చోట్ల గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ప్ర మాదాల బారినపడే అవకా శం కనిపిస్తుంది. మార్కాపు రం మండలంలోని బోడపా డు గ్రామ ప్రభుత్వ ఎంపీపీ పాఠశాల వద్ద ప్రమాదకరం గా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో కరెంటు స్తంభం మురుగు గుంటలో తీగలు వేలాడుతూ ఉన్నాయి. ఆ విద్యుత్ స్తంభం మురికి నీరు నిల్వ ఉండే గుంతలో ఉంది. ఆ స్తంభం వద్ద ప్రమాదాలు జరగకుండా ఎటువంటి రక్షణ ఏర్పాట్లను కూడా అధికారులు చేయలేదు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 80 మందికి పైగా చిన్నారులు చదువుతున్నారు. విరామ సమయంలో విద్యార్థులు ఆడుకునేందుకు బయటకు వస్తే ఇక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్, స్తంభవంతో ప్రమాదం జరిగే అవకాశముందని తల్లిదండ్రులు, ఉ పాధ్యాయులు రోజూ ఆందోళన చెందుతున్నారు. చేతు లు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా చేయకుండా నిర్లక్ష్యం వీడి అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యుత్ స్తం భాన్ని పిల్లలకు దగ్గరగా రోడ్డుపై కాకుండా దూరంలో ఏర్పాటు చేసి, ప్రమాదం నుంచి పిల్లలను కాపాడాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఎటాంటి స్పందన కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు విద్యార్థులు ప్రాణాలతో చెల గాలమాడకుండా తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్‌ను తొల గించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిశీలించి..అధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం

ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం పరిస్థితిపై విద్యుత్ శాఖ ఏఈ సుబ్బరాయుడు వివరణ కోరగా.. ఆ ప్రదేశాన్ని పరిశీలిస్తాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళ్తాం. వారి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- ఏఈ సుబ్బరాయుడు

సమయం లేదు.. సైనికుల్లా పనిచేయండి

టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర దిశానిర్దేశం

కనిగిరి, ఫిబ్రవరి 22 : ఎన్నికలు సమీపిస్తున్నాయి.. సమయం లేదు.. సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం టీడీపీ పట్టణ అధ్యక్షులు, నాయకులు, బూత్ కన్వీనర్‌లు, బూత్ ఇన్‌చార్జిలతో డాక్టర్ ఉగ్ర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ ఎన్నికలకు ఇంకా 50 రోజుల గడువు మాత్రమే ఉందని అందరూ సమాయత్తం కావాలన్నారు. కీలకమైన ఈ సమయంలో కనిగిరి పట్టణంలోని ప్రతి వార్డులోనూ వార్డు నాయకులు పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు వేసే ఎత్తుగడలను ముందుగానే పసిగట్టి వాటిని తిప్పికొట్టాలన్నారు. ప్రతి రోజూ ఒక్కో వీధిని ఎంచుకుని ఓటర్లను నేరుగా కలసి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఎంత ముఖ్యమో తెలియచేయాలన్నారు. అదే సమయంలో కనిగిరి అభివృద్ధి కోసం పార్టీ తీసుకున్న లక్ష్యాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. కనిగిరి ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, భావితరాల బంగారు భవిష్యత్ కోసం.. తాను ఉపాధి కల్పన కోసం తీసుకుంటున్న చర్యలను తెలియజేయాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం, రవాణా సౌకర్యం వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మంచి నీటి సరఫరా, నీటి ఎద్దడి నివారణ కోసం తీసుకోనున్న చర్యలను ప్రజలకు జాగ్రత్తగా తెలియజేయాలన్నారు. ప్రతి వార్డు అధ్యక్షుడు పార్టీ శ్రేణులను వెంట పెట్టుకుని ఓటరుతో మమేకమవ్వాలన్నారు. కార్యక్రమాలను శుక్రవారం నుంచి ప్రారంభించాలని ఉగ్ర సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్‌తో పాటు 20 వార్డుల అధ్యక్షులు, బూత్ కన్వీనర్‌లు, శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

పామూరు, ఫిబ్రవరి 22 : పట్టణంలోని తూర్పు వీధిలో శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో రుత్వికులు రావూరి సత్యనారాయణశాస్త్రి, పప్పు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ పట్టణ ఎన్నికల కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా మాల్యాద్రిచౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇర్రి కోటిరెడ్డి, మండ్లా మల్లికార్జున, జీ మహేష్, పోకా వినోద్, కే ప్రభాకర్, మండ్లా రమణయ్య పాల్గొన్నారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు, కంకణధారులు, ప్రజలు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉగ్ర, నాయకులు

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

వెలిగండ్ల, ఫిబ్రవరి 22 : వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పి.నాగులవరం బస్టాండ్ సెంటర్‌లో వెన్న వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చలివేంద్రాన్ని స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతుందని, నిత్యం పరిసర గ్రామాల నుంచి వివిధ పనుల కోసం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడుతాయని పేర్కొన్నారు. చలివేంద్రం దాత వెంకటేశ్వరరెడ్డిని ఉగ్ర అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శ్యామల కాశిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గోనా ప్రతాప్, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి సలోమన్ రాజు, వెలిగండ్ల ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వరరెడ్డి, టీ నారాయణ, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్ రెడ్డి, కొండు భాస్కర్ రెడ్డి, కేసరి రమణా రెడ్డి, ఒంగోలు శ్రీను, నాగరాజు, సైరుద్దీన్, రామచంద్రయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల ఆకస్మిక తనిఖీ

దొనకొండ, ఫిబ్రవరి 22 : దొనకొండ గ్రామ పంచాయతీలోని వీవీ పురం పరిధిలో ఉన్న ఉర్దూ ప్రాథమిక పాఠశాలను ఒంగోలు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఉర్దూ రేంజి షేక్ మొహిద్దీన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. విద్యార్థులకు అనే ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ప్రధానోపాధ్యాయుడు ఆదిమూలపు ప్రభుదాస్ పనితీరును వివరించగా, షేక్ మొహిద్దీన్ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఉపయోగం

పామూరు, ఫిబ్రవరి 22 : నిరుపేదల వైద్య అవసాల కోసం ఏర్పాటు చేసిన సీఎంఆర్‌ఎఫ్ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఉప సర్పంచ్ వైవీ సాయికిరణ్ అన్నారు. మండలంలోని పిన్నివెంకట రమణయ్యకు సంబంధించి మంజూరైన రూ.45వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును నుచ్చుపొద గ్రామ సర్పంచ్ భర్త పిన్ని రత్తయ్య గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్, చాంద్‌బాషా, కల్లూరి, రామిరెడ్డి, జీవీ భాస్కరరెడ్డి, ఎం.నారాయణరెడ్డి, అనంతరెడ్డి పాల్గొన్నారు.

షర్మిల అరెస్టు దుర్మార్గం

పామూరు, ఫిబ్రవరి 22 : నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో సెక్రటేరియట్ నిర్వహించిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్యావలా మౌలాలి అన్నారు. ప్రజల సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును జగన్‌రెడ్డి పోలీసులతో కాలరాయాలని చూడడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతల అరెస్టును ఖండించారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ డీఎం శ్రీమన్నారాయణ



కనిగిరి, ఫిబ్రవరి 22: కనిగిరి ప్రాంత యాత్రికలకు తీర్థయాత్రల సందర్శనకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం శ్రీమన్నారాయణ గురువారం తెలిపారు. కనిగిరి ఆర్టీసీ డిపో నుంచి షిరిడీ యాత్ర కోసం మార్చి 11వ తేదీ రాత్రి 8గంటలకు బస్సులు బయలు దేరుతాయన్నారు. షిరిడీ యాత్రలో భాగంగా 12 పుణ్యక్షేత్రాలను కూడా సందర్శించే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ యాత్రలో యాదగిరిగుట్ట, బాసర, ఔరంగాబాద్, గృశ్వేశ్వర్, త్రయంబకం జ్యోతిర్లింగాలు, నాసిక్, షిరిడీ, శాకోరి, శనిసింగనాపూర్, పండరీపురం, ఎల్లోరా గుహలు, తుల్జాపూర్‌లోని వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకుని మార్చి 18వ తేదీ ఉదయానికి తిరిగి కనిగిరికి చేరుకుంటారన్నారు. ఈ యాత్రలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి అల్పాహారంతో కలిపి రూ.7వేలు చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు. ముందుగా టికెట్లు రిజర్వు చేసుకున్న వారికి మాత్రమే ఈ అవకాశం లభిస్తుందన్నారు. పూర్తి వివరాలకు 9652260174 నెంబరును సంప్రదించాలని డీఎం శ్రీమన్నారాయణ కోరారు.



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న వీసీ అంజిరెడ్డి

లక్ష్యంతో చదివితేనే భవిష్యత్

ఆంధ్రకేసరి వర్సిటీ వీసీ అంజిరెడ్డి

పామూరు, ఫిబ్రవరి 22 : విద్యార్థులు బాల్యం నుంచే లక్ష్యం, ప్రణాళికతో చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రుల కల నెరవేరుతుందని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎం.అంజిరెడ్డి సూచించారు. అక్షర కళాశాల 15వ వార్షికోత్సవం పువ్వాడి రాధాకృష్ణ కన్వెన్షన్ హాలులో గురువారం అక్షర కళాశాల డైరెక్టర్ కదిరి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ అంజిరెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ర్యాంకులు సాధించి ఊరికి, కళాశాలకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. వెనుకబడిన పామూరు లాంటి గ్రామంలో జూనియర్ కళాశాల స్థాయి నుంచి డిగ్రీ, బీఈడీ కళాశాల స్థాయికి అక్షర కాలేజీ చేరుకోవడం అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ కదిరి బాబు రంగారావు కృషిని ప్రశంసించారు. కరస్పాండెంట్ బాబు రంగారావు మాట్లాడుతూ తమ కళాశాలలో మంచి బోధనతోపాటు విలువలను నింపుతున్నామన్నారు. గతేడాది రాష్ట్ర, డివిజనల్, నియోజకవర్గ, మండల స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వీసీ జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వీసీని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు ఎం.జయకుమార్, సీహెచ్.జయరామిరెడ్డి, రామబ్రహ్మం, షేక్ రఫీ, జాజం శ్రీనివాసులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వెంకాయమ్మ

కురిచేడు, ఫిబ్రవరి 22: కురిచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గురువారం ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ ల్యాబ్‌లో ఈఎస్ఆర్ ఎన్‌లార్జర్, యూరిన్ ఎనలైజర్, ఎలక్ట్రోలైట్ ఎనలైజర్, టీబీ ఆర్‌జే పీసీఆర్ ఎనలైజర్, బ్లడ్‌సెల్ కౌంటర్ లాంటి అత్యాధునిక రక్త పరీక్షల మిషన్లను ప్రారంభించారు. సుమారు రూ.15 లక్షల విలువైన యంత్రాలు పీహెచ్‌సీకి సమకూరినట్లు వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. దీని వలన రోగులు వైద్య పరీక్షల కోసం ప్రైవేటు ల్యాబ్‌ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. ప్రభుత్వం రోగుల వద్దకే పరీక్షల కిట్లను తీసుకు వస్తున్నట్లు దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి అన్నారు. వారివెంట వైద్యశాల సిబ్బంది, వైసీపీ నాయకులు ఉన్నారు.

కురిచేడులోని వలంటీర్లను గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఘనంగా సత్కరించారు. మండలంలోని 247 వలంటీర్ల సత్కార కార్యక్రమం జరిగింది. వారిలో 5గురిని సేవారత్న బిరుదుతో పాటుగా మెడల్, ధృవపత్రం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ప్రజలకు సేవ చేస్తున్న తమకు ఏదో ఒకటి చేయాలని వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డిని వలంటీర్లు అడిగారు. తమ ట్రస్ట్ తరపున వారికి రూ.5 లక్షల ప్రమాద బీమాను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కురిచేడులోని పెద్ద చెరువును మంచినీటి చెరువుగా మార్చి తాగునీటి కష్టాలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్, మండల పరిషత్ సిబ్బంది, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో భవిష్యత్‌కు గ్యారెంటీ



బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

దొనకొండ, ఫిబ్రవరి 22 : అన్ని వర్గాల ప్రజల బంగారు భవిష్యత్ కోసమే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను రూపొందించారని టీడీపీ మండల నాయకులు వీ వెంకన్నచౌదరి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్ పేర్కొన్నారు. దొనకొండలో వెంకన్నచౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దొనకొండ ప్రధాన రహదారి, గుట్టమీదపల్లి, వీరవెంకటాపురం, ముస్లిం బజారు, బ్రహ్మారావుపేటలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధినేత చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికీ వరమన్నారు. జగన్‌రెడ్డి నియంత పాలన సాగుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, వేసవి ప్రారంభంలోనే గ్రామాల్లో ప్రజలు గుక్కెడు మంచినీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నా వైసీపీ పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. గ్రామాల్లో అభివృద్ధి, అన్నీ వర్గాల ప్రజలకు సముచిత న్యాయం కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా రావాలన్నారు. ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా ప్రజలంతా నిలవాలన్నారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెట్టి, అన్నివర్గాల ప్రజలను ఇబ్బందులు పెట్టిన జగన్‌రెడ్డిని గద్దె దింపాలని కోరారు. కార్యక్రమంలో వెంకన్నచౌదరితో పాటు జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, మాజీ ఎంపీపీ నూనె విజయకుమారి, మాజీ మండల కోఆప్షన్‌షేక్ ముసామియా, సీనియర్ నాయకులు కామేపల్లి చెంచయ్య, తాండ్ర వెంకటేశ్వర్లు, తోటా కోటేశ్వరరావు, దుగ్గెంపూడి కోటేశ్వరరావు, వేగినాటి అల్లూరయ్య, వైకే చౌదరి, వల్లపునేని ఆదినారాయణ, ఫణిదపు అనంతరాములు, షేక్ సుభానీ, పురుషోత్తం సత్యానందం, నూనె యోహన్, నూనె డేవిడ్‌సన్, ఫణిదపు వీరాంజనేయులు, పులిమి శ్రీరాములు, జనసేన మండల, పట్టణ పార్టీల అధ్యక్షులు గుండాల నాగేంద్ర ప్రసాద్, ఎం షఫిఉల్లాఖాన్ (బాజీ), బండారు వెంకట్, హనుమంతరావు మరికొందరు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

మద్యాంధ్రగా మార్చిన జగన్‌రెడ్డి

తాళ్లూరు, ఫిబ్రవరి 22 : వైసీపీ అధికారంలోకి వస్తే మద్యం నిషేధం అమలు చేస్తామని చెప్పిన జగన్‌రెడ్డి ఏకంగా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని జిల్లా టీడీపీ లీగల్‌సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ విమర్శించారు. ప్రతి పల్లెకూ టీడీపీ ప్రజాయాత్ర శివరాంపురం గ్రామంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా మద్య నిషేధం లేకపోగా గ్రామ గ్రామాన మద్యం బెల్టు దుకాణాలు ఏర్పాటయ్యాయన్నారు. మద్యం, గంజాయి అమ్మకాలు విపరీతంగా పెరిగాయన్నారు. జే బ్రాండ్ మద్యం తాగుతున్న పేదలు రోగాలపాలువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత గంజాయి మత్తుకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి పాలనలో అరాచకాలు, హత్యలు, దాడులు, దోపిడీతో ప్రజలు సంతోషాన్ని కోల్పోయారన్నారు. పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. స్వర్ణాంధ్ర, సంతోషాంధ్ర కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో అరాచక వైసీపీ పాలనకు స్వస్తి చెప్పాలని సురేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, ముప్పనేని కృష్ణారావు, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, వద్దినేని వెంకట రమణ, వెంకయ్య, బోడపాటి అంజనేయులు, నిడమూరి కోటయ్య, టీడీపీ శ్రేణులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గురువయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పిచ్చయ్య

టీడీపీ నాయకుడు మృతి

దర్శి, ఫిబ్రవరి 22 : మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వల్లెపు గురవయ్య అనారోగ్యంతో మృతి చెందారు. దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య కౌన్సిలర్లు దత్తు, రంగా, దినకర్, రామగిరి తదితరులు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గురవయ్య కుమారుడు నారాయణ టీడీపీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్నారు. గతంలో ఏఎంసీ డైరెక్టర్‌గా సేవలందించారు. గురవయ్య మృతిపట్ల టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కుమారుడు నారాయణ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వెంకటరమణ మృతికి సంతాపం

తాళ్లూరు, ఫిబ్రవరి 22 : గుండెపోటుతో మృతి చెందిన ప్రవాస భారతీయుడు, టీడీపీ నేత మన్నం వెంకట రమణ మృతిపట్ల టీడీపీ మండల నాయకులు గురువారం ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. దర్శి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీలో నిలిచి పార్టీ శ్రేణులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు బీ ఓబుల్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శులు మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, రాష్ట్ర టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ కార్యదర్శి షేక్ కాలేషావలి, రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, రాచకొండ వెంకట్రావు, లక్ష్మీనారాయణ, అనపర్తి సుబ్బారావు, సుబ్బారెడ్డి, పరిశుద్ధరావు, నాగార్జునరెడ్డి తదితరులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జనసేన పార్టీలోకి వైసీపీ సానుభూతిపరులు

పీసీపల్లి, ఫిబ్రవరి 22 : మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన 10 కుటుంబాలకు చెందిన వైసీపీ సానుభూతిపరులు బుధవారం రాత్రి వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బండారు రాజు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రాజు మాట్లాడుతూ వైసీపీ అవినీతి అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాలన్నారు. జనసేన, టీడీపీ పార్టీల విజయం రాష్ట్రానికి ఎంతో అవసరమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కనిగిరి నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పార్టీలో చేరినవారిలో చందు, సాల్మన్, ఇమ్మానియల్, డేవిడ్, సిద్ధూ, వినేష్, మోజేష్, ఏసేబు, నగేష్, కిరణ్, రాఘవ, చైతన్య ఉన్నారు.



వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరిన వారితో రాజు

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

జేవీవీ జాతీయ కార్యదర్శి గయాజ్

కనిగిరి, ఫిబ్రవరి 22: విద్యార్థినీవిద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జేవీవీ జాతీయ కార్యదర్శి గయాజ్ బాషా అన్నారు. స్థానిక మాంటిస్సోరి పబ్లిక్ స్కూల్‌లో పదవతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు సమయస్ఫూర్తితో రోజుకు 18 గంటలు మనసుపెట్టి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ఆదేవిధంగా పరీక్షలు ముగిసేవరకు మితాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అప్పుడే జ్ఞాపకశక్తి పెరిగి చురుగ్గా పరీక్షలు రాయగలరన్నారు. పరీక్ష హాలులో ఆందోళన విడిచిపెట్టి ప్రశాంతంగా రాయాలన్నారు. దస్తూరీతో వేగంగా జవాబులు రాస్తే సమయం వృథా కాదని బాషా సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెంచయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి


కనిగిరి, ఫిబ్రవరి 22 : నేటి కమ్యూనిస్టులు తవనం చెంచయ్య లాంటి మహోన్నత వ్యక్తిని ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు అన్నారు. సుందరయ్య భవనంలో గురువారం చెంచయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బలహీన వర్గాల కోసం చెంచయ్య తుది వరకూ పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌వలి, నరేంద్ర, వెంకటరెడ్డి, లక్ష్మయ్య, ప్రసాద్, ప్రసన్న, వెంకటమ్మ, రాధా, సీతామహాలక్ష్మి, నారాయణమ్మ, ఎలీసమ్మ, శాంత కుమారి పాల్గొన్నారు. తొలుత చెంచయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్బీకేలలో కందుల కొనుగోలు

పీసీపల్లి, ఫిబ్రవరి 22 : 2023-24 కరీఫ్‌లో పంటలు సాగు చేసిన కంది పంటను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు ఏడీఏ వెంకటరమణ చెప్పారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం కంది రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా కంది పప్పును సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. గోనె సంచులు, హమాలీ ఖర్చులు, రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే భరాయిస్తుందని చెప్పారు. ఇందుకుగాను టన్నుకు రూ.756 రైతు ఖాతాలో జమచేయనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పోలు జయరామిరెడ్డి, ఏవో వెంకటస్వామి, రైతులు ఉన్నారు.

చెట్టును ఢీకొన్న కారు - ఇద్దరికి గాయాలు

పీసీపల్లి, ఫిబ్రవరి 22 : కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన సంఘటన మండలంలోని పెదఇర్లపాడు గ్రామ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కారులో నెల్లూరుకు చెందిన కొంతమంది కందుకూరు వైపు నుంచి కనిగిరి వెళ్తున్నారు. అలవలపాడు సమీపంలోని అంకమ్మగుడి సమీపంలో ఉన్న స్పీడు బ్రేకర్ వద్ద కారు అదుపుతప్పి ప్రక్కనే ఉన్న తాడిచెట్టును ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడినట్లు స్థానికులు తెలిపారు. ఈప్రమాదం జరిగిన వెంటనే కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రాణాప్రాయం తప్పినట్లు వారు తెలిపారు. 108 వచ్చే లోపే అందులోని క్షతగాత్రులు కనిగిరికి వెళ్లినట్లు తెలిసింది. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు రాలేదు.





కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం



కొల్లిపర మండలంలో ఒడ్డు వెంట నీరు బయటకు వచ్చేలా 11 అడుగుల పైగా లోతులో ఇసుక తవ్వేస్తున్న చిత్రం

ఇసుక.. మస్కా

- తవ్వకాలు ఆగిందే లేదు
- అడ్డే లేకుండా అక్రమాలు
- బ్యారేజీకి దిగువన రెట్టింపైన తవ్వకాలు
- కలెక్టర్ల పర్యటన తర్వాత మరింత విచ్చలవిడిగా..
- నేటికీ అమరావతి, అచ్చంపేట, క్రోసూరుల్లో క్వారీయింగ్
- యంత్రాలు వినియోగించడం లేదని అబద్ధపు నివేదికలు
- ఉపగ్రహ చిత్రాలను అందించి కౌంటర్ ఇచ్చిన కమిటీ

గుంటూరు, తెనాలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ కొరడా ఝుళిపించిన, స్వయానా జిల్లా కలెక్టర్లే రీచ్‌లపై దాడులు చేసినా, ఇసుక అక్రమ తవ్వకాలు మాత్రం అడ్డుకట్టే పడలేదు. యంత్రాలతో తవ్వకూడదని, భారీ వాహనాలను నదిలో దింపకూడదనే నీటి ప్రవాహాలకు దగ్గరలో కాని నీరు బయటపడేంతగా కానీ ఇసుక తవ్వకూడదనే నిబంధనలను, వాల్టా చట్టం ఆదేశిస్తున్న ఎక్కడా నిబంధనలు అమలుకే నోచుకోకుండా పోతోంది. భారీ యంత్రాలు పెట్టి పది నుంచి 15 అడుగుల లోతు తీస్తూ ఇసుకను తవ్వేస్తూ భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడేలా చేస్తుంటే మరోపక్క అనుమతులు ఒక చోట ఉంటే వారి ఇష్టం వచ్చిన తవ్వేస్తూ అడ్డగోలు ఇసుక క్వారీయింగ్‌కు తెగబడుతున్నారు. ఇంత దారుణాలు ఇసుక రీచ్‌లలో బహిరంగంగానే జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు శాఖలు కానీ హద్దులు నిర్ణయించి తవ్వకాలు పర్యవేక్షించాల్సిన మైనింగ్ శాఖ కానీ కన్నెత్తి కూడా చూడటం లేదంటే అధికార పార్టీ నేతల దందా ఏ మేర కొనసాగుతుందో అర్థమవుతుంది. ప్రకాశం బ్యారేజీ దిగువన గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కేవలం మూడు చోట్లే ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇస్తే మరో ఆరుచోట్ల అనధికారికంగా తవ్వకాలు జరిపిస్తున్నారు. పాతూరు, పెదకొండూరు, వల్లభాపురం, మున్నంగి, బొమ్మువానిపాలెం, గాజుల్లంక, జువ్వలపాలెం, పెనుమూడి రేవుల దగ్గర ఇసుకను విచ్చవిడిగా తవ్వేస్తున్నారు. ఇటీవల రెండు జిల్లాల కలెక్టర్లు కొల్లూరు మండలం జువ్వలపాలెం, కొల్లిపర మండలంలో రీచ్‌లను పరిశీలించిన సంగతి తెలిసిందే. కలెక్టర్ వచ్చిన సమయంలో కొన్ని గంటలు మాత్రమే ఇసుక తవ్వకాలు నిలిపి వేసి రీచ్‌ల నుంచి కలెక్టర్‌లు అడుగు బయట పెట్టిన వెంటనే మళ్లీ అక్రమ తవ్వకాలను యధావిధిగా కొనసాగించారు. ఎక్కడా ఆపిన దాఖలాలే లేవు. తాజాగా మరో 10 రీచ్‌లకు మైనింగ్ శాఖ అనుమతులు ఇచ్చింది. సర్వే నెంబర్ల ప్రకారం ఎంత ఇసుక తియ్యాలనే పరిమాణాన్ని కూడా నిర్ణయించింది. ప్రస్తుతం కేటాయించిన రీచ్‌ల సర్వే నెంబర్లలో ఇసుక తవ్వకాలు జరపాలంటే మరో వారం పది రోజులు అన్ని అనుమతులు సమయం పడుతుంది. అయితే ఇప్పుడు కొత్తగా ఇచ్చిన రీచ్‌లలో కొన్ని రీచ్‌లు ఇప్పటికే ఇసుక తవ్వేసి ఉండటం విశేషం. టన్ను నుంచి రెండు టన్నులు పైగా ఒకేసారి ఇసుకను తవ్వగలిగే బొచ్చులు ఉన్న పొక్లెయిన్లతో ఇసుక తోడేస్తుంటే నదీ అడుగు ఉన్న నీరు కూడా బయట పడి భూగర్భ జలాలకు ముప్పు ఏర్పడుతూనే ఉంది.

కొల్లిపర, మంగళగిరి మండలాల పరిధిలో రైతులు, స్థానికులు నీటి ఇబ్బందులతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎండ వేడి పెరుగుతుండటం, రానున్నది వేసవి కావడంతో భూగర్భ జలాలు మరింత అడుగంటి పోతే గుక్కెడు నీరు తాగడానికి అవస్థలు పడాల్సిందేనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. మరోపక్క జగనన్న కాలనీలకు మెరకలు తోలేందుకు గడిచిన రెండేళ్ల నుంచి బుసక కోసం అనుమతులు పెట్టుకుని విచ్చలవిడిగా ఇసుకను తరలించేస్తున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. బొమ్మువానిపాలెం, చిలుమూరు, జువ్వలపాలెం ప్రాంతాల్లో ఏ అనుమతులు లేకపోయినా బుసక తవ్వకాలు జరుగుతున్నాయంటూ అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు, ఇసుక, బుసక తరలింపు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఎన్‌జీటి ఉత్తర్వులు, కలెక్టర్ల ఆకస్మిక తనిఖీలతో ఇప్పటికైనా ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట పడుతుందని కృష్ణా పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు ఆశ పడితే ఎక్కడా వీటికి అడ్డుకట్ట పడలేదు. కలెక్టర్ల తనిఖీలకు ముందు జరిగిన తవ్వకాలకు రెట్టింపు చేసి మరీ అక్రమ తరలింపులకు తెగబడుతుండటం విశేషం.



జీసీకేసీ పేరుతో ఇస్తున్న బిల్లు

సుప్రీంకోర్టు తీర్పుపై ఉత్కంఠ

ఎన్‌జీటీ ఆదేశాల మేరకు ఇటీవలే రెండు జిల్లాల కలెక్టర్లు వారి పరిధిలో ఇసుక రీచ్‌లకు వెళ్లారు. ఆ సమయంలో కొంతమంది సిబ్బంది ముందుగానే వారికి సమాచారం ఇచ్చి యంత్రాలను కనిపించకుండా చేశారు. దాంతో ఇసుక తవ్వకాలు అంతా సవ్యంగా సాగుతున్నట్లు కలెక్టర్లు నివేదికలను ఎన్‌జీటీకి సమర్పించారు. రెండు జిల్లాల్లో ఎక్కడా ఇసుక తవ్వకాలు అనుమతులకు విరుద్ధంగా జరగడం లేదని, యంత్రాలు అసలే వాడటం లేదని వారిచ్చిన నివేదికల్లో పేర్కొన్నారు. అయితే కేంద్ర పర్యావరణ అటవీశాఖ కమిటీ మాత్రం యంత్రాలను వినియోగిస్తున్నారని, అనుమతుల్లేని చోట్ల తవ్వుతున్నారని పేర్కొన్నది. కలెక్టర్ల నివేదికలు అవాస్తవమని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కమిటీ పేర్కొన్నది. రీచ్‌ల వద్దనే టన్నుకు రూ.475 వసూలు చేస్తున్నారు. ఒక్కో రీచ్ నుంచి నిత్యం వెయ్యి నుంచి 2 వేల టన్నుల వరకు ఇసుకని యంత్రాల ద్వారా తీస్తున్నట్లు నివేదించింది. ఉపగ్రహం ద్వారా ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి సేకరించిన చిత్రాలను ఎన్‌జీటీకి సమర్పించింది. ఈ నేపథ్యంలో ఈ కేసుపై తుది తీర్పుని సుప్రీంకోర్టు విచారణ జరిపి ఇవ్వనున్నది. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. సుప్రీంకోర్టు కనుక శాస్త్రీయ ఆధారాలు, కేంద్ర కమిటీ నివేదికలను పరిగణనలోకి తీసుకుంటే అధికారులకు చిక్కులు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.

అక్రమాలు కోకొల్లలు..

ప్రకాశం బ్యారేజ్ ఎగువన గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో పలుచోట్ల ఇసుక అక్రమ తవ్వకాలు నేటికీ కొనసాగుతోన్నాయి. అమరావతి మండలం వైకుంఠపురం రీచ్ వద్ద ఎలాంటి పర్యావరణ అనుమతులు లేవు. దిడుగు, పొందుగల రీచ్‌లకు ఈసీ అనుమతులు ఉన్నప్పటికీ అక్కడ ఎలాంటి యంత్రాలు వినియోగించరాదు. అయితే అక్కడ ఎప్పుడు వెళ్లి చూసినా భారీ ఎక్స్‌కవేటర్లతో లారీలు, ట్రక్కుల్లోకి ఇసుక లోడింగ్ జరుగుతుంటుంది. వైకుంఠపురం రీచ్‌లో ఇసుక నీటిలో ఉంటుంది. ఈ కారణంగా నాణ్యత ఎక్కువగా ఉంటుండటంతో డిమాండ్ అధికంగా ఉన్నది. దీంతో ఇక్కడ డ్రెడ్జర్లు, ఎక్స్‌కవేటర్లతో ఇసుకని తోడేస్తున్నారు. తుళ్లూరు మండలం రాయపూడిలో మూడు రోజుల క్రితం ఇసుక తవ్వకాలు చేపట్టగా టీడీపీ నాయకులు వెళ్లి అడ్డుకోవడంతో అక్కడ తాత్కాలికంగా ఇసుక తవ్వకాలు నిలిచాయి. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలో కోనూరు, అంబడిపూడిలో కలిపి మొత్తం ఆరు చోట్ల మాత్రమే ఈసీలున్నాయి. కోగంటివారిపాలెం, కస్తల, చామర్తి, కొత్తపల్లిలోనూ ఇసుక తవ్వకాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 200 ఎక్స్‌కేవేటర్లు పెట్టి కోగంటివారిపాలెంలో నిత్యం 100 లారీలకు పైగా ఇసుకని తోడేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

నిధుల్లేవ్

- సంక్రాంతి.. కొండవీడు ఉత్సవాలకు నిధులు
- వీటికి రూ.40 లక్షలకు పైగా ఖర్చు
- కోటప్పకొండ తిరునాళ్లకు నిధులు లేవట..!
- తిరునాళ్ల ఏర్పాట్లకు పంచాయతీల నుంచి వసూళ్లు
- రాష్ట్ర పండుగ హోదాతో సరిపుచ్చుతున్న ప్రభుత్వం
- ఏటా తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల తంటా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంబరాలు.. కొండవీడు ఉత్సవాలకు లక్షలు ఖర్చు చేశారు. నెల రోజుల వ్యవధిలో ఈ రెండింటికి దాదాపు రూ.40లక్షల ప్రభుత్వ నిధులను వెచ్చించారు. వీటికి నిధులు విడుదల చేసిన అధికారులు కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లకు నిధులు లేవని చెబుతుండటం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా 8న జరగనున్న తిరునాళ్లకు దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పిస్తున్న ప్రభుత్వం నిధుల విడుదలను విస్మరిస్తోంది. గత ఐదేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఏర్పాట్లకు చందాలపైనే ఆధారపడాల్సివస్తోంది. తిరునాళ్ల ఏర్పాట్ల కోసం జిల్లాలోని పంచాయతీ నుంచి వసూలుకు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాలు జారీ చేశారు. అసలే నిధుల లేమితో గ్రామాల్లో పనులు చేయలేని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తిరునాళ్ల భారాన్ని పంచాయతీలపై మోపడాన్ని కొందరు సర్పంచ్‌లు వ్యతిరేకిస్తున్నారు.

నిధుల దుబారా..

సంక్రాంతి సంబరాలు, కొండవీడు ఉత్సవాల పేరుతో లక్షల్లో ప్రభుత్వ నిధులను ఖర్చు చేశారు. కొందరు అధికారులు వారి కోర్కెలు తీర్చుకొనేందుకే వీటిని నిర్వహించారన్న విమర్శలున్నాయి. కేవలం నృత్యాల కోసం నిధులు దుబారా చేశారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. గత రెండేళ్లుగా సంక్రాంతి సంబరాలకు రూ.20లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఏటా ఖర్చు చేశారు. అలాగే కొండ వీడు ఉత్సవాలకు లక్షల్లో నిధులు వెచ్చించారు. ఏ నిధులు విడుదల చేశారన్న అంశంపై నేటివరకు వెల్లడించ లేదు. దీంతో ఆయా కార్యక్రమాల నిర్వహణలో పారదర్శకత లేదన్న ఆరోపణ లున్నాయి. ఇప్పటికైనా ఆ ఈవెంట్‌లకు ఎంత ఖర్చు చేశారన్న అంశాన్ని వెల్లడించాలన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ నిధులను విడుదల చేయడంలో కృషి చేసిన అధికారులు తిరునాళ్లకు మాత్రం నిధులు సమకూర్చే విషయంలో వారికి చిత్తశుద్ధి కొరవడిందన్న విమర్శలున్నాయి.

ఏసీని సెలవులో పంపించారు..

కోటప్పకొండ దేవస్థానంలో అధికార పార్టీ జోక్యం అధికమైంది. సదరు నేతలు అనుమతిస్తేనే ఇక్కడ విధులు నిర్వహించాల్సిన దుస్థితి. దేవస్థానాన్ని ఏసీ క్యాడర్‌కు అప్‌గ్రేడ్ చేశారు. ఏసీని విధుల్లో చేరకుండా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారు. సెలవులో వెళ్లాలని, తిరునాళ్ల తర్వాత వచ్చి విధుల్లో చేరాలని ఏసీని హెచ్చరించారు. దీంతో సెలవులో ఏసీ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి వెళ్లారు. ఈవో ఇన్‌చార్జ్ ఈవో జి.శ్రీనివాసరెడ్డి కొనసాగుతున్నారు. విధుల్లో కూడా నిబంధనలు పాటించకుండా కొనసాగుతుండటం గమనార్హం. ఏసీ విధుల్లో చేరితే తిరునాళ్ల కొనుగోళ్లలో అవకతవకలకు అవకాశం ఉండదనే ఉద్దేశ్యంతోనే ఆయనను సెలవులో పంపించి వేశారన్న ఆరోపణలున్నాయి. ఏ సరుకులు ఎంతకు కొనుగోలు చేస్తున్నారన్న అంశాన్ని బహిర్గతం చేయడంలేదు. ఇప్పటికైనా సరుకులు, ఇతర సామాగ్రి కొనుగోళ్లకు సంబంధించిన రేట్లను అధికారికంగా వెల్లడిస్తే అపోహలు, ఆరోపణలకు తావుఉండదు. దేవస్థానం కోసం చేస్తున్న సామాగ్రి రేట్ల వెల్లడించేందుకు ఈవో స్పందిస్తారా?, ఆరోపణలకు బలం చేకురుస్తారో వేచి చూడాలి.

ఐదేళ్లుగా తిరునాళ్లకు నిధులు ఇవ్వని ప్రభుత్వం

తిరునాళ్లకు గత ఐదేళ్ల నుంచి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయడంలేదు. కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు ఏటా తిరునాళ్లకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు వసూలు విడుదల చేశాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క తిరునాళ్లకు కూడా ప్రత్యేకంగా నిధులు విడుదల చేయకపోవడం గమనార్హం. ఈ ఏడాది కూడా ఇప్పటివరకు నిధుల ఊసే ప్రభుత్వం ఎత్తలేదు. తిరునాళ్ల ఏర్పాట్లకు ఈసారి కూడా పూర్తిగా చందాలపైనే ఆధార పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకటి కల్లా పంచాయతీలు ఉత్తర్వుల్లో పేర్కొన్నా విధంగా కొండకావూరు పంచాయతీ ఖాతాకు జమ చేయాలని ఉత్తర్వుల్లో తెలిపారు. తిరునాళ్లలో పారిశుధ్య పనుల కోసం పంచాయతీల నుంచి నిధులు సేకరిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి తెలిపారు. పంచాయతీల నుంచి 20 ఏళ్లుగా నిధులు సమకూర్చునట్లు చెప్పారు.

వీఐపీల బస్సులకు నిధులు చెల్లిస్తామని హామీ

తిరునాళ్లకు వచ్చే వీఐపీల సేవలో అధికారులు తరిస్తున్నారు. వీరికి ఏర్పాట్లు చేయడానికి ఇస్తున్న ప్రాధాన్యం సామాన్య భక్తులకు ఇవ్వడం లేదన్న విమర్శలున్నాయి. వీఐపీలను ఉచితంగా కొండ దిగువ నుంచి దేవస్థానానికి తరలించేందుకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు అయ్యే డబ్బు చెల్లించిన అధికారులు భక్తులకు ఏర్పాట్ల విషయంలో నిధులు కేటాయించకుండా మిన్నకుండటం గమనార్హం. డబ్బు చెల్లించందే బస్సులు ఏర్పాటు చేయలేమని ఆర్టీసీ తేల్చి చెప్పింది. దీంతో బస్సులు ఏర్పాటు చేయండి డబ్బు చెల్లిస్తామని సదరు అధికారి తిరునాళ్ల సమీక్షా సమావేశంలో వెల్లడించారు. తిరునాళ్ల ఏర్పాట్ల నిధులపై సమావేశంలో చర్చ జరగకపోవడం గమనార్హం. అయితే కొండ దిగువున పారిశుధ్య పనులకు పంచాయతీలు, మండలపరిషత్‌ల నుంచి రూ.14.45 లక్షలు వసూలు చేసేందుకు కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే గత ఏడాది పంచాయతీల నుంచి రూ.5 లక్షలు వసూలు చేసినట్టు సమావేశంలో పంచాయతీ అధికారి వెల్లడించారు. అయితే ఈ ఏడాది రూ.14.45 లక్షలు వసూలుకు ఉత్తర్వుల విడుదలపై చర్చ జరుగుతోంది. మైనర్ పంచాయతీలు రూ.10వేలు, మేజర్ పంచాయతీలు రూ.20 వేలు, మండల పరిషత్‌ల నుంచి రూ.50 వేలు తిరునాళ్ల కోసం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అద్దంకిలో వైసీపీకి షాక్

- వైస్ చైర్మన్ సహా ఇద్దరు కౌన్సిలర్లు టీడీపీలో చేరిక
- మరో ముగ్గురు సిద్ధం.. మున్సిపాలిటీలో ఫ్యాన్ ఆధిపత్యానికి బ్రేక్
- అందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు

అద్దంకి, ఫిబ్రవరి 22: అద్దంకి మున్సిపాలిటీలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. వైస్ చైర్మన్‌తో పాటు ఇద్దరు కౌన్సిలర్లు పసుపు కండువా కప్పుకోగా మరో ముగ్గురు టీడీపీలోకి వచ్చేందుకు సిద్ధమయ్యారని సమాచారం. వీరు కాక మరికొందరు టీడీపీలోకి వస్తామని ఎమ్మెల్యేకు సమాచారం పంపగా ఆయన నిరాకరించినట్లు తెలిసింది. దీంతో అద్దంకి మున్సిపాలిటీలో వైసీపీ ఆధిపత్యానికి బ్రేక్ పడినట్లు అయ్యింది. మున్సిపాలిటీలో వైసీపీకి 13 మంది, టీడీపీకి ఏడుగురు కౌన్సిలర్‌లు ఉన్నారు. వీరిలో వైస్ చైర్మన్, 5వ వార్డు కౌన్సిలర్ దేసు పద్మేష్‌తో పాటు 8, 13 వార్డుల కౌన్సిలర్లు బొజ్జా వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో అందరూ కలిసి కట్టుగా పనిచేసి మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. వైసీపీ కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకుని ఎవర్నీ పదవుల నుంచి తొలగించడం తమ అభిమతం కాదన్నారు. గతంలో రెండుసార్లు అధికారంలో ఉంటే ఒకసారైనా ప్రతిపక్షంలో ఉండాలని కోరుకునే వాళ్లమని, తద్వారా లోటుపాట్లు తెలిసే అవకాశం ఉండేదన్నారు. అయితే జగన్మోహనరెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రతిపక్షంలో ఉండాలంటేనే భయపడే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతో సహా అందరూ జగన్ బాధితులేనన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, భోజనపల్లి సత్యనారాయణ, గట్టుపల్లి రామారావు, దొప్పలపూడి ప్రసాద్, లహరి, టీడీపీ కౌన్సిలర్లు అత్తులూరి రమేష్, రంగిశెట్టి సుభాషిణి, కంపా రజని, మాగులూరి తిరుపతమ్మ, జహీరా తదితరులు పాల్గొన్నారు.

క్వారీల వద్దకు ఎందుకు వెళ్లారు?

- ఎమ్మెల్యే ఏలూరిని ప్రశ్నించిన అద్దంకి ఎస్‌హెచ్‌వో

మార్టూరు, ఫిబ్రవరి 22: ఆరుగురు గ్రానైట్ పరిశ్రమల యజమానులను గత నెల 31న అరెస్టు చేసిన కేసుకు సంబంధించి గురువారం టీడీపీ బాపట్ల లోక్‌సభ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గురువారం మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో విచారణ నిమిత్తం హాజరయ్యారు. ఈ నెల 13న ఆయనకు మార్టూరు పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ విచారణకు వచ్చారు. విచారణకు ఎమ్మెల్యే ఏలూరి న్యాయవాది హజరత్తయ్యతో హాజరయ్యారు. మార్టూరు, రాజుపాలెం వీఆర్వోలు సాయిప్రసన్న, బిల్లి అంకయ్య సమక్షంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి విచారణ చేశారు. దాదాపు 45 నిమిషాలు విచారణ జరిగినట్లు తెలిసింది. గ్రానైట్ పరిశ్రమల యజమానులు, విజిలెన్స్ అధికారుల మధ్య జరిగిన గొడవలో ఏం జరిగింది, ఆ సమయంలో అక్కడకు ఎందుకు వెళ్లారు, అక్కడ జరిగిన గొడవను చూశారా అంటూ ఏలూరిని ఎస్‌హెచ్‌వో విచారణలో ప్రశ్నించినట్లు తెలిసింది. బాధితులైన గ్రానైట్ పరిశ్రమ యజమానులను నిందితులుగా చేర్చి వారిపై కేసు నమోదు చేయడం న్యాయమేనా.. ఇది ఎంతవరకు సబబంటూ ఎమ్మెల్యే ఎస్‌హెచ్‌వోను ప్రశ్నించినట్లు తెలిసింది. నెల్లూరు విజిలెన్సు అధికారి బాలాజీనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని, మరి గ్రానైట్ పరిశ్రమల యజమానులు ఇచ్చిన ఫిర్యాదుపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఏలూరి ప్రశ్నించినట్లు తెలిసింది. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. గ్రానైట్ పరిశ్రమలో జరుగుతున్న సంఘటనలపై తనకు సమాచారం రావడంతో ఒక ప్రజాప్రతినిధిగా అక్కడకు వెళ్లాల్సి వచ్చిందని, విచారణకు పూర్తిగా సహకారం అందిస్తానని ఏలూరి చెప్పినట్లు తెలిసింది. ఏలూరి విచారణకు వస్తున్నారన్న సమాచారంతో టీడీపీ నాయకులు షేక్ ఫరూక్, తాటి నాగేశ్వరరావు, కన్నెగంటి శ్రీనివాసరావు, మిన్నె కంటి రవికుమార్, శివరాత్రి శ్రీను, కామినేని జనార్దన్, పోలూరి సింగయ్య, గొట్టిపాటి వెంకట్రావు తదితర నాయకులు స్టేషన్ వద్దకు వచ్చారు.



మార్టూరు స్టేషన్‌లో విచారణకు హాజరై బయటకు వచ్చిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

రేంజ్‌లో మరికొందరు డీఎస్పీల బదిలీ

గుంటూరు, ఫిబ్రవరి 22: రేంజ్‌లో మరికొందరు డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పలువురు డీఎస్పీలను బదిలీ చేసినా వారికి తిరిగి స్థాన చలనం కల్పించారు. బదిలీ అయిన డీఎస్పీల వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ 2 డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఈ అశోక్‌కుమార్‌గౌడ్‌ను తుళ్లూరు డీఎస్పీగా నియమించారు. తుళ్లూరు డీఎస్పీగా ఉన్న ఎం వెంకటేశ్వరరావును ఇంటిలిజన్స్‌కు బదిలీ చేశారు. నూజివీడు డీఎస్పి సీహెచ్ మురళీకృష్ణను బాపట్ల డీఎస్పీగా బదిలీ చేశారు. బాపట్ల డీఎస్పీ టీ వెంకటేశ్వర్లును ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ 2 డీఎస్పీగా నియమించారు. ఏసీబీలో పనిచేస్తూ తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా అటాచ్మెంట్‌పై ఉన్న జీ శ్రీనివాసరావును పల్నాడు జిల్లా సీసీఎస్ డీఎస్పీగా నియమించారు. ఇంటిలిజన్స్ డీఎస్పీగా ఉన్న జీ లక్ష్మయ్యను నూజివీడు డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- హాల్‌టిక్కెట్‌తో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 22: విద్యార్థులకు అత్యంత కీలకమైన పదో తరగతి, ఇంటర్మీడియట్, ఓకేషనల్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. పరీక్షల నిర్వాహణపై అనుబంధశాఖల అధికారులతో గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాల కలెక్టర్, అధికారులకు మంత్రి బొత్స సత్యనారాయణ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఒకేషనల్, టెట్, డీఎస్సీ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సమగ్ర ప్రణాళికతో అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కేంద్రాలలోకి ఎలక్ట్రానిక్ డివైస్, ఫోన్, వాచీలు వంటి పరికరాలు అనుమతించరాదన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్నారు. సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కేంద్రాల సమీపంలో 144సెక్షన్ అమలు చేయాలన్నారు. స్పాట్ వాల్యూషన్ సెంటర్‌లో జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు 35 కేంద్రాలలో జరుగుతాయని చెప్పారు. జిల్లా నుంచి 19,853 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారన్నారు. పదో తరగతి పరీక్షలు 108 కేంద్రాలలో మార్చి 18 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 18,910 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఈ పరీక్షల కొరకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఆరు బృందాలను నియమించామన్నారు. ఒకేషనల్ పరీక్షలు మార్చి 18 నుంచి 30 వరకు జరుగుతాయన్నారు. 1204 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతుండగా ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఇంటర్మీడియట్ ఆర్ఐవో పి.యర్రయ్య, డీఈవో నారాయణ, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్. విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



వేదిక వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

నేడు ముఖ్యమంత్రి ఒంగోలు రాక

- ఏర్పాట్లు చేసిన జిల్లా అధికారయంత్రాంగం
- పేదలకు పట్టాల పంపిణీతోపాటు ఒంగోలుకు మంచినీటి పథకం పైలాన్ ఆవిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఒంగోలు రానున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారు కావడంతో కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలోని ఎన్.అగ్రహారంలో నవరత్నాల్లో భాగంగా సుమారు పేదలకు సీఎం ఇంటిపట్టాలను పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఉదయం 10.15 గంటలకు హెలికాప్టర్‌లో అగ్రహారం చేరుకునే ఆయన మధ్యాహ్నం 1.50కు బయలుదేరి తాడేపల్లి వెళ్తారు. మూడున్నర గంటలకుపైగా సీఎం ఒంగోలులో ఉండనున్నారు. 10.45 కు బహిరంగ సభ వద్దకు వచ్చే జగన్ అక్కడ ఏర్పాటుచేసిన ఇళ్ల పాట్లకు శంకుస్థాపన, ఒంగోలుకు మంచినీటి పథకం ప్రాజెక్టుకు పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. 10.50 నుంచి 11 గంటల వరకు సభావేదిక వద్ద ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. అనంతరం బహిరంగసభలో పాల్గొంటారు. ఉదయం 11.35 నుంచి మధ్యాహ్నం 12.35 వరకు లబ్ధిదారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సభ అనంతరం అక్కడ ప్రజాప్రతినిధులతో గంట పాటు చర్చించనున్నారు. దీంతో సీఎం పర్యటనకు అనుగుణంగా గురువారం సాయంత్రానికే అన్ని పనులను పూర్తిచేశారు. ఇంకొకవైపు బహిరంగ సభ జరిగే ప్రాంతంలో గురువారమే పోలీసులు మోహరించారు. సీఎం పర్యటన నేపథ్యంలో సభలో పాల్గొనే లబ్ధిదారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు ఇంకొకవైపు పలు శాఖల అధికారులు ఎన్.అగ్రహారంలో ఉండి ఏర్పాట్లను పరిశీలించారు.



మినీ స్టేడియంలో ఉంచిన ప్రైవేట్ పాఠశాలల బస్సులు

సీఎం సభ.. సంఘాలపై గురి

- పొదుపు మహిళల తరలింపునకు వెయ్యికిపైగా వాహనాలు
- ఒంగోలుతోపాటు చుట్టుపక్కల మండలాలే లక్ష్యం
- రాత్రికే గ్రామాలకు చేరుకున్న బస్సులు

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 22 : సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సభకు పొదుపు సంఘాల మహిళలను వేలాదిగా తరలించేందుకు సెర్ప్ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం పేదలకు పట్టాలు పంపిణీ చేసే ఒంగోలు అర్బన్ ప్రాంతంలోని మహిళలతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళల్ని ఎక్కువసంఖ్యలో సభకు తరలించేందుకు 1000కిపైగా బస్సులను ఇప్పటికే గ్రామాలకు పంపిచారు. ఇందులో ఆర్టీసీ బస్సులతో పాటు ప్రయివేట్ పాఠశాలల బస్సులను కూడా అధికారయంత్రాంగం బలవంతంగా తెప్పించి ఆయా ప్రాంతాలకు గురువారం రాత్రికే పంపించింది. గురువారం ఉదయాన్నే బస్సులు మహిళలతో బయలుదేరి సీఎం సభాప్రాంగణానికి చేరుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగరంలో 50వేల మంది పొదుపు సంఘాల మహిళలను సభాప్రాంగణానికి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది మహిళలు ప్రభుత్వం పంపిణీ చేసే నివేశన స్థలాల్లో లబ్ధిదారులుగా ఉన్నారనేది అధికార యంత్రాంగం వాదన. అందుకే అర్బన్ ప్రాంతం నుంచి ఎక్కువమంది మహిళల్ని తరలిస్తున్నాం అంటున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా మహిళల్ని వేలల్లో సభకు తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. దాదాపు 250 బస్సులను కొండపి, ఎస్ఎన్‌పాడు, ఒంగోలురూరల్ మండలం, కొత్తపట్నం, టంగుటూరు మండలాలకు పంపించారు. సీఎం సభను విజయవంతం చేసే దిశగా రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఇంతియాజ్ గురువారం ఉదయమే జిల్లాకు చేరుకున్నారు. సభకు వేలాదిగా పొదుపుసంఘాల మహిళల్ని తరలించే దిశగా ఆయన వైకేపీ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాలకు రాత్రికే బస్సులు పంపించారు. ఒక్కో బస్సుకు ఆయా ప్రాంతాల్లోని సీసీలను ఇన్‌చార్జీలుగా నియమించారు. వీరు ఉదయాన్నే బస్సుల్లో పొదుపు సంఘాల మహిళల్ని సీఎం సభకు తరలించే బాధ్యతలను అప్పగించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి 15వేల మంది మహిళల్ని తరలించేందుకు బస్సులను సిద్ధం చేసినట్లు వైకేపీ వర్గాలు చెబుతున్నాయి. బస్సుల్లో మహిళలకు అవసరమైన తాగునీరు, అల్పాహారం కూడా సిద్ధం చేశారు.

తాయిలాలు.. బెదిరింపులు!

- సభకు వస్తే చీరలు... లేకుంటే పథకాల్లో కోత
- పొదుపు మహిళలు, లబ్ధిదారులకు ఫోన్ కాల్స్

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 22: సీఎం సభను విజయవంతం చేసేందుకు వైసీపీ నేతలు ఒకవైపు తాయిలాలు ఆశ చూపుతునే మరోవైపు వలంటీర్లతో బెదిరింపులకు దిగుతున్నారు. సభకు వచ్చే భార్యాభర్తలకు చీర, ప్యాంట్ షర్ట్‌లు ఎరగా వేస్తున్నారు. అంతేకాకుండా పొదుపు మహిళలను తరలించే విషయంలో కీలకంగా వ్యవహరించే మెప్మా ఆర్పీలు, సీఓలు, ఇతర సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు బహుమతిగా గురువారమే కీలక నేత పంపిణీ చేసినట్లు సమాచారం. దీంతో ఆర్పీలు సీఎం సభకు రావాల్సిందేనంటూ పొదుపు మహిళలపై ఒత్తిడి పెంచారు. ఖచ్చితంగా సభకు రావాల్సిందేనని ఆదేశాలు జారీ చేస్తూనే, హాజరు కాని వారికి అమ్మఒడి, చేయూత, డ్వాక్రా రుణమాఫీ వంటి పథకాలను తొలగిస్తామని ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. దాంతోపాటుగా డివిజన్‌లలో ప్రజలను సమీకరించేందుకు వార్డు వలంటీర్లకు తాయిలాలు ఆశగా చూపారు. వారికి కూడా ఒకొక్కరికి రూ.5వేలు నజరానా ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే వారికి ఇచ్చే బహుమతి సీఎం సభ ముగిసిన తర్వాత ఇంటికి చేరుస్తామని వెల్లడించినట్లు సమాచారం. అయితే సీఎం సభా వేదిక వద్దకు వచ్చే ప్రతి మహిళకు చీర అందించే వీలు లేకపోవడంతో మొదటగా ఓ పది, ఇరవై మందికి పంపిణీ చేసి, ఆ తర్వాత అందరికీ వార్డు వలంటీర్ల ద్వారా ఇంటికే పంపాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తంగా సీఎం సభను విజయవంతం చేయడం కోసం వైసీపీ నేతలు రకరకాల ఎత్తులు వేస్తున్నారు. పొదుపు మహిళలకు బహుమతులు ఇచ్చి మరీ ఆహ్వానించడం నగరంలో ఇప్పుడు చర్చనీయాంశమైంది.

జన సమీకరణకు గందరగోళం

నేడు ఎన్.అగ్రహారంలో జరిగే పేదల పట్టాల పంపిణీకి భారీగా జన సమీకరణ చేయాలని వైసీపీ నేతలు భావిస్తుండగా, అందుకు అనుగుణంగా ప్రతి డివిజన్‌కు ప్రత్యేకంగా ప్రైవేటు స్కూలు బస్సులు, ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. అయితే ఆర్పీలకు వేరుగా, స్థానిక వైసీపీ కార్పొరేటర్లకు వేరుగా బస్సులు కేటాయించడంతో ఆయా డివిజన్లలో మహిళల తరలింపు కోసం ఆటు ఆర్పీలు, వార్డు వలంటీర్లు, ఇటు వైసీపీ నేతలు ఎవరి పరిధిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వెళ్లే సభ ఒకటే కాగా, ఎవరిబస్సు ఎక్కాలో అర్థం కాక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పోలీసుల నోటీసు

కొండపి, ఫిబ్రవరి 22 : కాంగ్రెస్ పార్టీ ఏపీ సచివాలయ ముట్టడికి పిలుపు ఇచ్చిన నేపథ్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుంటపల్లి శ్రీనివాసరావుకు పోలీసులు బుధవారం రాత్రి చోడవరం గ్రామం ఇంటికి వెళ్లి నోటీసులు అందజేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ పోలీసు అనుమతి లేనందున కార్యక్రమంలో పాల్గొనడం చట్టరీత్యా నేరమని నోటీసులో పోలీసులు పేర్కొన్నారు.

ప్రచారార్భాటమే!

- వైసీపీ పాలనలో జిల్లాపై శీతకన్ను
- శాశ్వత అభివృద్ధి, ఉపాధి అంశాలపై కొరవడిన దృష్టి
- ఏడాదిలో అన్న వెలిగొండ నేటికీ పూర్తికాలేదు..
- గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లకు దిక్కులేదు
- ఊసేలేని పారిశ్రామిక, ఉపాధి రంగాల అభివృద్ధి
- ఒక్క ఇటుక పడని ట్రిపుల్ఐటీ, యూనివర్సిటీ
- తాగునీటి పథకాలు మందగమనం
- వేసవి రాకముందే పశ్చిమాన దాహం కేకలు
- ఇతర మౌలికరంగాలు అంతంతమాత్రమే
- డీఆర్సీ నిర్వీర్యం
- నేడు 11వ సారి జిల్లాకు సీఎం

సీఎం జగన్మోహన్‌రెడ్డి రావడం జిల్లా అంశాలపై దృష్టిపెట్టడం అత్యాశగానే మిగులుతోంది. ముఖ్యమంత్రి హోదాలో ఆయన గతంలో పది సార్లు జిల్లాకు వచ్చారు. అయితే అందులో ఐదుసార్లు తమ పార్టీ వారికి చెందిన ప్రైవేటు కార్యక్రమాలకే హాజరు కాగా నాలుగు సార్లు రాష్ట్రస్థాయి ప్రభుత్వ పథకాల సభలకు వచ్చారు. కేవలం జిల్లాకు సంబంధించిన అంశాలు పరిశీలిస్తే.. 2020 ఫిబ్రవరి 20న వెలిగొండను సందర్శించారు. ఇక 11వసారి శుక్రవారం ఒంగోలుకు వస్తున్నారు. నగర పరిధిలోని పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ కార్యక్రమానికి సీఎం వస్తున్నారు. కాగా జిల్లా అభివృద్ధి, ఉపాధి రంగాలు, మౌలిక వసతుల మెరుగుకు సీఎం హోదాలో ఇచ్చిన హామీల అమలు ఉత్తదే. అలాగే అంతకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో ఇచ్చిన హామీలు మర్చిపోయారు. అలాగే గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన కీలక అంశాలపై ప్రస్తుత ప్రభుత్వం పెద్దగా దృష్టిపెట్టిన దాఖలాలు లేవు. మొత్తంగా జిల్లాకు సీఎం చేసిన అభివృద్ధి, మౌలిక సదుపాయాలు శూన్యమే అని చెప్పవచ్చు



ఒంగోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో జిల్లాపై దృష్టి కొరవడింది. శాశ్వత అభివృద్ధి, ఉపాధి కల్పన రంగాలు, ఇతర మౌలిక అంశాలపై ప్రభుత్వ పరంగా పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. కొత్తగా జిల్లాకు ఉపకరించే పథకాలు, కీలక అభివృద్ధి ప్రాజెక్టులు లేకపోయినా కనీసం గతంలో చేపట్టిన వాటి పూర్తి విషయంలోనూ నిర్లక్ష్యమే కొనసాగింది. జిల్లా అభివృద్ధి, ఉపాధి మార్గాల పెంపునకు ఉపకరించే ఏ ఒక్కటి ఈ ప్రభుత్వ కాలంలో పూర్తికాకపోవడం అందుకు నిదర్శనం. పాలనా పరంగా చూసినా ముందు చూపు లేకుండానే సాగిపోయింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక జిల్లా అభివృద్ధిలో కీలకమైన డీఆర్సీ నిర్వీర్యమైంది. నలుగురు ఇన్‌చార్జీ మంత్రులు మారగా ఆ సమావేశాలు జరగడమే గగనంగా మారింది. చివరి సమావేశం 2023 ఏప్రిల్ 25న జరగ్గా మళ్లీ దాని ఊసే లేదు

నిధులివ్వకుండా నిర్లక్ష్యం

కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పూర్తిచేసి నీరిస్తామని పదే పదే చెప్పిన ప్రభుత్వం పదవీ కాలం ముగుస్తున్నా పట్టించుకోలేదు. పైగా టన్నెళ్లు పూర్తయ్యాయి.. నీళ్లిస్తామని ముంపువాసులను భయపెడుతున్నారు. మరో ప్రధానమైన గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. కనీసం గేట్లు మరమ్మతులు కూడా చేయక అవి కొట్టుకుపోయి ఆయకట్టు రైతులు నీరందక తీవ్రంగా నష్టపోయారు. ట్రిపుల్‌ఐటీ, యూనివర్సిటీ నిర్మాణాలకు ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క ఇటుక పెట్టిన దాఖలాలు లేకపోగా ఈ ప్రభుత్వం మంజూరుచేసిన మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణంలో పదిశాతం మించి వ్యయం జరగలేదు. దోర్నాలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అసంపూర్తిగానే ఉంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంపొందించే కనిగిరి నిమ్జ్, దొనకొండ కారిడార్ ల ఊసే కొరవడింది. నేటికి వందలాది గ్రామాల్లో ప్రజలు దాహార్తితో తల్లడిల్లిపోతున్నారు. కీలకమైన రోడ్లు, ఇతర రంగాల అభివృద్ధి నిర్లక్ష్యం చేయడమే కాక కేంద్రం నుంచి భారీగా నిధులు సమకూరే రైల్వే, జాతీయ రహదారులు, ఇతర ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తిచేయడంలోనూ రాష్ట్రప్రభుత్వం నుంచి తగు చొరవ లేక ముందుకు సాగడం లేదు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన భవన నిర్మాణాలు, చివరకు తాగునీటి సరఫరా బిల్లులు కూడా సకాలంలో రాక పనులు చేసిన వారు గగ్గోలు పెడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఒంగోలులో పేదలకు పట్టాలు పంపిణీ పేరుతో సీఎం వస్తుండగా ఎన్నికల్లో లబ్ధిప్రయత్నం తప్ప జిల్లా అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వానికి ధ్యాస లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వెలిగొండపై దాటవేత ధోరణి

జిల్లాకు ప్రధానమైన వెలిగొండ విషయం చూస్తే ప్రాజెక్టును తీవ్ర నిర్లక్ష్యం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పూర్తిచేసి నీరిస్తామని ప్రతిపక్ష నేతగా, ఎన్నిక ప్రచారంలో పలుమార్లు జగన్ చెప్పారు. సీఎం అయ్యాక 2020 ఫిబ్రవరిన వెలిగొండను సందర్శించి అదే ఏడాది ఆగస్టుకు తొలి టన్నెల్ ద్వారా నీరిస్తామని ప్రకటించారు. ప్రభుత్వకాలం ముగుస్తున్నా ఇంతవరకు ఇవ్వలేదు. నాలుగున్నరేళ్లలో వెయ్యి కోట్లు కూడా ఖర్చుపెట్టలేదు. నిర్వాసితులకు రూ.1,300 కోట్లకు 2021 ఫిబ్రవరిలో జీవో ఇచ్చినా ఇంతవరకు నిధులు ఇవ్వక వారి తరలింపు ఆగిపోయింది. రెండు టన్నెళ్ల పనులు పూర్తయినా ప్రస్తుతం నదిలో నీరు లేక తీసుకునే వీలులేకుండా పోగా నిర్వాసితుల తరలింపు, ఫీడర్ కాలువ ఇతర పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటిదాకా రూ.6వేల కోట్లు ఖర్చుచేయగా మరో రూ.3,600కోట్లకుపైగా అవసరం.

- మరో కీలకమైన గుండ్లకమ్మ నిర్వహణను గాలికొదిలేశారు ఏళ్లతరబడి గేట్ల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో ఒకటికి రెండుసార్లు గేట్లు కొట్టుకుపోయాయి. రూ.10కోట్ల ఖర్చుతో జరిగే పనులు పట్టించుకోక వరుసగా రెండేళ్లు కీలక సమయంలో గేట్లు కొట్టుకుపోయి నీరంతా సముద్రపాలై రైతులు అల్లాడుతున్నారు. దాంతో సుమారు రూ.500 కోట్ల మేర పంట ఉత్పత్తులను రైతులు కోల్పోవాల్సి వచ్చింది. ఇతర సాగునీటి వనరులపైనా ఇదే నిర్లక్ష్యం జరిగింది.
- నాడు-నేడు పేరుతో భారీగా నిధులు వెచ్చించి విద్య, వైద్య సంస్థల్లో సౌకర్యాలు మెరుగుపర్చామని గొప్పలు చెప్పుకుంటున్నా జిల్లాలో సగం చోట్ల కూడా ఆపనులు కొలిక్కి రాలేదు. మరోవైపు గత ప్రభుత్వంలో మంజూరుచేసి శంకుస్థాపనలు జరిగిన ట్రిపుల్‌ఐటీ, ఏకే యూనివర్సిటీల నిర్మాణానికి ఒక్క రూపాయి ఖర్చుపెట్టలేదు. దీంతో సౌకర్యాలు సరిలేక విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఇక ఈ ప్రభుత్వం వచ్చాక మార్కాపురంలో మెడికల్ కాలేజీ మంజూరుచేసింది. షెడ్యూల్ ప్రకారం 2024-25లో తరగతులు ప్రారంభించాలి. అయితే రూ.475 కోట్లతో మంజూరైన ఆ కళాశాల నిర్మాణాలు అధికభాగం పునాదులు దాటలేదు. కేవలం రూ.50కోట్లు లోపుగానే ఖర్చుచేయగా శరవేగంగా చేసినా మరో రెండేళ్లకుపైగా పట్టే పరిస్థితి. దోర్నాలలో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌ది అదే పరిస్థితి.
- కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు, సహజవనరుల సద్వినియోగంపై పట్టించుకోకపోయినా కనీసం గతంలో మంజూరైన, ప్రభుత్వాలు చేపట్టిన ప్రాజెక్టులను కూడా తీవ్ర నిర్లక్ష్యం చేశారు. కేంద్రం మంజూరు చేసిన నిమ్జ్‌కు స్థలం మార్పు చేశారు తప్ప ఒక్క అడుగు ముందుకు పడలేదు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో పెద్దఎత్తున పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన దొనకొండ కారిడార్ వద్ద పరిశ్రమల ఏర్పాటుకు ఏమాత్రం చొరవ చూపలేదు. సోలార్ ప్లాంట్ అంటూ హడావుడి చేసి వదిలేశారు. ఎంఎస్ఎంఈ పార్కులది అదే పరిస్థితి కాగా ఇంతోఇంతో ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ రంగం కూడా ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో పడింది.
- కీలకమైన తాగునీటి పథకాల పరిస్థితి దారుణంగా ఉంది. వెలిగొండ ఆధారంగా రూ.1,210 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పథకం మూడేళ్లు అవుతున్నా టెండర్ల దశకు చేరకపోగా కేంద్ర భాగస్వామ్యంతో చేపట్టిన జలజీవన్ పనులు ముందుకు సాగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని 3.62లక్షల ఇళ్ళకు ఇంటింటికి కొళాయి ద్వారా జలజీవన్ నుంచి నీరివ్వాలన్నది లక్ష్యం. కాగా నాలుగున్నరేళ్ల గడుస్తున్నా ఇంకా లక్షన్నర కుటుంబాలకు కూడా పూర్తికాలేదు. కొత్తపట్నం మండలంలో రూ.55 కోట్లతో సూపర్ ఆర్వో ప్లాంట్‌కు రెండున్నరేళ్ల క్రితం సీఎం హామీ ఇచ్చినా ఇంతవరకు అతీగతి లేదు. వర్షాకాలం, వేసవికాలం తేడా లేకుండా జిల్లాలోని పశ్చిమప్రాంతంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ట్యాంకర్లతో సరఫరా తప్ప మరో మార్గం లేని గ్రామాల్లో ఇతర వనరులు కల్పన చేయకపోగా ట్యాంకర్ల సరఫరాను నిలిపేశారు. ప్రస్తుతం వంద గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజానీకం అల్లాడుతున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో పరిశీలిస్తే ఒంగోలు నగరంలో ప్రతిరోజు నీటిసరఫరా పేరుతో రూ.409 కోట్లతో తాగునీటి పథకం ఇస్తున్నట్లు 2021 అక్టోబరు 7న ఒంగోలు సభలో సీఎం ప్రకటించారు. అనంతరం దానిని రూ.339 కోట్లకు తగ్గించి మంజూరు చేయగా టెండర్లు పిలిచారు. టెండర్లు ఆమోదం కోసంసంబంధిత అధికారులు ప్రభుత్వానికి పంపినా పెండింగ్‌లో ఉంటడంతో పనులు ప్రారంభం కాలేదు వివిధ అర్బన్ స్థానిక సంస్థల్లో మంజూరైన పనులది అదే పరిస్థితి.
- ఉమ్మడి జిల్లాలోని కొత్తపట్నం, వాడరేవుల వద్ద ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటుకు మూడేళ్ల క్రితం ప్రకటించారు రూ.400 కోట్లతో కొత్తపట్నం, రూ.420 కోట్లతో వాడరేవుల వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన ఈ ప్రాజెక్టులకు అధికభాగం కేంద్రం, నాబార్డు నుంచి నిధులు వస్తాయి. రాష్ట్రప్రభుత్వం తగు చొరవ చూపక వాటి నిర్మాణాలు ప్రారంభమే కాలేదు.
- లెదర్ పార్కుల ఏర్పాటు, దర్శిలో డ్రైవింగ్ స్కూలు, మొగలిగుండాల రిజర్వాయర్, సంగమేశ్వర ప్రాజెక్టులు వంటి వాటి ఊసేలేకపోగా మార్కాపురం పర్యటన సందర్భంగా అక్కడ పలు పలు భవనాల నిర్మాణాలకు హామీ ఇచ్చినా ఆ పనులు ప్రారంభం కాలేదు. జడ్పీ నూతన భవన నిర్మాణానికి హామీ ఇచ్చినా దానిది అదే పరిస్థితి.
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక పలుశాఖల పరిధిలో బిల్లులు పేరుకపోయి పనులు చేసిన కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. కొన్ని పనులను ఆపేస్తున్నారు. భవనాలు, ఇతర పనులేకాక చివరకు తాగునీటి బిల్లులు సైతం ప్రభుత్వం ఇవ్వడం లేదు. వంద కోట్లకుపైగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న వివిధ భవనాల బిల్లులు పెండింగ్‌లో ఉండగా రూ.50 కోట్ల వరకు ఆర్‌డబ్ల్యూఎస్, మరో రూ.29 కోట్లు పట్టణ ప్రాంతాల్లో నీటి సరఫరా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.
- సీఎం హోదాలో జగన్ 11వసారి శుక్రవారం జిల్లాకు వస్తున్నారు. ఒంగోలు నగరపరిధిలోని పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ పేరుతో వస్తున్నారు. ముఖ్యమంత్రిగా తొలిసారి 2019 నవంబరు 14న ఒంగోలులో మన బడి, నాడు-నేడు పథకాన్ని ప్రారంభించారు. 2020 ఫిబ్రవరి 20న వెలిగొండకు రాగా 2021 అక్టోబరు 7న ఆసరా పథకం ప్రారంభోత్సవానికి ఒంగోలు, 2022 ఏప్రిల్ 22న సున్నా వడ్డీ విడుదలకు ఒంగోలు వచ్చారు. 2023 ఏప్రిల్ 12న మార్కాపురంలో ఈబీసీ నేస్తం ప్రారంభానికి రాగా మిగిలిన ఐదుసార్లు అధికారపార్టీకి చెందిన నేతల వ్యక్తిగత లేదా కుటుంబకార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చారు .

మహిళా టీచర్ల ఆకలికేకలు

- ఆరు నెలలుగా జీతాలు లేని వైనం
- ట్రెజరీలో జీతాల పీటముడి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 22: జిల్లాలో కొందరు మహిళా ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారి ఆకలికేకలు మిన్నంటుతున్నాయి. గత ఆరు నెలల నుంచి వీరి జీతాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణ గగనమై ఇబ్బందిపడుతున్నారు. అందిన సమాచారం మేరకు 12 మంది టీచర్ల జీతాలు నిలిచిపోయాయి. వీరితోపాటు బదిలీ ఉత్తర్వులు పొందిన కొందరు టీచర్లకు జీతాలు చెల్లిస్తున్న ట్రెజరీ అధికారులు వీరి జీతాల చెల్లింపులో కొర్రీల మీద కొర్రీలు వేస్తూ జీతాల చెల్లింపు విషయాన్ని మరింత జటిలం చేశారు. జీతాల చెల్లింపులో పడ్డ పీటముడి వీడటం లేదు. జీతాల చెల్లింపు కోసం జిల్లా విద్యాశాఖాధికారి, కలెక్టర్ ఇక్కడి ఖజానా అధికారులకు లేఖ రాసినా స్పందించడం లేదు. దూరప్రాంతాలకు బదిలీ అయిన ఈ టీచర్లు అనారోగ్యం, కుటుంబసభ్యులకు సమస్యల నేపథ్యంలో ప్రభుత్వం ద్వారా ఉత్తర్వులు పొంది నగర చుట్టుపక్కల మండలాలకు వచ్చారు. అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. జీతాల చెల్లింపులో ఎదురైన సమస్యలతో వారి కష్టాలు మొదలయ్యాయి. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వీరి జీతాలు కోసం ఖజానా శాఖ అధికారులతో సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది.



మిగతా ఒకే.. ఆ 12మందికే కొర్రీ

జిల్లాలో గతేడాది జూన్‌లో ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో దూర ప్రాంతాలకు బదిలీ అయిన కొందరు టీచర్లు ఖాళీగా ఉన్న దగ్గరి స్థానాలకు బదిలీ కోసం ప్రభుత్వంతో సంప్రందించారు. ప్రజాప్రతినిధుల సిఫార్సులతో వీరికి దగ్గరి స్థానాలకు బదిలీ అయింది. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టెలిఫోనిక్ ఉత్తర్వులతో వాట్సప్‌కు పార్వార్డ్ అయిన టీచర్లు ఖాళీలకు అనుగుణంగా డీఈఓ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుని పేరుతో ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం, బదిలీ కోరుకుంటున్న స్థానం పేరుతో డీఈఓకు వచ్చిన ఎక్సెస్ షీట్ ప్రకారం బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. మొదటి జాబితాలో సుమారు 30పేర్లు రాగా వీరికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. వారికి ఎటువంటి సమస్య లేదు. వారందరికి యథావిధిగానే జీతాలు చెల్లిస్తున్నారు. రెండో జాబితాలో 83 మంది టీచర్లు పేర్లు వచ్చాయి. వీరిలో నలుగురి పేర్లు రిపీట్ కాగా ముగ్గురు ఇతర జిల్లాల వారు ఉ న్నారు. ఈ జాబితాలో జిల్లాకు చెందిన వారు నిఖరంగా 76 మంది ఉన్నారు. వీరిలో 45 మందికి వారు కోరుకున్న స్థానాలకు డీఈఓ బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు మిగిలిన 31 మంది టీచర్లకు వారు కోరుకున్న స్థానాలు ఖాళీ లేకపోవడంతో బదిలీ ఉత్తర్వులు ఇవ్వలేదు. బదిలీ ఉత్తర్వులు పొందిన 45 మందిలో 12 మందికి అసలు జీతాలు చెల్లించకపోగా ఇద్దరికి మాత్రం రెండు నెలల జీతాలు ఇచ్చిన వారికి కూడా నిలిపివేశారు. మిగిలిన వారికి మాత్రం జీతాలు చెల్లిస్తున్నారు.

డైరెక్టర్ కార్యాలయం చెప్పినా..

ఆయా టీచర్లకు జీతాలు చెల్లించే విషయంలో ఖజానాధికారులు కొర్రీలు వేస్తూ సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. మొదట డీఈఓ ఒక లేఖ ఇస్తే జీతాలు చెల్లిస్తామని చెప్పారు. ఆ మేరకు డీఈఓ బదిలీ ఉత్తర్వులు జారీచేసిన 45 మంది టీచర్ల పేరుతో ఖజానాధికారికి లేఖ రాశారు. వీరికి జీతాలు చెల్లించాలని ఆ లేఖలో కోరారు. కలెక్టర్ కూడా ఈ 12మందికి జీతాలు చెల్లించాల్సిందే అంటూ నోట్ ఆర్డర్ జారీచేశారు. కలెక్టర్ చెబితే జీతాలు ఇస్తామన్న ఖజానాధికారులు ఆయన మాటను కూడా పట్టించుకోలేదు. జీతాలు చెల్లించమని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా జిల్లా ఖజానాధికారికి లేఖ రాసినా పట్టించుకోలేదు. ఖజానా శాఖ డైరెక్టర్ కార్యాలయంలో కూడా ఈ జీతాల చెల్లింపుపై వివరణ ఇచ్చింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగు నిర్ణయం తీసుకోమని ఇక్కడి అధికారులను ఖజానా డైరెక్టర్ కార్యాలయం ఆదేశించింది. తీరా చివరకు డైరెక్టర్ కార్యాలయం నుంచి తమకు స్పష్టమైన ఉత్తర్వులు ఇస్తేనే జీతాలు చెల్లిస్తామని మెలిక పెడుతుండటం గమనార్హం.

అప్పులతో పోషణ

ఆరు నెలల నుంచి జీతాలు రాని టీచర్లు లబోదిబోమంటున్నారు. అప్పులు చేసి కుటుంబ పోషణ చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. గత ఐదు నెలలుగా బ్యాంకు బాకీలకు నెలసరి వాయిదాలు నిలిచిపోవడంతో చివరకు బ్యాంకు రుణాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని జీతాలు వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయులు వేడుకుంటున్నారు

సమయం లేదు.. సైనికుల్లా పనిచేయండి

టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర దిశానిర్దేశం

కనిగిరి, ఫిబ్రవరి 22 : ఎన్నికలు సమీపిస్తున్నాయి.. సమయం లేదు.. సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం టీడీపీ పట్టణ అధ్యక్షులు, నాయకులు, బూత్ కన్వీనర్‌లు, బూత్ ఇన్ చార్జిలతో డాక్టర్ ఉగ్ర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ ఎన్నికలకు ఇంకా 50 రోజుల గడువు మాత్రమే ఉందని అందరూ సమాయత్తం కావాలన్నారు. కీలకమైన ఈ సమయంలో కనిగిరి పట్టణంలోని ప్రతి వార్డులోనూ వార్డు నాయకులు పార్టీ కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు వేసే ఎత్తుగడలను ముందుగానే పసిగట్టి వాటిని తిప్పికొట్టాలన్నారు. ప్రతి రోజూ ఒక్కో వీధిని ఎంచుకుని ఓటర్లను నేరుగా కలసి తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావడం ఎంత ముఖ్యమో తెలియ చేయాలన్నారు. అదే సమయంలో కనిగిరి అభివృద్ధి కోసం పార్టీ తీసుకున్న లక్ష్యాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. కనిగిరి ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, భావితరాల బంగారు భవిష్యత్ కోసం.. తాను ఉపాధి కల్పన కోసం తీసుకుంటున్న చర్యలను తెలియజేయాలన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం, రవాణా సౌకర్యం వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మంచి నీటి సరఫరా, నీటి ఎద్దడి నివారణ కోసం తీసుకోనున్న చర్యలను ప్రజలకు జాగ్రత్తగా తెలియజే యాలన్నారు. కార్యక్రమాలను శుక్రవారం నుంచి ప్రారంభించాలని ఉగ్ర సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు, తమ్మినేని శ్రీనివాసులు రెడ్డి, ఫిరోజ్‌తో పాటు 20 వార్డుల అధ్యక్షులు, బూత్ కన్వీనర్‌లు, శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

వైసీపీ దిగజారుడు రాజకీయం

- చంద్రబాబునాయుడి మాటలతో ఫేక్ ఐవీఆర్ఎస్
- విషయం తెలుసుకొని కుదుటపడ్డ తమ్ముళ్లు

పొదిలి, ఫిబ్రవరి 22: రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఎదురుదెబ్బలు తప్పవని ఆ పార్టీ నిర్ధయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే మరింత దిగజారుడు రాజకీయానికి తెరతీసింది. చంద్రబాబునాయుడు మాట్లాడినట్లు ఫేక్ వాయిస్‌తో ఐవీఆర్ఎస్ సర్వే అంటూ టీడీపీ నాయకులకు వాయిస్ మేసెజ్‌లు పంపింది. మార్కాపురం టీడీపీ అభ్యర్థిపై వ్యక్తిగత అభిప్రాయం సేకరిస్తున్నట్లు గురువారం బాబు వాయిస్‌తో టీడీపీ నాయకులకు ఫోన్‌కాల్స్ వచ్చాయి. దీంతో నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు కొంతసేపు ఆందోళనకు గురయ్యారు. టీడీపీ అభ్యర్థిగా చింతలచెరువు సత్యనారాయణపై మీ అభిప్రాయం తెలియజేయడంటూ వచ్చాయి. ఆ అభిప్రాయాన్ని ఒకటి నొక్కడం ద్వారా బలపరచాల్సిందిగా ఫోన్ సందేశం వచ్చింది. నోటా అయితే రెండు నొక్కండి అనే వాయిస్ వచ్చింది. దీంతో ఒక్కసారిగా టీడీపీ శ్రేణులు ఉలిక్కిపడ్డాయి. ఆ తరువాత కొంతసేపటికి అవి ఫేక్‌కాల్స్ అని స్పష్టమైంది. వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని జిల్లా ముస్లీం మైనారిటీ నాయకులు రసూల్, జిల్లా టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి గౌస్ తదితర టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనాన్ని తట్టుకోలేక ఇలాంటి చిల్లర పనులకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు.

‘గుండ్లకమ్మ’లో ఇసుక తవ్వకాలు

- రిజర్వాయర్‌లో నీరు లేకపోవటంతో మరింత సులువుగా మారిన వైనం
- మణికేశ్వరం వద్ద నాడు అడ్డగింత.. నేడు మిన్నకుండటంపై విమర్శలు



నీరు లేక ఖాళీగా ఉన్న రిజర్వాయర్

అద్దంకి, ఫిబ్రవరి 22: ఇసుకాసురుల కన్ను ఇప్పుడు ఏకంగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌పై పడింది. ఇప్పటివరకు గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాలలో మాత్రమే ఇసుక తవ్వకాలు జరిగాయి. గత రెండు మూడు రోజులుగా ఏకంగా గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోనే చేస్తున్నారు. అద్దంకి మండలం మణికేశ్వరం, కొరిశపాడు మండలం అనమనమూరు మధ్య గత ఏడాది డ్రెడ్జర్‌ల ద్వారా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. అప్పట్లో మణికేశ్వరం, అనమనమూరు గ్రామాల వైసీపీ నేతల ఒత్తిడితో ఏఎంసీ మాజీ చైర్మన్, అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోదరుడు భద్రారెడ్డి ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. వైవీ సుబ్బారెడ్డి ద్వారా జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఇసుక తవ్వకాలు నిలిపి వేయించారు. దీంతో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అయితే, గత రెండు రోజులుగా అదే ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌ల ద్వారా ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. ట్రాక్టర్‌లు నేరుగా రిజర్వాయర్ లోపలకు వెళ్లి ఇసుక లోడింగ్ చేసుకునేందుకు వీలుగా కొత్తగా రోడ్డు కూడా ఏర్పాటుచేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ ఎక్కువగా లేకపోవటంతో ఇసుక తవ్వకాలకు మరింత అవకాశం ఏర్పడింది. అయితే, గతంలో ఇసుక తవ్వకాలను వ్యతిరేకించి అడ్డుకున్న రెండు గ్రామాల వైసీపీ నేతలు ప్రస్తుతం మిన్నకుండటం విమర్శలకు తావిస్తుంది. అదేసమయంలో అప్పట్లో స్వయంగా రంగంలోకి దిగిన వైవీ సోదరులు కూడా ఇప్పుడు దృష్టి పెట్టకపోవటం కూడా విమర్శలకు తావిస్తుంది.



గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో మణికేశ్వరం వద్ద ఇసుక తవ్వకాలతో ఏర్పడ్డ గోతులు



గుండ్లకమ్మ రిజర్వాయర్ లోపలకు వెళ్ళేందుకు వీలుగా రోడ్డు ఏర్పాటుకు ట్రాక్టర్‌తో తీసుకు వస్తున్న గ్రావెల్

అద్దంకి ప్రాంతంలో గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి రీచ్ లేదని ఇటీవల మైనింగ్ అధికారులు వాహనాలు సీజ్ చేసినప్పటికి ఏకంగా రిజర్వాయర్ పరిధి లో ఇసుక తవ్వకాలు చేపట్టడం పలువురు ని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఎక్స్‌కవేటర్‌లతో ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో భవిష్యత్‌లో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రిజర్వాయర్ పరిధిలో ఇసుక తవ్వకాలు నిలిపివేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎన్నికల అధికారి

ఇంకొల్లు, ఫిబ్రవరి 22: ఇంకొల్లు మండలం పరిధిలోని 54 పోలింగ్ బూత్‌లను గురువారం పర్చూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి కావేటి వెంకటేశ్వర్లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, భద్రత, తదితర అంశాలను పరిశీలించారు. కొన్నిచోట్ల విద్యుత్‌దీపాలు, ర్యాంపులు తదితర సౌకర్యాలు లేనివి గుర్తించి తక్షణమే ఏర్పాట్లుచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీఎల్వోల నుంచి పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, డీటీ గీత, ఏఎస్‌వో పుష్పలత, సుధీర్, వీఆర్వోలు సురేష్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

25న ‘ప్రబంధ యుగకర్త ఎర్రా ప్రగడ’ గ్రంథావిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు, మహాకవి ఎర్రన వంశీయులు చదలవాడ లక్ష్మీనరసింహారావు పరిశోధానత్మక దృష్టితో శ్రమించి రచించిన ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ గ్రంథావిష్కరణ ఈనెల 25వతేదీన ఒంగోలులోటని బ్రాహ్మణ సేవా సమితి కమ్యూనిటి హాలులో నిర్వహిస్తున్నట్లు పరిషత్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాగంటి శ్రీరామమూర్తి, పింగళి పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బ్రిటానియా కంపెనీ రిటైర్డ్ అధికారి చదలవాడ బాబా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ ఎండీ జీవీ.సుబ్బారెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని, డాక్టర్ కడిమళ్ల వరప్రసాద్ సమీక్షకులుగా వ్యవహరిస్తారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వైసీపీ నేతల బరితెగింపు

- అడ్డగోలుగా గ్రావెల్ మట్టి తరలింపు
- అనుమతులు లేకుండా ప్రభుత్వ, అటవీ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు
- మండల పరిషత్ ద్వారా గామాల్లో మట్టి రోడ్లకు నిదులు
- పట్టించుకోని అధికారులు

బల్లికురవ, ఫిబ్రవరి 22: బల్లికురవ మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నేతలు జోరుగా మట్టి, గ్రావెల్ తవ్వకాలను చేపడుతున్నారు. అధికారులు మాత్రం ఇవేమి తమకు కనిపించవు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూములతో పాటు అటవీ భూములలో కూడా అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా యంత్రాలను ఏర్పాటుచేసి తవ్వకాలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో కొందరు వైసీపీ చోట నేతలు మట్టి రోడ్లపై దృష్టి పెట్టారు. సుదూరం నుండి మట్టి తెచ్చి రోడ్లు వేసిన్నట్లు రికార్డు చేసి పెద్ద మొత్తంలో బిల్లులు మార్చుకుంటున్నట్లు ఆరోపణలు వినిసిస్తున్నాయి.

బల్లికురవ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ద్వారా ఇటీవల పలు గ్రామాల్లో ఉన్న వైసీపీ నేతలకు సుమారు కోటి రూపాయల పైబడి గ్రామాలలో మట్టి రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. ఒక్కో నేతకు రూ.అయిదు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వర్కులు పెట్టారు. మట్టి రోడ్ల ఏర్పాటుకు అనుమతులు ఉన్నచోట నుంచి గ్రావెల్, మట్టి కొనుగోలు చేసి రోడ్లు వేయాల్సి ఉంది. అయితే, సీనరేజ్ కట్టకుండానే కొందరు వైసీపీ నేతలు గ్రామాల్లోనే అందుబాటులో ఉన్న ప్రభుత్వ, అటవీ భూముల నుంచి గ్రావెల్, మట్టి తవ్వకాలు చేపట్టి రోడ్లు వేస్తున్నారు. రోడ్లకు వేస్తున్న గ్రావెల్ మాత్రం మూడు కిలోమీటర్ల పైబడి నుంచి తీసుకువచ్చినట్టు రికార్డు చేయిస్తున్నారు. గ్రావెల్‌కు కూడా సీనరేజ్ కట్టినట్లు నమోదు చేయిస్తున్నారు. గ్రామాల్లో ఉన్న కొండలు గుట్టలలో ఉన్న మట్టిని సైతం వదలకుండా తవ్వకాలు చేస్తుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని సూరేపల్లి, కొణిదెన, గంగపాలెం, గొర్రెపాడు, మక్తేశ్వరం, చెన్నుపల్లి, సజ్జాపురం, కూకట్లపల్లి, రామాంజనేయపురం, గుంటుపల్లి, వల్లాపల్లి, వైదన, కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు, వెలమవారిపాలెం, తదితర గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ, అటవీ భూముల ద్వారా గ్రావెల్, మట్టి తవ్వకాలు పెద్ద ఎత్తున తవ్వుతున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన సీనరేజ్ ఆదాయం పెద్దమొత్తంలో పోతుందని ప్రజలు వాపోతున్నారు. గ్రామాలలో వేస్తున్న రోడ్లకు కూడా నాసిరకం మట్టిని తోలుతున్నారని, అధికారులు కూడా సరిగా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎన్నికలు దగ్గర పడుతుండటంతో వేగంగా రోడ్లు ఏర్పాటుచేసి నిధులు డ్రా చేసుకొనేందుకు నేతలు తహతహలాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల వెంటనే గ్రామాలలో జరుగుతున్న మట్టి రోడ్ల పనులను పరిశీలించి సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కొప్పెరపాలెం పరిదిలో ఉన్న ఫారెస్టు కొండ భూమిలో గ్రావెల్ తవ్వకాలు



సూరేపల్లి చెరువులో అనుమతులు లేకుండా జరుగుతున్న మట్టి తవ్వకాలు

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 22: జిల్లాలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఒంగోలులో డీఈవో సుభద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్‌కు ప్రత్యేకంగా మేళాలు నిర్వహించాలని, తెలుగు, హిందీ ఉద్యోగోన్నతులు పొంది స్థానాలు కేటాయించకుండా హైస్కూళ్లలో పనిచేస్తున్న వారికి నోషనల్ పీరియడ్‌గా పరిగణించి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నందున వారికి టెన్త్ స్పాట్ వాల్యువేషన్ నుంచి మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎర్రయ్య జి.నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : అగ్నికుల క్షత్రియ కులంపై కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణలు చెప్పాలని అగ్నికుల క్షత్రియ మత్స్యకార సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కొండబాబుపై ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి అత్యంత దారుణంగా కులం పేరుతో తిట్టడం దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్రంలో 40 లక్షలకు పైగా అగ్నికుల క్షత్రియ మత్స్యకార ఓటర్లు ఉన్నారని, వారి మనోభావాలు దెబ్బతీన విధంగా మాట్లాడటం దారుణంగా ఉందన్నారు. ద్వారంపూడి క్షమాపణలు చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసి అన్ని నియోజకవర్గంలో మత్స్యకార ఓటర్లను చీలుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వీనర్ నాయుడు గోపాల్, దమ్ము శ్రీను, రాసాని కృష్ణ, అవనిగడ్డ బాలకృష్ణ, సింగోతు గోవిందు, తంబు ఏడుకొండలు, కొక్కిలిగడ్డ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని రిజిస్ట్రార్ హరిబాబు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో గురువారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మానవాళి మనుగడను కాపాడేందుకు తప్పకుండా మొక్కలు నాటాలని కోరారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త హర్షప్రీతం దేవ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెరగడం వల్ల అనేక అనార్థాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలి

ఒంగోలునగరం, ఫిబ్రవరి 22: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల్లో ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. స్థానిక ఎల్బీజి భవన్‌లో ఏపీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ ఒంగోలు అర్బన్ ప్రాజెక్టు మహాసభలో ఆ యన మాట్లాడారు. ఈ సభల్లో రమేష్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్ నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో నామమాత్రంగా కేటాయింపులు చేస్తూ అంగన్వాడీ, ఆశ, మిడ్‌డే మీల్స్ పథకాల్లో ఎక్కువగా పని చేస్తున్న మహిళలకు గౌరవ వేతనం పేరుతో కనీస వేతనాలను అమలు చేయ టం లేదన్నారు. కనీస వేతనాలను అమలు చేయకుండా మహిలలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల్లో పని చేస్తున్న మహిళలకు కనీస వేతనాలను అమలుచేయాలని కోరుతూ పోరాటాలను ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమయిందన్నారు. అంగన్వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్వాడీలు తమ డిమాండ్ల కోసం 42 రోజుల పాటు చేసిన సమ్మె కారణంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలకు సంబంధించిన మినిట్స్ కాపీలను జీవో రూపంలో ఇవ్వాలని కోరారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాల ను వెంటనే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వీటి అమలుకోసం మరో పోరాటానికి సిద్ధంగా కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు సిహెచ్‌జ్యోతి, కేవీ సుబ్బమ్మ, పద్మ, సంధ్యారాణి అధ్యక్షత వర్గంగా వ్యవహరించారు. ఈ మహాస భల్లో మాజీ జిల్లా కార్యదర్శి ప్రశాంతికుమారి, శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు పి. కల్పన, సీఐటీయూ ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రాంబాబు, టి. మహేష్, దామా శ్రీనివాసులు, కొత్తపట్నం మండల కార్యదర్శి స్వామిరెడ్డి, యూనియన్ నాయకులు శ్రీదేవి, శోభారాణి, మహాలక్ష్మి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాంఅజాద్‌కు నివాళులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలనా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా గురువారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య ఆజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సంపూర్ణమ్మ, ఎస్.అనిల్, స్మైలి పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం తప్పదు!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఫిబ్రవరి 22: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం మార్టూరు క్లస్టర్ వన్ నాయకులు, కార్యకర్తలు, పేజీ నేస్తంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ గెలుపు పర్చూరు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలని, కార్యకర్తలందరూ పోరాట పటిమతో పని చేయాలని పిలుపు నిచ్చారు. అధికార పార్టీ నాయకులు గెలుపు కోసం టీడీపీ నాయకుల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేవిధంగా కుట్రలు చేస్తున్నారని చెప్పారు. వాటికి భయపడకుండా వారి కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. వైసీపీకి ఓట్లు వేయరని భావించిన టీడీపీ ఓట్లను తొలగించాలని ప్రయత్నిస్తున్నారని, వారి వ్యూహానికి అడ్డుకట్ట వేయాలని ఏలూరి పిలుపునిచ్చారు. దుర్మార్గుడైన ఒక వ్యక్తి స్వార్థానికి రాష్ట్రం సర్వనాశనమవుతున్న విషయాన్ని ప్రజలకు చెప్పేందుకు ప్రతి కార్యకర్త ముందుండాలన్నారు. ప్రతి ఓటును పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్న అధికార పార్టీ నాయకులకు గుణపాఠం చెప్పే సమయం వచ్చిందన్నారు. పర్చూరు నియోజకవర్గంలో మూడు తరాలు వారికి టీడీపీ గెలుపు గుర్తుండాలన్నారు. మన గెలుపు ద్వారా రాష్ట్ర చరిత్రలో తెలుగు దేశం పార్టీ నూతన అధ్యాయానికి నాంది పలకాలన్నారు.

ఓట్లను తొలగించాలనుకున్న వారికి సహాయ సహకారాలు అందించిన అధికారులు బలయ్యారన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్ర చరిత్రను మార్చగలవన్నారు. భావితరాలు వారు అభివృద్ధిలో పయనిస్తున్న ఆంధ్రప్రదేశ్‌ను చూడాలంటే చంద్రబాబు ముఖ్య మంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. ప్రజల ఆకాంక్ష, ఆశ, భవిష్యత్తు, బతుకు దెరువు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే నెరవేరుతాయని అందరూ భావిస్తున్నారని ఎమ్మెల్యే సాంబశివరావు పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 22: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపెటీలో జరిగిన వలంటీర్ల వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సక్రమంగా సేవలు అందించినప్పుడే వలంటీర్ వ్యవస్థకు పూర్తిస్థాయిలో గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లకు పశంసాత్రం, మెడల్స్ ఇచ్చి సత్కరించారు.

స్థానిక జవహర్‌నగర్‌లో శ్రీజానకీ రామాంజనేయ స్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన పాలరాతి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవంలో వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే, వేటపాలెంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన వలంటీర్ల వందనం కార్యక్రమంలో పాలప్గొన్నారు. వలంటీర్లకు పతకాలు, ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రూతమ్మ, ఏవో కాశీవిశ్వనాధ్, సర్పంచ్ కందేటి అరుణ, నాయకులు బొడ్డు సుబ్బారావు, పల్లపోలు శ్రీనివాసరావు, దంతం మంతు, ఆవుల అశోక్, అందె కృష్ణ, కట్టా గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి, డీఎస్సీ, టెట్ పరీక్షలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయా పరీక్షల నిర్వహణపై తాడేపల్లి నుంచి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్ గౌర్, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాష్‌లు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం స్థానిక అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆయా అంశాలపై సమీక్షించారు. మార్చి 1నుంచి 20వతేదీ వరకు ఇంటర్, మార్చి 18నుంచి 30తేదీ వరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో డీఎస్సీ, టెట్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిటింగ్‌తో పాటు లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్లతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తుతో పాటు పరీక్షలు జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లు మూయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌తో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధమని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మాల్‌ప్రాక్టిస్‌కు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీఈవో సుభద్ర, ఆర్ఐవో సైమన్‌విక్టర్, ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 22 : జిల్లాలో గ్యాస్ వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ రవాణా చార్జీల పేరుతో డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఏజెన్సీ షోరూం నుంచి వినియోగదారుని ఇంటి వరకు 15 కిలోమీటర్ల లోపు దూరం ఉంటే ఎటువంటి రుసుం డెలివరీ బాయ్స్‌కు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ నిబంధనలు గ్రామీణ, పట్టణ, సెమీఅర్బన్ అన్ని ప్రాంతాలకు, అన్ని గ్యాస్ ఏజెన్సీలకు వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

నిబంధనలు అతిక్రమించిన ఏజెన్సీలపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. వినియోగదారులు కూడా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలపై అవగాహన పెంచుకొని సేవలు పొందాలన్నారు. ఎవరైనా డెలివరీ బాయ్స్ అసలు ధర కన్నా అధికంగా వసూలు చేస్తూ 8008301512 సెల్ నెంబరులో ఫిర్యాదు చేయాలని ఆయన వినియోగదారులను కోరారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కావూరివారిపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 22: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రాత్రి కావూరివారిపాలెం గ్రామస్థులకు నేర నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఓటర్లు వారి హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చునని చెప్పారు. అలాగే, ఈపూరుపాలెం సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని పలువురికి చలానాలు విధించారు. నలుగురు మద్యం బాబులపై కేసులు నమోదు చేశారు.

రైతు మృతికి కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలి

మార్టూరు, ఫిబ్రవరి 22: ఢిల్లీ సరిహద్దులో మద్దతు ధరకు చట్టబద్ధత కల్పనకు కేంద్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని కోరుతూ బుధవారం ధర్నా చేస్తున్న రైతులపై పోలీసులు చేసిన దాడిలో చనిపోయిన యువ రైతు హర్భజన్ సింగ్ మృతికి కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని మండల రైతు సంఘం కమిటీ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా గురువారం సాయంత్రం మార్టూరు సెంటర్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, పేర్ని నాగేశ్వరరావు, శేషాద్రి, రాంబాబు, వీరవల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కలిగిఉండాలి

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 22: హెచ్‌ఐవీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలంటూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో నాటకం ద్వారా ప్రదర్శన నిర్వహించారు. గురువారం సాయంత్రం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో ప్రధాన సెంటరులో కళాజాతర నాట్య మండలి రత్నరాజు ఆధ్వర్యంలో ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఈవ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి గాలి స్వరూప్ కుమార్, లింక్ వర్కరు జి.నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంక్షేమసేన నియోజకవర్గ అధ్యక్షుడిగా సందీప్ తేజ

పర్చూరు, ఫిబ్రవరి 22: కాపు సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా కారంపూడి సందీప్ తేజ నియమితులయ్యారు. కాపు సంక్షేమ ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం మేరకు బాపట్ల జిల్లా అధ్యక్షుడు తరణి గోపాలకృష్ణ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఉపాధ్యక్షులుగా నారిశెట్టి రవితేజ, అనిశెట్టి నరేంద్రకుమార్, తెలగనేని వెంకటేష్‌లు నియమితులయ్యారు. జనరల్ సెక్రటరీగా తోట మణికుమార్ నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నియామక పత్రాలను అందజేసినట్లు జనసేనులు తెలిపారు. జనసేన, తెలుగుదేశం సంయుక్త ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సందీప్ తేజ తెలిపారు.

యువతను చైతన్యవంతం చేయాలి

చీరాల, ఫిబ్రవరి 22: తొలిసారి ఓటు అర్హత పొందిన యువతను చైతన్యవంతం చేసి మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అనే నినాదంతో శ్రేణులు ముందుకు సాగాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరీ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ లీడర్స్, వారియర్స్ సమావేశం జరిగింది. నియోజకవర్గం నుంచి గౌరీ అమర్‌నాథ్, లావేటి శ్రీనివాసతేజ, వెంగళ భరత్‌లను యువత నాయకులుగా నియమించారు. వారియర్స్‌గా కర్పూరపు సుబ్బలక్ష్మీ, పర్వాణ షేక్, నిన్నకోట జగదీష్, అవ్వారు తారక్, వెలిది అమర్, నాసిక ఆనంద్‌లను నియమించారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ యువత ప్రతినిధి మొవ్వ శరత్‌చంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ కుస్తీ పోటీలకు అద్దంకి యువకుడు ఎంపిక



కట్టా దినేష్‌ను అభినందిస్తున్న కాకాని రాధాకృష్ణమూర్తి

అద్దంకి, ఫిబ్రవరి 22: జాతీయ కుస్తీ పోటీలకు అద్దంకి పట్టణంలోని నంబూరిపాలెంకు చెందిన యువకుడు కట్టా దినేష్ ఎంపికయ్యాడు. ఈనెల 28న పంజాబ్‌లో జరిగే పోటీలలో పాల్గొననున్నాడు. పంజాబ్‌కు వెళ్ళేందుకు అవసరమైన ఖర్చులకు వైసీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి రూ.5 వేలు అందజేశారు. దినేష్‌ను అభినందించారు.

గ్రామీణ ప్రాంతాలలో శుద్ధజలం అందించటమే ధ్యేయం

అద్దంకి, ఫిబ్రవరి 22: గ్రామీణ ప్రాంతాలలో శుద్ధ జలం అందించటమే ధ్యేయమని సింక్రోని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వెంకట్ అన్నారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం లో అసిస్ట్, సింక్రోణి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్ట్ ప్రతినిధి డేవిడ్, ఎన్టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రత్తయ్య తదితరులు పాల్గొన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే రవికుమార్, అసిస్ట్, సింక్రోణి ప్రతినిధులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

దళిత మహాసభను జయప్రదం చేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 22: గుంటూరులో మార్చి 2న జరిగే దళిత మహాసభను జయప్రదం చేయాలని పలువురు దళిత నాయకులు పేర్కొన్నారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కత్తి పద్మారావు రచించిన దేశం మాదే పుస్తకావిష్కరణ, మహాసభ జరుగనుంది. ఈక్రమంలో సంబంధిత కరపత్రాన్ని గురువారం మండల పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దుడ్డు భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామి, గొర్రెపాటి రవికుమార్, సుందరరావు, దేవదానం, రవి, మార్క్, చౌదరి, నాగభూషణం, శ్రీను, సురేష్, ముసలయ్య, లక్ష్మయ్య, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన గ్రామీణ విద్యార్థిని



అవార్డు అందుకుంటున్న రాజరాజేశ్వరి

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 22: కారంచేడు మండల పరిధిలోని రంగప్పనాయుడువారిపాలెం గ్రామానికి చెందిన రావెల్ల వీరరాఘవయ్య, శ్రీదేవి దంపతుల కుమార్తె రావెల్ల రాజరాజేశ్వరికి సెంట్రల్ గవర్న మెంట్ నేషనల్ అవార్డు(అలెగ్జాండర్ గ్రహంబెల్ అవార్డు)ను సొంతం చేసుకుంది. చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్‌ను పూర్తిచేసిన రాజరాజేశ్వరి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలో అత్యధిక ప్రతిభను కన పరిచి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈనెల 21న న్యూఢిల్లీలో రోడ్డు అండ్ హైవేస్ మినిష్టర్ నితిన్ గట్కరీ చేతుల మీదుగా రాజరాజేశ్వరి అందుకున్నారు. బెంగుళూరులో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్‌లో పూర్తిస్థాయి శిక్షణ పొందినట్టు చెప్పారు. అవార్డు తనకు దక్కటం అదృష్టంగా భావిస్తున్నానని రాజరాజేశ్వరి తెలిపారు. గ్రామీణ విద్యార్థినికి దేశస్థాయిలో అవార్డు రావటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అద్దంకి, ఫిబ్రవరి 22: అద్దంకి పట్టణం సమీపంలోని నల్లవాగులో గుర్తుతెలియని మృతదేహం కుళ్లిపోయి ఉంది. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి-మేదరమెట్ల రోడ్డుకు తూర్పువైపున నల్లవాగులో గురువారం సాయంత్రం పురుషుడు మృతదేహం ఉన్నట్లు సమాచారం అందటంతో పరిశీలించారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఐదారు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి?

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 22: కారంచేడు మండల పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. విద్యను అందించాల్సిన ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించారని ఆగ్రహానికి గురైన గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. ఈ విషయం వెల్లడిస్తే తమ గ్రామానికి చెడ్డపేరు వస్తుందని స్థానికులు సమాచారం చెప్పేందుకు నిరాకరించారు. ఈవిషయంపై డిప్యూటీ ఈవో శ్రీనివాసరావును వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్టు తెలిపారు.

లక్షల మంది సామాన్యుల ఆవేదన కన్నా ఒక మేధావి మౌనం సమాజానికి చాలా ప్రమాదమని పెద్దలు చెబుతుంటారు. ఇసుక తవ్వకాలన్నీ అక్రమాలే అని సామాన్యులు గగ్గోలు పెడుతున్నా మేధావులైన అధికారులు మాత్రం మౌనం దాల్చుతున్నారు. జిల్లాలో విచ్చలవిడిగా, పర్యావరణ అనుమతులు లేకుండా పెన్నమ్మను కుళ్లబొడిచి దోచుకుంటుంటే ఉన్నతాధికారులు మాత్రం ఎక్కడా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు కనిపించడం లేదని ఏకంగా జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కు నివేదిక ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

తవ్వకాలే లేనప్పుడు

ఇసుక ఎక్కడిది సారూ!

తవ్వకాలు లేవని ఎన్‌జీటీకి కలెక్టర్ నివేదిక

- ఆపరేషన్‌లో లేని రీచ్‌లలో పరిశీలించి లేఖ
- మరి జిల్లాలో వాడుతున్న ఇసుక ఎక్కడిది!?
- ఇతర రాష్ట్రాలకు తరలుతున్నదీ ఏ రీచ్‌లోది?
- మినగల్లు, పల్లిపాడు, ముదివర్తి, పీకే పాడులలో జరుగుతున్నదేంటి!?
- జిల్లా ఉన్నతాధికారుల తీరుపై విస్మయం



అనంతసాగరం: పడమటి కంభంపాడు రీచ్‌లో ఇసుక తవ్వకాలు

నెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌జీటీ సదరన్ బెంచ్ ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు విరువూరు, అప్పారావుపాలెం ఇసుక రీచ్‌లను పరిశీలించారు. అయితే ఆ రీచ్‌లలో గతేడాది నుంచి తవ్వకాలు ఆగిపోయి ఉన్నాయి. ఈ విషయాన్ని ఎన్‌జీటీకి కలెక్టర్ నివేదించారు. కానీ తవ్వకాలు జరుగుతున్న పడమటి కంభంపాడు, మినగల్లు, ముదివర్తి, పల్లిపాడు రీచ్‌లవైపు మాత్రం అధికారులు కన్నెత్తి చూడలేదు. అసలు ఈ విషయాన్ని నివేదికలో పొందుపరచలేదు. అంటే ఉన్నతాధికారులే ఎన్‌జీటీకి తప్పుడు నివేదిక ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.

● యథేచ్ఛగా తవ్వకాలు

కలెక్టర్ నివేదిక కరెక్ట్ అనుకుంటే మరి జిల్లాలో వినియోగిస్తున్న ఇసుక అంతా ఎక్కడిదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అలానే నిత్యం వందల లారీల్లో చెన్నై, బెంగళూరులకు తరలుతున్న ఇసుక ఎక్కడి నుంచి తవ్వుతున్నారన్న మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. వీటికి సదరు ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి. నాలుగు ప్రధాన రీచ్‌లలో నిత్యం వేల టన్నుల ఇసుకను తవ్వి సొమ్ము చేసుకుంటున్నారన్నది బహిరంగ రహస్యం. మినగల్లు, పడమటికంభంపాడు, ముదివర్తి, పల్లిపాడు రీచ్‌లలో 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించగా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. మరి ఉన్నతాధికారులు ఎక్కడా ఇసుక తవ్వకాలు జరగలేదని నివేదిక ఎవ్వడం ఏమిటని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వంలోని కొందరు పెద్దల డైరెక్షన్‌లో ఉన్నతాధికారులు నడుస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్‌జీటీ ఆదేశాలను కూడా తుంగలో తొక్కి

ఆపరేషన్‌లోని లేని రీచ్‌లలో పరిశీలించి చేతులు దులుపుకున్నారని, ఈ రీచ్‌లలోనే పరిశీలన చేయాలని కూడా రాష్ట్రస్థాయి నుంచి ఆదేశాలు వచ్చినట్లు అధికారులు చెబుతుండడం గమనార్హం. రాష్ట్రస్థాయిలో తయారు చేసిన నివేదికనే అన్ని జిల్లాల కలెక్టర్లు ఎన్‌జీటీకు పంపారని కూడా ప్రచారం జరుగుతోంది. అన్ని జిల్లాల నివేదికలో ఒకే ఫార్మాట్‌లో ఉండడంపై ఎన్‌జీటీ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది.




మినగల్లు రీచ్‌లో ఇసుక కొనుగోలుకు గురువారం ఇచ్చిన బిల్లు

● ప్రతిమాకు అప్పగించినట్లు డైరెక్టర్ లేఖ

జిల్లాలో ఇసుక తవ్వకాల టెండర్‌ను ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థకు అప్పగించినట్లు గనుల శాఖ డైరెక్టర్ గత డిసెంబరు 22వ తేదీన జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపారు. డిసెంబరు 11 నుంచి జిల్లాలోని అన్ని రీచ్‌లలో ప్రతిమా సంస్థనే తవ్వకాలు జరుపుతుందని తెలియజేస్తూ అదే లేఖ కాపీను ఎస్పీకు కూడా పంపారు. అప్పటి నుంచి ఆ సంస్థ పేరు మీదనే మాన్యువల్ బిల్లులు జారీ చేస్తూ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ విషయం కలెక్టర్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులందరికీ తెలుసు. అయితే జిల్లాలో తవ్వకాలు జరుపుతున్న నాలుగు రీచ్‌లలో ఏ ఒక్క రీచ్‌కు కూడా పర్యావరణ అనుమతి (ఈసీ) లేదు. ఈసీ లేకుండా తవ్వకాలు జరపకూడదన్న నిబంధనలను తుంగలో తొక్కారు. భారీ యంత్రాలతో, భారీ గుంతలు పెడుతూ తవ్వకాలు చేస్తుండటంతో భూగర్భ జలాలకు ప్రమాదకరంగా మారింది. ఇంత బహిరంగంగా తవ్వకాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు మాత్రం అసలు తవ్వకాలే జరగడం లేదంటూ ఎన్‌జీటీకు నివేదిక ఇవ్వడం ప్రజల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

ఆదాల, ఆనం ఎవరు బెటర్!

● రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిపై 'ఐప్యాక్' ఆరా



నెల్లూరురూరల్, ఫిబ్రవరి 22 : నెల్లూరురూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిలలో ఎవరు బెటర్? వీరిలో ప్రజాదరణ ఎవరికి ఉంది? మీరు ఎవరికి మద్దతిస్తారు? అంటూ ఐ ప్యాక్ బృందం నెల్లూరురూరల్ మండలంలోని పలు గ్రామాలలో సర్వే నిర్వహించింది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు.. మంగళ, బుధవారాలలో నెల్లూరుకు పడమరనున్న గ్రామాలలో నలుగురు సభ్యులతో కూడిన ఐ ప్యాక్ బృందం పర్యటించింది. ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ నుంచి ఆదాల, ఆనంలలో ఎవరికి గెలిచే ఛాన్సు ఉంది. పార్టీపరంగా క్షేత్రస్థాయిలో వీరిద్దరిలో నాయకులు, కార్యకర్తలు ఎవరికి పని చేస్తారు? అన్న కోణంలో సర్వే నిర్వహించారు. అలాగే ఇటీవల వైసీపీని వీడి టీడీపీలోకి వెళ్లిన వారు తిరిగి సొంత గూటికి రావాలంటే ఎలా? వారి ఆదాయ వనరులు ఏమిటి? పోలీసుస్టేషన్లలో వారిపై కేసులు ఉన్నాయా!? తదితర అంశాలపై క్షుణ్ణంగా ఆరా తీసినట్లు సమాచారం.

టీడీపీలోకి రండి!

వీపీఆర్‌కు 'దేశం' ముఖ్యనేతల ఆహ్వానం

భారీగా తరలివచ్చి మద్దతు ● వేమిరెడ్డి సుముఖత



వీపీఆర్‌ను సత్కరించిన కోటంరెడ్డి, ఉచ్చి తదితరులు

నెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో చేరాలంటూ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులను ఉమ్మడి నెల్లూరు జిల్లా టీడీపీ ముఖ్యనేతలు ఆహ్వానించారు. అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ఇతర ప్రధాన నాయకులు గురువారం నెల్లూరులోని వీపీఆర్ నివాసానికి వెళ్లి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీపీఆర్ దంపతులను సన్మానించారు. అనంతరం వివిధ అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. టీడీపీలో చేరేందుకు వీపీఆర్ సముఖత వ్యక్తం చేసినట్లు భేటీ అనంతరం టీడీపీ నేతలు వెల్లడించారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పొంగూరు నారాయణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జులు పాశం సునీల్‌కుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల సుబ్రహ్మణ్యం, ముఖ్య నేతలు మాలేపాటి సుబ్బానాయుడు, కావ్య కృష్ణారెడ్డి, తాళ్లపాక రమేష్‌రెడ్డి, అనురాధ, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెడ్ శివప్రసాద్ తదితరులు వీపీఆర్‌ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి, నారాయణ, రవిచంద్ర, అజీజ్‌లు మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో హుందాగా వ్యవహరిస్తూ, పేదల సమస్యలను సొంత నిధులతో పరిష్కరించే వ్యక్తిత్వం కలిగిన వేమిరెడ్డిని టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించినట్లు వెల్లడించారు. వేమిరెడ్డి కూడా ఇందుకు సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. త్వరలోనే పార్టీలో చేరే అవకాశముందని వ్యాఖ్యానించారు.



వేమిరెడ్డితో సమావేశమైన టీడీపీ ముఖ్య నాయకులు

పెరుగుతున్న మద్దతు

వైసీపీ నుంచి బయటకొచ్చాక వీపీఆర్‌కు మద్దతు భారీగా పెరుగుతోంది. అనేక మంది వైసీపీ నాయకులు కూడా వీపీఆర్ వెంట నడిచేందుకు సిద్ధమవుతున్నారు. అటువంటి వారంతా వీపీఆర్ నివాసానికి తరలివస్తూ వీపీఆర్‌ను కలిసి మద్దతు ప్రకటిస్తున్నారు. అలానే టీడీపీ, జనసేన నేతలు కూడా భారీగా వీపీఆర్‌ను కలుస్తున్నారు. దీంతో వేమిరెడ్డి నివాసం మద్దతుదారులతో కిటకిటలాడుతోంది. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి భారీ సంఖ్యలో సిటీ నియోజకవర్గ నాయకులతో కలిసి వీపీఆర్‌ను కలిశారు. అన్ని డివిజన్ల నుంచి ముఖ్య నేతలందరూ జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకోగా అక్కడి నుంచి నడుచుకుంటూ వీపీఆర్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా వీపీఆర్‌ను ఘనంగా సత్కరించారు. ప్రతి డివిజన్ నాయకులను కోటంరెడ్డి వీపీఆర్‌కు పరిచయం చేశారు. అనంతరం కోటంరెడ్డి మాట్లాడుతూ నిస్వార్థ ప్రజా సేవకుడు వేమిరెడ్డి అని కొనియాడారు. అనేక మంది పేదలకు సాయం చేసిన గొప్ప వ్యక్తులు వీపీఆర్ దంపతులని చెప్పారు.

కాంగ్రెస్ నాయకుల గృహ నిర్బంధం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 22 : మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ గురువారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన చలో సెక్రటరేట్ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయవాడకు వెళ్లకుండా అర్ధరాత్రి తర్వాత పోలీసులు నోటీసులు ఇచ్చి అడ్డుకున్నారు. నెల్లూరులో డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డిని విజయవాడకు వెళ్లకుండా ఇంటిలో నిర్బంధించారు. దీంతో పోలీసులతో చేవూరు వాగ్వివాదానికి దిగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో మెగా డీఎస్సీని వేయాలని నిరసన తెలిపేందుకు వెళుతున్న షర్మిలను అరెస్టు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి విరుద్ధంగా రాజారెడ్డి ఫ్యాక్షన్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందాన్ని అనుభవిస్తున్న ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచి పోతారని విమర్శించారు.

సీన్ రివర్స్!

వీపీఆర్ రాజీనామాతో తిరగబడిన వైసీపీ పరిస్థితి



బండ్లు ఓడలు- ఓడలు బండ్లు అవుతాయన్న నానుడిని నెల్లూరు రాజకీయాలు నిజం చేస్తున్నాయి. పక్షం రోజుల వ్యవధిలోనే నెల్లూరు రాజకీయాలు తలకిందులయ్యాయి. టీడీపీ, వైసీపీ బలాబలాలు సమూలంగా మారిపోయాయి. కొద్ది రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ ఎదుర్కొన్న పరిస్థితులను ఇప్పుడు వైసీపీ అనుభవిస్తోంది. వైసీపీకి వీపీఆర్ రాజీనామా చేయడంతో నెల్లూరు ఎంపీ అభ్యర్థి కోసం దేవులాడుకొనే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

నెల్లూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : 'చంద్రబాబు పాకులాడుతాడుకానీ జిల్లా తెలుగుదేశంలో నాయకుడు ఎవడున్నాడని. వైసీపీ అభ్యర్థులకు దీటైన వారు ఆ పార్టీలో ఎవరున్నారని?' టీడీపీ గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్యనాయకులు ప్రస్తావించే మాటలివి. వైసీపీకి దీటైన నాయకులు టీడీపీలో లేరనేది ఆ పార్టీ ధీమా. అయితే చూస్తుండగానే ఆ పరిస్థితులు మారిపోయాయి. టీడీపీ అభ్యర్థులకు దీటైన వారి కోసం వైసీపీ వెతుకులాడే పరిస్థితి ఏర్పడింది. మూడు రోజుల క్రితం వరకు నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి ఎవరనే విషయంలో టీడీపీలో క్లారిటీ లేదు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, అబ్దుల్ అజీజ్ ఇలా ఆప్షన్లు పెట్టుకున్నారు కానీ అభ్యర్థుల విషయంలో క్లారిటీ లేదు. అయితే, ఈ విషయంలో వైసీపీ చాలా ముందు ఉండేది. పార్టీ అభ్యర్థిగా వీపీఆర్ కొన్ని నెలలకు ముందు నుంచే ప్రచారం మొదలు పెట్టారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో కలియ తిరిగారు. మొన్నటివరకు కూడా టీడీపీ నుంచి ఎంపీ అభ్యర్థి పేరుకాని, ప్రచారం కానీ జరగలేదు. అయితే, వీపీఆర్ మనస్తాపంతో ఒక్కసారిగా వైసీపీ సీన్ రివర్స్ అయింది. వైసీపీ ఎంపీ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న ఆయన తన వెనుక కుట్ర జరుగుతోందని, ఇందుకు పార్టీ అధిష్ఠానం సహకరించిందని, తనకు అక్కడ గౌరవం తగ్గిందని గ్రహించి పార్టీకి, పదవులకు రాజీనామా చేశారు. ఈ తరుణంలో తెలుగుదేశం ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని టీడీపీ ముఖ్యనాయకులంతా గురువారం వీపీఆర్ నివాసానికి వెళ్లి తమ పార్టీలోకి రమ్మని సాదరంగా ఆహ్వానించారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. వీపీఆర్ టీడీపీలో చేరుతున్న క్రమంలో నెల్లూరు పార్లమెంటుకు టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దించాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పుడు టీడీపీకి దీటైన అభ్యర్థి కోసం వెతుకులాడుకునే పరిస్థితి అధికార వైసీపీకి వచ్చింది.

రెండున్నరేళ్ల తర్వాత నగరంలోకి మేయర్!



వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఖలీల్‌తో పాటు పాల్గొన్న మేయర్

నెల్లూరు(సిటీ) : నగర పాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి రెండున్నరేళ్ల తర్వాత నగర నియోజకవర్గంలో తొలి అడుగుపెట్టారు. విరాట్ నగర్‌లోని వీబీఎస్ కల్యాణ మండపంలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. మేయర్‌గా బాధ్యతలు స్వీకరించాక ఇప్పటివరకు నగరంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలలో స్రవంతి పాల్గొనలేదు. నియోజకవర్గ సరిహద్దులకు కూడా రానివ్వకుండా నగర ఎమ్మెల్యే అనిల్ కార్యాలయం ఆంక్షలు విధించింది. అయితే, ఎమ్మెల్యేను నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పంపిన పార్టీ పెద్దలు ఆయన స్థానంలో డిప్యూటీ మేయర్ ఖలీల్‌ను నియమించారు. దీంతో ఆయన సహకారంతో తొలిసారిగా సిటీ నియోజకవర్గంలో మేయర్ అడుగుపెట్టడంతో తాజా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

యాప్‌లతో యాతన..

నోటీసులతో ఒత్తిళ్లు!

ఉపాధ్యాయులే టార్గెట్!

చార్జిమెమోలు, నోటీసులతో కలకలం

లొంగదీసుకునేందుకు ప్రభుత్వ యత్నం

ఆందోళన బాటలో ఉపాధ్యాయ సంఘాలు



పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయనందుకు 19 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజనానికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయలేదని 69 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థుల సంఖ్య తక్కువగా నమోదవుతున్నారంటూ 75 మంది హెచ్‌ఎంలకు ఇటీవల డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇలా గడిచిన నాలుగు రోజుల్లోనే వివిధ కారణాలతో 338 మంది హెచ్‌ఎంలు, టీచర్లకు నోటీసులు జారీ అయ్యాయి.



నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 22 : ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందా!? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననే చెబుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా నిర్బంధాన్ని పెంచిందన్న విమర్శలు టీచర్ల నుంచి వెల్లువెత్తుతున్నాయి. కొంతకాలం క్రితం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల ఆకస్మిక తనిఖీల పేరుతో టీచర్లను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు ఏదో ఒక తప్పు పట్టుకుని అధికారులందరి ముందు అవమానించడం, పరుష పదజాలం వాడిన సంఘటనలు తమను ఆవేదనకు గురిచేశాయని చెబుతున్నారు. తాజాగా జిల్లాలో 4 రోజులుగా 338 మంది హెచ్‌ఎంలు, టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తరగతి గదిలో చిన్న చిన్న తప్పులను పెద్దవిగా చూపిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటున్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించారన్న కారణంతో నాలుగు రోజుల క్రితం జిల్లాలో 175 మంది ప్రధానోపాధ్యాయులకు డీఈవో రామారావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ 10.30 గంటలలోపు యాప్ ద్వారా విద్యార్థులకు హాజరు వేయాల్సి ఉంటుంది. అయితే, 3,300 మంది విద్యార్థుల హాజరు వేయకపోవడంతో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేసి వెంటనే వివరణ అందచేయాలని ఆదేశించారు. అలాగే మరో మూడు రకాల కారణాలతో 163 మంది హెచ్‌ఎంలకు తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న హెచ్‌ఎంలు వెంటనే లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు.

● బోధనేతర పనులే అధికం

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులు నిత్యం యాప్‌లతో యాతన పడుతూ ప్రభుత్వ వేధింపులకు గురవుతున్నారు. పాఠశాలల్లో బోధన కంటే బోధనేతర పనులపైనే ఎక్కువ సమయం గడపాల్సి వస్తోంది. విద్యాశాఖ ప్రవేశపెట్టిన వివిధ యాప్‌లలో వివరాలు నమోదు చేయడానికి తంటాలు పడుతున్నారు. పిల్లలకు బోధించడానికి 8 పిరియడ్లు ఉంటే ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది యాప్‌ల నిర్వహణకే రోజుకు 3, 4 గంటల సమయం పడుతోందని గురువులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల్లో బోధన సకాలంలో పూర్తి చేయాలని, పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులను సంసిద్ధులను చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం తమపై కక్షగట్టి వేధింపులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని, తామంతా తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నామంటూ ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

● వేధించడమే లక్ష్యమా!?

ఉపాధ్యాయులను వేధించడమే లక్ష్యంగా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఉపాధ్యాయ సంఘాల నేతలు వాపోతున్నారు. పాఠశాల పర్యవేక్షణ, విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ తమను భయాందోళనకు గురిచేయడంతోపాటు టీచర్ల పట్ల చులకనభావం ఏర్పడేలా, మనోధైర్యాన్ని దెబ్బతీసేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పట్టించుకోకుండా ఉపాధ్యాయులపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా చిన్నచిన్న కారణాలతో షోకాజ్ నోటీసులతో బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. అధికారులు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు వారు మాత్రమే విధి నిర్వహణ చేస్తున్నట్లు తప్పులన్నీ టీయకంలపై వేయడం సరికాదని, అధికారులు వెంటనే నోటీసులు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంఘాలన్నీ ఏకమై ఐక్య కార్యాచరణతో తమకు జరిగే అన్యాయాలపై పోరాడతామని స్పష్టం చేస్తున్నారు.

విధులపై సంజాయిషీ కోరాం

పాఠశాలల్లో నిత్యం జరగాల్సిన పనులు, విధుల గురించి మాత్రమే ప్రశ్నిస్తున్నాము. ఎప్పుడు ఏ పనులు జరగాలో, అవి పూర్తి స్థాయిలో ఎందుకు జరగడం లేదో తమకు తెలియచేయాలని చెబుతున్నాము. ఉపాధ్యాయులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించమని చెప్పడం శాఖాపరమైన అంశాలే కానీ మరే ఇతర కారణాలు లేవు. నోటీసులు అందుకున్న వారు కూడా తమను ఏ అంశంపై ప్రశ్నించారో దానిపై మాత్రమే సమాధానం ఇస్తే సరిపోతుంది. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- రామారావు, డీఈవో

మోటార్లకు మీటర్లు.. రైతుల మెడకు ఉరితాళ్లు



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 22: వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే రైతు మెడకు ఉరితాళ్లు బిగించడమేనని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయరంగానికి సక్రమంగా విద్యుత్ సరఫరా ఇవ్వక పోవడంతో పంటలు ఎండుదశకు చేరాయని వాపోయారు. ఏడు గంటల సరఫరాలోనూ అంతరాయాలు ఏర్పడటం విచారకరం అన్నారు. భూ సమస్యల విషయంలో రైతులు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా రెవెన్యూ అధికారులే సమస్యలు పరిష్కరించేలా చట్టబద్ధత చేయడం దారుణమన్నారు. రాజకీయ నాయకులు, భూస్వాములు అధికారులను లోబర్చుకొని సన్న, చిన్నకారు రైతులను ఇబ్బందులకు గురి చేస్తారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ


సూచనలిస్తున్న ఎంపీడీవో తాజ్ మన్సూర్

అనంతసాగరం, ఫిబ్రవరి 22: మండలంలోని లింగంగుంట సచివాలయాన్ని గురువారం ఎంపీడీవో తాజ్‌మన్సూర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్యసురక్ష క్యాంపు సర్వే, ఆయుష్మాన్‌భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల జారీ మరియు ఎన్రోల్మెంట్, వివిధ పథకాల అమలుతీరుపై సమీక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని సిబ్బందికి హెచ్చరించారు.

ఉదయగిరి: మండలంలోని నేలటూరు, కృష్ణంపల్లి సచివాలయాలను గురువారం ఎంపీడీవో ఈశ్వరమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. వివిధ సమస్యలపై వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టి నమూనాల సేకరణపై విశ్లేషణ

మర్రిపాడు, ఫిబ్రవరి 22: నవోదయ విద్యాలయంలో వ్యవసాయాధికారి బి.జ్యోత్స్న గురువారం మట్టి నమూనా సేకరణపై విద్యార్థులకు విశ్లేషణ చేశారు. ఆత్మపథకం ద్వారా ఈ అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భూసార ప్రాముఖ్యత, తద్వారా పంట దిగుబడులను మరియు మట్టి నమూనా సొంతంగా సేకరించటం, ప్రయోగశాలలో విశ్లేషించటం, ఎన్‌పికే, సేంద్రియ కర్బనం, సూక్ష్మపోషకాలు విశిష్టతను గురించి ఆత్మ పీడీ జి.శివనారాయణ వివరించారు. కార్యక్రమంలో రామ్మోహన్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు తదిదితరులు వున్నారు.

ఫ్యామిలీ వైద్యుల సేవలు సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 22: గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో 104 వాహనం ద్వారా అందించే ఫ్యామిలీ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి శివకల్పన తెలిపారు. గురువారం పట్టణంలోని సచివాలయం-1 పరిధిలోని స్థానికులకు వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా 55 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక రోగులకు నెలకు సరిపడా మందులు ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉదయగిరి, ఫిబ్రవరి 22: అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీవో పచ్చవ లావణ్య హెచ్చరించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలతో సమావేశం అయ్యారు. కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం వడ్డించాల.కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించాల న్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తేజస్విని, రత్న పాల్గొన్నారు.

ఎట్టకేలకు బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు, ఫిబ్రవరి 22: మండల తహసీల్దారుగా కె.అరుణాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న తహసీల్దారు ఇటీవల సస్పెన్షన్‌కు గురి కావడంతో ఆయన స్థానంలో కొండాపురం తహసీల్దారుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అపై ఎన్నికల బదిలీల్లో భాగంగా నరసారావుపేట నుంచి వచ్చిన చంద్రారెడ్డి ఈ నెల 7న బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తనదైన శైలిలో పావులు కలిపి ఆయన అనతి కాలంలోనే కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ చేయించుకొని వెళ్లారు. ఆయన స్థానంలో అదే కార్యాలయంలో డీఏవో విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. కాగా ఇక్కడి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ఆమె ఎంతమేర విధులు నిర్వర్తిస్తారోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై అవగాహన

సీతారామపురం, ఫిబ్రవరి 22: స్థానిక డిగ్రీ కాలేజ్, హరిజనవాడలో గురువారం నియోజకవర్గ చీఫ్ నోడల్ ఆఫీసర్ బాలకేశవులు స్థానికులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈవీఎం, వివి ప్యాడ్స్‌పై ఓటు వేసే విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, చీఫ్ అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ ఖాజారంతుల్లా, ఈవీఎం అవేర్నెస్ ఆఫీసర్ శ్రీనాథ్ రెడ్డి, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన


పాడి రైతుతో మాట్లాడుతున్న పశువైద్యాధికారులు

సంగం, ఫిబ్రవరి 22: స్థానిక పశువైద్య కేంద్రంలో గురువారం పాడి రైతులకు పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తక్కువ ఖర్చుతో అధిక పాల దిగుబడి సాధించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పాడి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా ఇటీవల కొన్ని ప్రాంతాల్లో కోళ్లకు వ్యాపించిన బర్డ్‌ఫ్లూ వ్యాధిపై తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ జయచంద్ర, పశు వైద్యాధికారి సురేష్ బాబు, పలువరు పాడి రైతులు పాల్గొన్నారు.

రెగ్యులర్ వీఆర్‌వో లేక ఇక్కట్లు

లింగసముద్రం, ఫిబ్రవరి 22 : లింగసముద్రం గ్రామానికి రెగ్యులర్ వీఆర్‌వో లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు.ఇక్కడ వీఆర్‌వోగా ఉన్న గోవిందరాజులు బదిలీపై వెళ్లిపోయారు.దీంతో అప్పటి నుంచి పెదపవని వీఆర్‌వో షేక్ మస్తాన్‌వలి ఇన్‌చార్జ్ వీఆర్‌వోగా ఉన్నారు. కొంతకాలానికి మస్తాన్‌వలిని చీమలపెంట, రాళ్లపాడు గ్రామాలకు ఇన్‌చార్జ్ వీఆర్‌వోగా నియమించారు. ప్రస్తుతం మాలకొండరాయునిపాలెం వీఆర్‌వో షేక్‌జకీరా లింగసముద్రం ఇన్‌చార్జి వీఆర్‌వోగా పనిచేస్తున్నారు. తనను జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసమే నియమించారని ఆమె తెలిపారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి శ్రీచరణ్ చెప్పారు. లింగసముద్రం గ్రామానికి ఇకనైనా రెగ్యులర్ వీఆర్‌వోను నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజ


ప్రత్యేక అలంకరణలో సరస్వతిదేవి, పూజల్లో పాల్గొన్న విద్యార్థులు

సంగం, ఫిబ్రవరి 22: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు గురువారం భక్తిశ్రద్ధలతో సరస్వతిదేవి పూజలు న్విహించారు. త్వరలో జరగబోవు పది, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులను ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. మధ్యాహ్నం నుంచి విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉల్లాసంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి


సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి శివకల్పన

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 22: వచ్చేనెల 3, 4, 5వ తేదీల్లో జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైద్యాధికారులు శివకల్పన, వినీతలు తెలిపారు. గురువారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, పర్యవేక్షకులకు ఇర్వహించిన శిక్షణలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమ నిర్వహణకు నియమించిన సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. మండలాన్ని ఐదు రూట్లుగా విభజించి 52 పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి 206 మంది సిబ్బందిని నియమించామన్నారు. మండలంలో 0-5 ఏళ్లు నిండిన వారు 3,451 మంది ఉన్నారన్నారు. తల్లిదండ్రులు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకుడు చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ


ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ, పాల్గొన్న భక్తులు

సంగం, ఫిబ్రవరి 22: మండలంలోని దువ్వూరులోని పంచాయతీ స్థలంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం గ్రామస్థులు భూమిపూజ నిర్వహించారు. వేద పండితులు ఆధ్వర్యంలో సర్పంచు మారెళ్ల కృష్ణమ్మ ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ సాదిక్ హుసేన్

ఏఎస్ పేట, ఫిబ్రవరి 22: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయలంలో గురువారం ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మమ్మ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థినులు సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు బిఎస్‌ఆర్ ఆసుపత్రి నిర్వాహకురాలు షకీలా సహకారంలో 10, ఇంటర్ విద్యార్థినులకు ప్యాడ్స్‌పేన్స్, ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ సాదిక్ హుసేన్, ఎన్జీవో శ్రీహరి పాల్గొన్నారు.

ఎండను భరించలేక..


ఉదయగిరి మండలంలోని దాసరిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి సమీపంలో భానుడి దెబ్బకు తట్టుకోలేక మూగజీవాలు ఓ చెట్టు నీడన ఎలా సేదతీరుతున్నాయో.. చూడండి. ఫిబ్రవరిలోనే ఎండలు ఇలా ఉంటే మార్చిలో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. - ఉదయగిరి రూరల్

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వేమిరెడ్డిని కలిసిన టీడీపీ నేతలు


వేమిరెడ్డిని సత్కరిస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర నేతలు

కందుకూరు, ఫిబ్రవరి 22: నియోజకవర్గ టీడీపీ నేతలు గురువారం నెల్లూరులో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు మాజీమంత్రి పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, ఇతర టీడీపీ నేతలతో కలిసి వేమిరెడ్డిని కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక నేతలను వేమిరెడ్డికి పరిచయం చేసి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను వివరించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, మాదాల లక్ష్మీనరసింహ్మం తదితరులు పాల్గొన్నారు.

- **వేమిరెడ్డితోనే ప్రయాణం**

వరికుంటపాడు : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితోనే తన రాజకీయ ప్రయాణం సాగుతుందని అధికార పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర తెలిపారు. గురువారం వేమిరెడ్డితో జరిగిన భేటీలో రాజకీయ భవిష్యత్తు పై నిర్ణయం తీసుకొనే రీతిలో చర్చలు సాగించారు.

- **వేమిరెడ్డిని కలిసిన చెంచలబాబు**

ఉదయగిరి రూరల్ : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గురువారం నెల్లూరులోని ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర నేత పీ చెంచల బాబుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

నేత్రానందంగా శ్రీవారి తెప్పోత్సవం


తెప్పపై ఊరేగుతున్న శ్రీవారు

కావలిటౌన్, ఫిబ్రవరి22: ముసునూరులోని హనుమత్ క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి గురువారం రాత్రి నిర్వహించిన తెప్పోత్సవం నేత్రానందంగా సాగింది. ఉదయం ఆలయ వ్యవస్థాపక అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారిని ఆలయం నుంచి బాణసంచా కాల్చుతూ, కోలాటాలు, బ్యాండ్ మేళాల మధ్య మండాడి చెరువు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ కనుల పండువగా తెప్పోత్సవం నిర్వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

ల్యాంకో గ్రూపు ప్రతినిధి రాక

కావలిటౌన్, ఫిబ్రవరి22: మద్దూరుపాడులోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలను గురువారం ఖతార్‌లోని ల్యాంకో గ్రూప్ ప్రతినిధి అశోక్‌రాజు సందర్శించారు. డీబీఎస్ కార్యదర్శి దామిశెట్టి బాలసురేష్‌బాబు, ప్రిన్సిపాల్ టీవీ రావులు తదితరులు అశోక్‌రాజు కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఖతార్‌లోని ల్యాంకో గ్రూపుతోపాటు వివిధ కంపెనీల్లో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండాపురంలో సరస్వతి పూజ

కొండాపురం, ఫిబ్రవరి22: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ ఎం.శ్రీహరి ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1 నుంచి జరగబోయే పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ఇటు కళాశాలకు అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. అలాగే 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులను ఆయన అందచేశారు.

కొనసాగుతున్న పోలీసు పహారా

లింగసముద్రం, ఫిబ్రవరి 22 : మండలంలోని పెదపవని లో ఓ వివాదాస్పద స్థలంలో గది కట్టే విషయమై ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో ఆ స్థలం వద్ద పంచాయతీ కార్యదర్శి, పోలీసులు గురువారం కూడా కాపలా కాస్తున్నారు.గ్రామంలోని సర్వే నంబరు 439/1లో ఓ వ్యక్తి బుధవారం సాయంత్రం గది కట్టేందుకు ప్రయత్నించాడు. మైనార్టీలు అడ్డుకుని ఈ స్థలం తమ పీర్ల చావిడికి చెందిన స్థలమన్నారు. ఈ స్థలం తనదని, పీర్లచావిడికి సంబంధం లేదని ఆ వ్యక్తి వాదనకు దిగారు.దీంతో ఇరువర్గాల మధ్య వాదనలు జరిగాయి. విషయం తెలిసిన అధికారులు ఎస్సై ఎం బాజీబాబుకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే ఎస్సై ఆ స్థలం వద్దకు వెళ్లి ఇరువర్గాలకు సర్దిచెప్పి చెప్పారు.అనంతరం పోలీసులను అక్కడ కాపలా ఉంచారు.

190 సీసాల మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యం సీసాలతో ఎస్ఐ, సిబ్బంది

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 22 : మూడు చక్రాల మోటారుబైకుపై తీసుకెళ్తున్న 190 మద్యం సీసాలను గురువారం ఎస్ఐ బాలమహేంద్రనాయక్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ సంఘటన మండలంలోని మొగిలిచెర్లకు వెళ్లే మూడు రోడ్ల కూడలిలో జరిగింది. లింగసముద్రం మండలం మొగిలిచెర్ల పంచాయతీ బుర్రారెడ్డిపాలెంకి చెందిన వెన్నపూస వెంకటేశ్వర్లు మూడు చక్రాల మోటారుబైకుపై ప్రభుత్వం మద్యం దుకాణం నుంచి అక్రమంగా 190 మద్యం సీసాలను తీసుకెళ్తుండగా ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

అమర ఆశయాలు నెరవేర్చుతాం

బిట్రగుంట, ఫిబ్రవరి 22: స్వర్గీయ బచ్చు అమర ఆశయాలను నెరవేర్చుతామని ఆమె తమ్ముడు, ప్రవాస భారతీయుడు బచ్చు కృష్ణకుమార్, సంధ్య అన్నారు. బోగోలులోని సాయిమందిరంలో గురువారం రాత్రి కృష్ణకుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనందసాగర్, గోపిశెట్టి వెంకయ్య, ట్రస్ట్ సభ్యులు బీ.సుధాకర్, హరిబాబు, తోటపల్లి సాగర్, సాయి సేవకులు విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

- **సాయినాథుడికి ప్రత్యేక పూజలు**

బోగోలు రాజావీధిలోని షిర్డీ సాయినాథుడికి గురువారం ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. అమరా బచ్చు ట్రస్ట్ అధినేతలు కృష్ణకుమార్- సంధ్య దంపతుల తరఫున వేణుగోపాల్-లక్ష్మి దంపతులు అభిషేక, అన్నసంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక


కావ్య క్రిష్ణారెడ్డితో మాజీ కౌన్సిలర్ శివ

కావలి, ఫిబ్రవరి 22 : మాజీ కౌన్సిలర్ బిట్రగుంట శివ తోపాటు పలు వార్డులకు చెందిన వైసీపీ నాయకులు గురువారం టీడీపీలో చేరారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన వైసీపీ నేతలకు ఇన్‌చార్జి కావ్య క్రిష్ణారెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అలాగే 5,6,7 వార్డులకు చెందిన యువత, వైసీపీ యువనాయకుడు జనిగర్ల మనోహర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోట్లూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా 33వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు షట్టం శ్రీను కూడా టీడీపీలో చేరారు. ఆ వార్డులో జరిగిన కార్యక్రమంలో కావ్య క్రిష్ణారెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జ్వాలా సుబ్రహ్మణ్యం, జ్వాలా చంద్రశేఖర్, కర్నాటి సుబ్బారావు, పట్నం శివ, షట్టం సుబ్బారావు, శ్రీహరి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

- **2వ వార్డులో బాబు ష్యూరిటీ..**

కందుకూరు : పట్టణంలోని 2వ వార్డు ఉర్దూ స్కూల్ ప్రాంతంలో గురువారం సాయంత్రం టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ నాగూర్, కూనం నరేంద్ర, యర్రా మునలయ్య, మల్లికార్జున, ఖాదర్‌బాషా, రఘు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి నోటీసా ? : చింతాల


మాట్లాడుతున్న చింతాల వెంకట్రావు తదితరులు

కావలి, ఫిబ్రవరి22: పోలీసులు అర్ధరాత్రి తలుపులు తట్టి ఎలాంటి స్టాంపులేని నోటీసు తీసుకువచ్చి తన ఇంటి ముందు హడావిడి చేయటం ఏమిటని కావలి కాంగ్రెస్ ఇన్‌చార్జి చింతాల వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలి జర్నలిస్టుక్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీనియర్ న్యాయవాదినన్న గౌరవం కూడా లేకుండా పోలీసులు ప్రవర్తించిన తీరు బాగాలేదన్నారు. దీంతో సీఐపై కోర్టులో రిట్‌పిటిషన్ వేయనున్నట్లు చెప్పారు. వెలగపూడి సచివాలయ ముట్టడికి వెళ్లకుండా నోటీసులు ఇచ్చామని పోలీసులు చెప్పారన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్. సురేష్‌బాబు తదితరులు మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు అనుమలశెట్టి వాసు, గుమ్మా మానస, మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లదే కీలకపాత్ర


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు, ఫిబ్రవరి 22 : రానున్న ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించాల్సింది వలంటీర్లేనని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. అల్లూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం వలంటీర్ల అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను అందించినట్లుగా, ఎన్నికల రోజున ప్రతి ఒక్కరి చేత జగనన్న ప్రభుత్వానికి ఓటు వేయించే ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సేవా వజ్ర, సేవా రత్న, తదితర ప్రోత్సాహకాలను వారిని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డీ శశిరేఖ, తహసీల్దారు దుర్గేశ్వరరావు, ఎంపీడీవో జ్యోతి, నాయకులు బీద రమేష్, బిట్రగుంట రమేష్‌రెడ్డి, ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జనసేన నేతలు

గుడ్లూరు, ఫిబ్రవరి 22 : గుడ్లూరులో గురువారం జనసేన పార్టీ కార్యాలయాన్ని కందుకూరు నియోజకవర్గ జనసేన నాయకులు దేవళ్ల భాస్కర్‌రావుతోపాటుగా మరికొందరు కలిసి ప్రారంభించారు. తొలుత జనసేన నాయకులు సినిమాహాల్ సెంటర్ నుంచి ప్రదర్శనగా వచ్చి బస్టాండ్ సెంటర్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో దేవళ్ల భాస్కర్ రావు మాట్లాడుతూ టీడీపీ- జనసేన కూటమికి ప్రజల్లో ఆదరణ మరింతగా పెరిగిందన్నారు. అనంతరం మండలంలోని చినలాటవరపికి, వెంకంపేటకు గ్రామాలకు చెందిన 12 కుటుంబాలవారు జనసేనలో చేరారు. తదుపరి చినలాటవరపిలో జనసేన జెండా ఆవిష్కరణ నిర్వహించారు. కార్యాక్రమంలో చిట్టెం ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, కొనిదెన శ్రీనివాసులు, గోకరాజు మదన్, ఇనకొల్లు శ్రీనివాసులు, మూలగిరి శ్రీనివాసులు, అన్నంగి చలపతి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు క్యూరింగ్‌లో మెలకువలు పాటించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 22 : పొగాకు క్యూరింగ్‌లో మెలకువలు పాటించాలని కందుకూరు 2వ వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని శింగమనేనిపల్లెలో రేకలలోని క్యూరింగ్ అయిన పొగాకు నాణ్యతను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రేడింగ్ సమయంలో రైతులు మెలకువలు పాటించాలన్నారు. పంటకు వచ్చిన ఆకులనే రెలపాలని తెలిపారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ ప్రతినిధి దివ్యశ్రీ, రామాంజనేయులు, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల అరెస్టు

కందుకూరు, ఫిబ్రవరి 22: రాష్ట్ర సచివాలయం ముట్టడికి వెళ్తున్న కందుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు చిలకపాటి సుశీలను విజయవాడలో పోలీసులు అరెస్టు చేశారు. ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు గురవారం కాంగ్రెస్ నేతలు ఒక ప్రకటనలో తెలిపారు.

అటవీ భూముల ఆక్రమణ


అటవీ భూములు అక్రమించి సాగు చేసిన పొగాకు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 22: మండలంలోని కొంతమంది అటవీ భూములను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని అయ్యవారిపల్లె, చుండి, మాలకొండ రామలింగాపురం, పోలినేనిచెరువు, గరుకుపాలెం, పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, వలేటివారిపాలెం, లక్ష్మక్కపల్లె గ్రామాల్లో 10,918.26 ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. అందులో సుమారు 3 ఎకరాలకు పైగానే ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది. ఈ భూముల్లో బోర్లు వేసి పొగాకు, మిర్చి, మినుము, కంది, ఉలవ, ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాక అడవుల్లోని వృక్ష సంపదను కొల్లగొట్టి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అటవీ భూములను కాపాడాలి.